# భారత శక్తి

VOICE OF INDIAN

Published from Hyderabad, Kadapa, Guntur, Kurnool, Khammam, Vijayawada & Warangal

| సంపుటి : 20 | సంచిక : 310 | మంగళవారం,జూన్ 2 , 2026 | పేజీలు : 12 | వెల : 1.00 |
|---|---|---|---|---|


## పశ్చిమాసియాలో శాంతికి 'భారత్' ఒక్కటే మార్గం: ఇజ్రాయెల్



భౌగోళిక ఉద్రిక్తతలు, ఆర్థిక అనిశ్చితి నేపథ్యంలో పశ్చిమాసియా ప్రాంతంలో శాంతి భద్రతలను నెలకొల్పడానికి భారతదేశం అత్యంత కీలకమైన పాత్ర పోషించాల్సి ఉందని ఇజ్రాయెల్ రాయబారి రూవెన్ అజర్ అభిప్రాయపడ్డారు. వేగంగా ఎదుగుతున్న ఆర్థిక శక్తిగా, బలమైన వాణిజ్య భాగస్వామిగా భారత్ ఈ ప్రాంత ముఖచిత్రాన్ని మార్చేయగలదని ఆయన ఆశాభావం వ్యక్తం చేశారు. ట్రిలియన్ డాలర్ల వ్యాపారానికి వేదిక ప్రపంచంలోని అన్ని ప్రధాన వాణిజ్య కూటములతో భారత్ చారిత్రాత్మక ఒప్పందాలను కుదుర్చుకుందని రూవెన్ అజర్ గుర్తుచేశారు. "పశ్చిమాసియా ప్రాంతంలో శాంతిని నెలకొల్పి,

2లో..




# కారులో "వార్".!

నియోజకవర్గంలో జరుగుతున్న పరిణామాలను బహిర్గతం చేస్తే నువ్వేనా విలేకరవు.? అని బిఆర్ఎస్ బాస్ వ్యంగ్యాస్త్రాలతో సంబోధిస్తున్నారు. అనుకూలంగా వార్తలు వస్తే సోషల్ మీడియాలో స్టేటస్ లు పెట్టుకొని పొగడ్తలతో అందలం వెక్కిస్తారు. వ్యతిరేకంగా వస్తే బెదిరింపులకు పాల్పడుతున్నారు. కొంతమంది నేతలైతే జీర్ణించుకోలేక స్థాయిని మరిచి భౌతికంగా దాడులకు దిగుతున్నారు. లేకుంటే పోలీస్ కేసుల్లో ఇరికించే ప్రయత్నాలు చేస్తున్నారు. రాజకీయంగా పార్టీలో ప్రస్తుతం జరుగుతున్న సమీకరణాలపై వార్తలు వ్రాస్తే రాజకీయ పార్టీల నేతల అసలు రంగు బయటపడు తుందన్నడంలో సందేహం లేదు. వివరాల్లోకి వెళ్తే.. ఉద్యమ పార్టీగా ఆవిర్భావించి తదనంతరం జాతీయ పార్టీగా రూపాంతరం చెందిన బీఆర్ఎస్ (భారత రాష్ట్ర సమితి)కి రానున్న ఎంపిటిసి, జడ్పిటిసి ఎన్నికల ముందే పినపాక నియోజకవర్గంలోని మండలాల్లో కొత్త సమస్యలు ఎదురవుతున్నాయి. నిన్నమొన్నటి వరకు నాయకత్వం కనుసన్నల్లో ఉన్న నేతలు ఒక్కసారిగా తమ అసంతృప్తిని బాహాటంగా ఎగురవేయడం చర్చనీయాంశంగా మారింది.

### పినపాకలో రచ్చకెక్కిన కారు

పినపాక మండలంలో మరో మారు కారు రచ్చకెక్కింది. ఇటీవలే మంత్రి తుమ్మల నాగేశ్వరరావు జన్మదిన వేడుకల సందర్భంగా అభిమానులు నిర్వహించిన వేడుకలలో బిఆర్ఎస్ పార్టీ నాయకులు పాల్గొనడంతో పాత కొత్త నేతల మధ్య సోషల్ మీడియా వేదికగా రచ్చ మొదలైంది. ఒకరిపై ఒకరు విమర్శలు, పత్రిక ప్రకటనలు చేసుకోవడం, అధిష్టానానికి తెలియకుండా ప్రెస్ మీట్ పెట్టి పార్టీ నుండి బహిష్కరణ వేటు వేయడం పినపాక లో కలకలం సృష్టించింది. అధిష్టానానికి ఇది కొత్త తలనొప్పిగా మారి బుజ్జగింపు చర్యలు చేపట్టారు. అయితే పార్టీకి విధేయులుగా ఉన్న ఈ సీనియర్ నాయకులు గతంలో ఎన్నడూ కూడా పార్టీ లైన్ దాటలేదు. అలాంటి వారు ఒక్కసారిగా తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేయడమే కాక ప్రెస్‌మీట్ కూడా పెట్టడం తీవ్ర దుమారం చెలరేగింది.

### నేతల మధ్య వర్గ విభేదాలు

మణుగూరు, అశ్వాపురం, బూర్గంపాడు ప్రాంతాల్లో పార్టీ నాయకత్వంపై అసంతృప్తి వ్యక్తం చేస్తున్న నేతల సంఖ్య పెరుగుతోందనే ప్రచారం జరుగుతోంది. కొందరు నాయకులు బహిరంగంగానే తమ అభిప్రాయాలను వ్యక్తం చేస్తుండగా, మరికొందరు అంతర్గత సమావేశాల్లో తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేస్తున్నట్లు తెలుస్తోంది. నివురు గప్పిన నిప్పులా ఉన్న వివాదాలు ఎప్పుడైనా బద్దలయ్యే అవకాశాలున్నాయి. అధికారం ఉన్నప్పుడు వర్గాలుగా చీలి పరస్పర దాడులు చేసుకున్న సందర్భాలు కూడా ఉన్నాయి. పార్టీలో మండలాలకు యువ రక్తానికి బాధ్యతలు అప్పగించడంతో సీనియర్లు గుర్రుగా ఉన్నారనే వదంతులు బాహాటంగానే వినిపించాయి. యువ నాయకత్వం వలన మండలాల్లో కొందరి మాటే నెగ్గుతోంది. ఒక విధంగా చెప్పాలంటే ప్రజల్లో పరపతి ఉన్న నేతలకు పార్టీ అధినాయకత్వం వద్ద పెద్ద విలువ ఉండడం లేదనే విమర్శలు ఉన్నాయి. భూ దందాలు, సెటిల్మెంట్లు, ఇసుక వ్యాపారాలు చేసుకునే ప్రజా ప్రతినిధుల మాటే పార్టీలో చెల్లుబాటు అవుతుందనీ సీనియర్ నాయకులు పెదవి విరుస్తున్నారు.

### బిఆర్ఎస్ నేతల చూపు కాంగ్రెస్ వైపు

బీఆర్ఎస్ లో అసంతృప్తితో ఉన్న నేతలు అధికార పార్టీ వైపు దృష్టి సారిస్తున్నారు. దీంతో అసమ్మతి నేతలు గోడ దుక్కేందుకు సంసిద్ధంగా ఉన్నట్లు తెలుస్తోంది. యువ నేతల ధోరణి నచ్చకపోవడంతో ఇన్నాళ్లు సైలెంట్ గా ఉండి అదును చూసి పెద్ద సార్ దగ్గర గళం విప్పేందుకు సిద్ధమవుతున్నట్లు సమాచారం. పార్టీ కార్యక్రమాల నుంచి స్థానిక వ్యవహారాల వరకు పలువురు నాయకుల మధ్య సమన్వయం లోపించడం, వర్గ విభేదాలు బహిర్గతం కావడం కార్యకర్తల్లో ఆందోళన కలిగిస్తోంది. గత స్థానిక ఎన్నికల్లో ఆధిపత్య పోరు, పదవుల పంపకం, పార్టీ కార్యక్రమాల్లో ప్రాధాన్యత వంటి అంశాలు విభేదాలకు కారణమవుతున్నాయనే అభిప్రాయాలు వినిపిస్తున్నాయి. ఒక వర్గం చేపట్టే కార్యక్రమాలకు మరో వర్గం దూరంగా ఉండడం, సమన్వయం లేకపోవడం పార్టీ శ్రేణులను అయోమయానికి గురిచేస్తోంది.

### అసమ్మతి నేతల గళం ఎందుకు పెరుగుతోంది.?

పార్టీ కోసం ఏళ్ల తరబడి పనిచేసిన వారికి తగిన గుర్తింపు లేదని కొందరు నేతలు భావిస్తున్నట్లు తెలుస్తోంది. కీలక నిర్ణయాల్లో తమను సంప్రదించడం లేదని, కొద్దిమందికే ప్రాధాన్యత లభిస్తోందని అసమ్మతి వర్గాలు ఆరోపిస్తున్నాయి. అధికారంలో ఉన్నప్పుడు, ప్రతిపక్షంలో ఉన్న ప్రజల్లో పరపతి, విలువలు కలిగిన సీనియర్లకు కనీసం గుర్తింపు నివ్వడం లేదని అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు.

### కార్యకర్తల్లో ఆందోళన.!

నియోజకవర్గంలో నాయకుల వర్గ మధ్య విభేదాల ప్రభావం క్షేత్రస్థాయి కార్యకర్తలపై పడుతోందని రాజకీయ పరిశీలకులు పేర్కొంటున్నారు.
పార్టీ బలోపేతం కంటే అంతర్గత వివాదాలే ఎక్కువగా చర్చకు వస్తుండటంతో కార్యకర్తలు నిరుత్సాహానికి గురవుతున్నారనే అభిప్రాయం వ్యక్తమవుతోంది.

### అధిష్ఠానం జోక్యం చేసుకుంటుందా.?

పరిస్థితి మరింత ముదరకముందే పార్టీ అధిష్ఠానం జోక్యం చేసుకుని అసమ్మతి నేతలతో చర్చలు జరపాలని కార్యకర్తలు కోరుతున్నారు. విభేదాలను పరిష్కరించి అందరినీ ఒకే వేదికపైకి తీసుకురాకపోతే భవిష్యత్తులో మరిన్ని రాజకీయ పరిణామాలు చోటుచేసుకునే అవకాశం ఉందనే చర్చ సాగుతోంది. మొత్తానికి, మణుగూరు, పినపాక బీఆర్ఎస్‌లో వినిపిస్తున్న అసమ్మతి స్వరాలు తాత్కాలికమా? లేక పెద్ద రాజకీయ ప్రకంపనలకు నాంది పలుకుతాయా.? అనే ప్రశ్నకు రానున్న రోజుల్లోనే సమాధానం దొరకనుంది.

# వానాకాలం సన్నద్ధతపై సర్కార్ నజర్!



జలాశయాల గేట్ల మరమ్మతులను యుద్ధప్రాతిపదికన పూర్తి చేయాలని ముఖ్యమంత్రి ఆదేశించారు. గతంలో కడెం ప్రాజెక్టులో తలెత్తిన సాంకేతిక ఇబ్బందులను ఈ సందర్భంగా ప్రస్తావించారు. గేట్ల నిర్వహణ, మరమ్మతుల కోసం ఇప్పటికే రూ. 300 కోట్లు విడుదల చేశామని ఆర్థిక శాఖ అధికారులు తెలపగా, అవసరమైతే మరిన్ని నిధులు ఇచ్చేందుకు ప్రభుత్వం సిద్ధంగా ఉందని సీఎం ప్రకటించారు. ఈ వానాకాలంలో జలాశయాల నిర్వహణలో ఏ చిన్న లోపం తలెత్తినా అధికారులపై కఠిన చర్యలు ఉంటాయని హెచ్చరించారు.

### పంటల వైవిధ్యం.. 'కృత్రిమ మేధ'తో అవగాహన

వాతావరణ శాఖ అంచనాల ప్రకారం వ్యవసాయ శాఖ వ్యూహాత్మకంగా వ్యవహరించాలని సీఎం సూచించారు. తక్కువ నీటితో పండే ప్రత్యామ్నాయ పంటలు, పంట మార్పిడి విధానాలపై రైతు వేదికల ద్వారా రైతుల్లో అవగాహన కల్పించాలి. ఈ అవగాహన కోసం కృత్రిమ మేధ (ూ×) సాంకేతికతతో రూపొందించిన లఘు చిత్రాలను, దృశ్య శ్రవణ (వీడియో) మాధ్యమాలను ప్రదర్శించాలి. టీవీ ఛానళ్లలోనూ వీటిని ప్రసారం చేయాలి. లిరామగుండం కర్మాగారం నుంచి ఉత్పత్తి అయ్యే యూరియాను పూర్తిగా తెలంగాణకే కేటాయించేలా కేంద్ర ప్రభుత్వానికి లేఖ రాయాలని నిర్ణయించారు.

### బాధితులకు తక్షణ సాయం.. పాత హామీలపై నివేదిక

గత ఏడాది వరదల సమయంలో కామారెడ్డి, ఖమ్మం, వరంగల్ జిల్లాల పర్యటనలో తాను ఇచ్చిన హామీల ప్రగతిపై సీఎం ఆరా తీశారు. హామీల అమలులో నిర్లక్ష్యం వహించిన అధికారులపై క్రమశిక్షణా చర్యలు ఉంటాయన్నారు. వరదలు, ప్రకృతి విపత్తుల వల్ల ప్రాణ, ఆస్తి, పశు నష్టం వాటిల్లితే తక్షణమే ప్రథమ సమాచార నివేదిక (ఫ్×=) నమోదు చేసి, బాధిత కుటుంబాలకు పరిహారం అందించాలన్నారు. దెబ్బతిన్న రహదారులు, వంతెనల పునర్నిర్మాణానికి విపత్తు నిర్వహణ శాఖ వద్ద ఉన్న రూ. 1000 కోట్లను నిబంధనల ప్రకారం ఖర్చు చేయాలని సూచించారు.

### నగరంలో వరద నివారణ చర్యలు

నగర పరిధిలో వర్షపు నీరు నిలిచే 141 ప్రాంతాలను గుర్తించి, అక్కడ "నీటి సంరక్షణ బావులు (వాటర్ హార్వెస్టింగ్ వెల్స్) నిర్మించే ప్రక్రియను వేగవంతం చేయాలని సీఎం ఆదేశించారు. ఇప్పటికే 11 బావుల నిర్మాణం పూర్తయిందని అధికారులు తెలపగా, మిగిలిన పనుల పురోగతిని నిరంతరం పర్యవేక్షించే బాధ్యతను సీనియర్ అధికారి జయేశ్ రంజన్‌కు అప్పగించారు. వానాకాలంలో నగర సమస్యల పరిష్కారానికి ముగ్గురు పురపాలక సంఘ కమిషనర్లు, ముగ్గురు పోలీసు కమిషనర్లు సమన్వయంతో పని చేయాలన్నారు.

### తాగునీటికి డోకా లేదు

ఎలాంటి పరిస్థితులు ఎదురైనా రాష్ట్రంలో తాగునీటి ఎద్దడి రాకుండా ముందస్తు ప్రణాళికలు సిద్ధం చేయాలని సీఎం స్పష్టం చేశారు. అవసరాలకు అనుగుణంగా తాగునీరు, సాగునీరు, పారిశ్రామిక అవసరాలకు నీటి కేటాయింపులు జరపాలన్నారు. భారీ వర్షాలు, ఈదురు గాలుల వల్ల విద్యుత్ స్తంభాలు, పరివర్తకాలు (ట్రాన్స్‌ఫార్మర్లు) దెబ్బతింటే తక్షణమే పునరుద్ధరించేలా విద్యుత్ శాఖ అవసరమైన సామగ్రిని ముందే సిద్ధం చేసుకోవాలని ఆదేశించారు.

### కలెక్టర్లు, ఎస్పీల సమన్వయమే కీలకం,

జిల్లా స్థాయిలో ప్రజల సమస్యల పరిష్కారానికి కలెక్టర్లు, జిల్లా పోలీసు అధికారులు (ఎస్పీలు) క్రమంతప్పకుండా సమావేశం కావాలని సీఎం రేవంత్ రెడ్డి దిశా నిర్దేశం చేశారు. రెవెన్యూ, పోలీసు, వైద్యారోగ్య, విద్యుత్, పంచాయతీరాజ్, పట్టణాభివృద్ధి శాఖలు సమన్వయంతో ముందుకు సాగినప్పుడే క్షేత్రస్థాయిలో పాలన విజయవంతమవుతుందని పేర్కొన్నారు. ఈ ఉన్నత స్థాయి సమీక్షా సమావేశంలో ప్రజాప్రతినిధులు, ప్రభుత్వ ఇన్‌ఛార్జ్ పీఏ, రక్షకభట నిలయ ప్రధాన అధికారి (DGP) సి.వి. ఆనంద్, వివిధ శాఖల ముఖ్య కార్యదర్శులు, ఉన్నతాధికారులు మరియు హైదరాబాద్, సైబరాబాద్, మల్కాజిగిరి పరిధిలోని కమిషనర్లు పాల్గొన్నారు.

# హైడ్రా యాక్షన్ ప్లాన్



క్షేత్రస్థాయి పరిశీలనలో గుర్తించారు. ఇందులో అత్యంత తీవ్రమైనవి 83, మధ్యస్థమైనవి 95, స్వల్ప ఇబ్బందులు ఉన్నవి 24 ప్రాంతాలుగా వర్గీకరించారు. రాబోయే 15 రోజుల్లో ఈ ముంపు సమస్యలన్నింటికీ శాశ్వత పరిష్కారం కనుగొనాలని, ఇందుకోసం అన్ని ప్రభుత్వ శాఖలు ఒకే తాటిపైకి వచ్చి సమన్వయంతో పనిచేయాలని హైడ్రా కమిషనర్ ఆదేశించారు.

### జాప్యాన్ని సహించేది లేదు.. అధికారులకు హైడ్రా కమిషనర్ హెచ్చరిక:

"కేవలం ఇతర శాఖల అనుమతుల కోసం లేఖలు రాశామని ఫైళ్లు ముట్టజెప్పి చేతులు దులుపుకుంటే కుదరదు. సమస్యల తీవ్రతను బట్టి తక్షణమే ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లాలి. నిధులు, అనుమతుల నెపంతో పనుల్లో జాప్యం జరిగితే సహించేది లేదు."

### ఐటి కారిడార్ రక్షణకు చతుర్విధ వ్యూహం!

రహదారులపై వరదలు రాకుండా, ట్రాఫిక్ స్తంభించకుండా ఉండేందుకు హైడ్రా కమిషనర్ నాలుగు ప్రధాన సూత్రాలను ఖరారు చేశారు:
మొదటి ప్రాధాన్యం పూడికతీతకే: నగరంలోని ప్రధాన వరద కాలువలు, నాళాల్లో ఉన్న పూడికను పూర్తిగా తొలగించే పనులకు ప్రథమ ప్రాధాన్యం ఇవ్వాలి. ముందస్తు కొమ్మల కత్తిరింపు: గాలివానలు వీచినప్పుడు విరిగిపడే ప్రమాదమున్న వృక్షాలను ముందుగానే గుర్తించి, వాటి కొమ్మలను శాస్త్రీయంగా కత్తిరించాలి.

### మ్యాన్‌హోల్స్ పటాల గుర్తింపు:

వర్షం పడినప్పుడు రోడ్లపై తెరిచి ఉంచే మ్యాన్‌హోల్స్ వల్ల ప్రాణనష్టం జరగకుండా, వాటి స్థానాలను స్పష్టంగా తెలిపేలా డిజిటల్ పటాలను (మ్యాపింగ్) సిద్ధం చేయాలి.

### ప్రత్యామ్నాయ మార్గాల సమాచారం:

కేవలం లఘు సందేశాల (ూమీ) ద్వారా భారీ వర్షాల సమాచారం ఇవ్వడమే కాకుండా, వరద ముప్పు ఉన్న మార్గాల వివరాలను, ప్రత్యామ్నాయ ప్రయాణ దారులను ప్రజలకు ఎప్పటికప్పుడు చేరవేయాలి. అంతకుముందు, హైడ్రా అదనపు కమిషనర్ వర్ల పాపయ్య డిజిటల్ తెరల ద్వారా నగరంలోని ప్రధాన ముంపు ప్రాంతాల వివరాలను, విపత్తు ప్రతిస్పందన దళాల క్షేత్రస్థాయి కార్యాచరణను వివరించారు.

### ముంపు నివారణకు 'చెరువుల' ప్రక్షాళన: 30 చెరువులకు గేట్లు!

ఈ ఏడాది కురిసే వర్షాల సరళిపై వాతావరణ శాఖ హెచ్చరికలను అధికారులు తీవ్రంగా పరిగణిస్తున్నారు. జూన్ 8వ తేదీ నాటికి వర్షాలు ప్రారంభమయ్యే సూచనలు ఉన్నాయని, ఈ ఏడాది తక్కువ రోజులు వర్షాలు పడినా.. పడినప్పుడు మాత్రం మేఘమథనం తరహాలో కుంభవృష్టిగా ఉండే ప్రమాదం ఉందని కమిషనర్ రంగనాథ్ హెచ్చరించారు. దీనిని తట్టుకోవడానికి ఐటీ కారిడార్ పరిధిలో వరద నీరు పెద్దమొత్తంలో చేరే దుర్గం చెరువు, ఖాజాగూడ చెరువు, మల్కం చెరువుతో పాటు మొత్తం 30 కీలకమైన చెరువులకు తక్షణమే నీటి నియంత్రణ గేట్లను (స్లూయిజ్ గేట్లు) ఏర్పాటు చేయాలని సమావేశంలో కీలక నిర్ణయం తీసుకున్నారు. వర్షానికి ముందే ఈ చెరువుల్లోని నీటి మట్టాన్ని కొంతవరకు తగ్గించి ఉంచితే, కుంభవృష్టి కురిసినా వరద నీరు సాఫీగా చెరువుల్లోకి చేరి, అంచనాలకు మించి కాలనీలపైకి పోటెత్తే ప్రమాదం తప్పుతుందని స్పష్టం చేశారు. అలాగే, రైల్వే కిందటి వంతెనల (=ఖదీ) వద్ద ఏర్పాటు చేసిన మోటార్ పంపులను, వంతెనలపై పడిన వర్షపు నీరు కిందకు వెళ్లేలా చేసిన రంధ్రాలను నిరంతరం తనిఖీ చేయాలని సూచించారు.

### 98 శాతం పూడికతీత పూర్తి: కార్పొరేషన్ కమిషనర్ సృజన

వివిధ శాఖలు చేసిన సూచనల మేరకు ఐటీ కారిడార్‌లో ప్రజాసౌకర్యార్థం తగిన అన్ని చర్యలు తీసుకుంటున్నట్లు మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ సృజన ప్రకటించారు. ఇప్పటికే నగరంలో దాదాపు 98 శాతం పూడికతీత పనులు పూర్తయ్యాయని ఆమె వెల్లడించారు. నగర పరిధిలో ప్రమాదకరంగా ఉన్న 161 శిథిల భవనాలను గుర్తించామని, త్వరలోనే వాటిని పరిశీలించి కూల్చివేత లేదా మరమ్మతు చర్యలు తీసుకుంటామన్నారు.
రవాణా, జలమండలి, నీటిపారుదల, విద్యుత్ తదితర శాఖల పనుల్లో ఎలాంటి ఆటంకాలు లేకుండా సమన్వయం చేసుకుంటామని స్పష్టం చేశారు. వర్షాకాలంలో తలెత్తే రవాణా ఇబ్బందులను, ట్రాఫిక్ నియంత్రణకు చేపట్టాల్సిన ప్రత్యేక చర్యలను ట్రాఫిక్ ఉప కమిషనర్ (డీసీపీ) శేషాద్రి రెడ్డి, అదనపు ఉప కమిషనర్ (అడిషనల్ డీసీపీ) హనుమంతరావు వివరించారు. ఈ అత్యున్నత స్థాయి సమావేశంలో హైడ్రా అదనపు కమిషనర్ ఆర్. సుదర్శన్, కార్పొరేషన్ పరిధిలోని ప్రాంతీయ కమిషనర్లు (జోనల్ కమిషనర్లు), సహాయ కమిషనర్లు (ఏసీపీలు), జిల్లా అటవీ అధికారి గౌతమ్‌తో పాటు పలువురు ఉన్నతాధికారులు పాల్గొని దిశానిర్దేశం చేశారు.

# కొత్త నాయకత్వం కోసం కాంగ్రెస్ 'టాలెంట్ హంట్'..
## యువతకు మహేష్ కుమార్ గౌడ్ పిలుపు!

ఆలోచనల నుంచే ఈ కార్యక్రమం రూపుదిద్దుకుందని ఆయన ఈ సందర్భంగా వివరించారు. (ఇది సాధారణ పార్టీ చేరికల లాంటి కార్యక్రమం కాదని, సమాజానికి సేవ చేయాలనే తపన ఉన్న ప్రతి ఒక్కరినీ వారి రాజకీయ నేపథ్యంతో సంబంధం లేకుండా ఆహ్వానిస్తున్నామని మహేష్ కుమార్ గౌడ్ స్పష్టం చేశారు. ఈ టాలెంట్ హంట్ ద్వారా పార్టీ అధికారిక ప్రతినిధులను పూర్తిగా పారదర్శకమైన పద్ధతిలో ఎంపిక చేయనున్నారు. జాతీయ, రాష్ట్ర రాజకీయ వ్యవహారాలపై బలమైన అవగాహన ఉండటం, లౌకికవాదం పట్ల పూర్తి నిబద్ధత కలిగి ఉండటం, సామాజిక సేవపై నిజమైన ఆసక్తితో పాటు ప్రజలతో సమర్థవంతంగా మాట్లాడగలిగే నైపుణ్యం ఉన్నవారిని ఈ ప్రక్రియ ద్వారా ఎంపిక చేస్తారు. సాంప్రదాయ రాజకీయ సంబంధాలు లేకపోయినా కేవలం ప్రతిభ, స్పష్టమైన విజన్, సేవా దృక్పథం ఉన్న మంచి వ్యక్తుల కోసం కాంగ్రెస్ పార్టీ ఈ వేదికను అందిస్తోందని టీపీసీసీ చీఫ్ స్పష్టం చేశారు. వారసత్వ రాజకీయాలకు భిన్నంగా, క్షేత్రస్థాయి నుంచి సరికొత్త రక్తాన్ని పార్టీలోకి ఆహ్వానించడానికి కాంగ్రెస్ వేసిన ఈ అడుగు ఇప్పుడు రాష్ట్రవ్యాప్తంగా ఉన్న ఆశావహ యువతలో తీవ్ర ఆసక్తిని రేకెత్తిస్తోంది.

# పవన్ కల్యాణ్ సభకు అనుమతి నిరాకరణ

సభ – జనసేన సాధక్ సమ్మేళనం' పేరిట ఓ ఇండోర్ కార్యక్రమం నిర్వహించాలని జనసేన పార్టీ నిర్ణయించింది. సుమారు 2000 మంది పార్టీ క్రియాశీలక కార్యకర్తలతో గచ్చిబౌలిలోని సంధ్య కన్వెన్షన్ హాల్‌లో ఈ సమావేశం తలపెట్టారు.

రాష్ట్ర అభివృద్ధిలో జనసేన పాత్ర, భవిష్యత్ కార్యాచరణ, పార్టీ బలోపేతం వంటి అంశాలపై శ్రేణులకు దిశానిర్దేశం చేయడం ఈ కార్యక్రమం ముఖ్య ఉద్దేశం. అయితే, పార్కింగ్ సమస్యను కారణంగా చూపుతూ ప్రభుత్వం ఈ సభకు అనుమతి నిరాకరించింది. ఈ నిర్ణయాన్ని జనసేన తీవ్రంగా తప్పుబట్టింది. నిత్యం ఎన్నో సాంస్కృతిక, రాజకీయ, కార్పొరేట్ సమావేశాలు జరిగే సంధ్య కన్వెన్షన్‌లో, కేవలం తమ కార్యక్రమానికే పార్కింగ్ సమస్యను కారణంగా చూపడం సహేతుకం కాదని పార్టీ నేతలు ప్రశ్నిస్తున్నారు. ఇటీవల ప్రొఫెసర్ నాగేశ్వర్ వ్యాఖ్యల వివాదం ముగిసిపోయిన అధ్యాయమని, ఆయనే తన వ్యాఖ్యలను ఉపసంహరించుకున్నారని జనసేన గుర్తుచేసింది. ఈ అంశంపై ఏపీ ప్రభుత్వం నుంచి ఎలాంటి చర్యలు ఉండబోవని స్వయంగా పవన్ కల్యాణ్ స్పష్టం చేశారని వెల్లడించింది. అయినప్పటికీ, ఆ వ్యవహారాన్ని సాకుగా చూపి సభను అడ్డుకోవడం సరికాదని పార్టీ వర్గాలు అభిప్రాయపడ్డాయి.

# పశ్చిమాసియాలో శాంతికి 'భారత్' ఒక్కటే మార్గం: ఇజ్రాయెల్

తీవ్రవాద శక్తులను అణచివేయగలిగితే.. భారత్ ద్వారా వచ్చే ట్రిలియన్ డాలర్ల పెట్టుబడులు, వస్తు రవాణా వల్ల ఇక్కడి దేశాలన్నీ అద్భుతమైన సంపదను, శ్రేయస్సును అనుభవిస్తాయి. అందుకే ఈ ప్రాంత స్థిరత్వంలో ఢిల్లీ పాత్ర ఎంతో కీలకం" అని ఆయన పేర్కొన్నారు. ఇదే సమయంలో ఇరు దేశాల మధ్య ఉన్న బలమైన దౌత్య బంధాన్ని ఇజ్రాయెల్ ప్రధాని బెంజమిన్ నెతన్యాహు కూడా ప్రత్యేకంగా ప్రస్తావించారు.

ప్రపంచవ్యాప్తంగా ఇజ్రాయెల్‌పై విమర్శలు వస్తున్నప్పటికీ.. భారత్ నుంచి మాత్రం తమకు అచంచలమైన ప్రజా మద్దతు లభిస్తోందని చెప్పారు. "భారత్‌లో ఇజ్రాయెల్ పట్ల ఒక అద్భుతమైన క్రేజీ లవ్ ఉంది. ప్రపంచంలో మరే దేశం నుంచి లేనంత మంది ఫాలోవర్లు నాకు ఒక్క భారతదేశం నుంచే ఉన్నారు" అని నెతన్యాహు సంతోషం వ్యక్తం చేశారు.

# కడుపు మంటతోనే రాష్ట్రంలో వైసీపీ కుట్రలు

ప్రయత్నంలోనే ఉందని చంద్రబాబు విమర్శించారు. "సుపరిపాలన చూసి ఓర్వలేక గొడ్డలి పార్టీ కుట్రలు చేస్తోంది. వివేకానంద రెడ్డిని గొడ్డలితో నరికి చంపి గుండెపోటు డ్రామా ఆడారు. ఒక్క ఛాన్స్ అని అధికారంలోకి వచ్చి కోడికత్తి, గులకరాయి నాటకాలతో ప్రజలను మోసం చేశారు. ఇప్పుడు అధికారం కోల్పోయాక కూడా వారి బుద్ధి మారలేదు" అని మండిపడ్డారు. ఇటీవల జరిగిన పలు ఘటనలను ప్రస్తావిస్తూ వైసీపీ కుట్రలను ఆయన ఎండగట్టారు. "పరామర్శకు వెళుతూ సొంత కార్యకర్త సింగయ్యను కారు కింద తొక్కి చంపి పొదల్లో పడేశారు. ఇటీవల కడపకు చెందిన ఓ పాస్టర్‌ను పంపి మాపై హత్యాయత్నం డ్రామా ఆడారు. అంతకుముందు పాస్టర్ ప్రవీణ్ మద్యం తాగి ప్రమాదంలో చనిపోతే, దాన్ని కూడా మాకు అంటగట్టాలని చూశారు. సీసీకెమెరాలతో ఈ కుట్రలు బట్టబయలత్తూయ్యాయి. సాక్షాత్తు తిరుమల కొండపై సాక్షి మీడియా ప్రతినిధులే మద్యం బాటిళ్లు పడేసి అపవిత్రం చేసేందుకు ప్రయత్నించారు. కడపలో పెద్ద దస్తగిరిని ఆస్తుల వివాదంలో వైసీపీ వారే హత్య చేసి, టీడీపీపై నెపం మోపజూశారు. చివరికి నంద్యాలలో రాజశేఖర రెడ్డి విగ్రహాన్ని ధ్వంసం చేసింది కూడా వైసీపీ కార్యకర్తే. అందుకే ఆ వార్తను సాక్షి పత్రికలో రాయలేదు. కాకినాడలో దళిత డ్రైవర్‌ను చంపి డోర్ డెలివరీ చేసిన ఎమ్మెల్సీకి వైసీపీ సన్మానాలు చేసింది. ఇలాంటి కుట్రలకు పాల్పడుతున్న వారి ఆటలు సాగనీయం" అని చంద్రబాబు హెచ్చరించారు.

జూన్ 4వ తేదీ రాష్ట్ర చరిత్రలో విధ్వంసం నుంచి ప్రజలకు విముక్తి కలిగిన రోజుగా నిలిచిపోతుందని ముఖ్యమంత్రి అన్నారు. "గత పాలనలో ప్రజలు బహిరంగంగా నవ్వాలన్నా భయపడే పరిస్థితి ఉండేది. ఇప్పుడు ఆ భయం పోయింది. ప్రభుత్వం ఏర్పడిన నాటి నుంచి పేదల కోసం పనిచేస్తున్నాం. రూ. 10 లక్షల కోట్ల అప్పులున్నా, పెన్షన్లను రూ. 1,000 పెంచి రూ. 4,000 చేశాం. దివ్యాంగులకు రూ. 6,000, ఆరోగ్య పెన్షన్లను రూ. 10,000, రూ. 15,000కు పెంచాం. 2024 జూలై నుంచి ఇప్పటివరకు రూ. 65,887 కోట్లు ఎన్టీఆర్ భరోసా కింద అందించాం. దేశంలో ఏ రాష్ట్రంలోనూ ఇంత పెద్ద మొత్తంలో పింఛన్లు ఇవ్వడం లేదు," అని చంద్రబాబు వివరించారు. బటన్ నొక్కితే పైశాచిక ఆనందం తప్ప, ప్రజల కష్టాలు తెలియవని, అందుకే ప్రతీ నెలా ఒకటో తేదీన నేరుగా ప్రజల వద్దకే వచ్చి పెన్షన్లు అందిస్తున్నామని తెలిపారు. సంక్షేమంతో పాటు అభివృద్ధి, సుపరిపాలన అందిస్తూనే యువతకు ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పిస్తున్నామని చంద్రబాబు తెలిపారు. "23 నెలల్లో 23 లక్షల కోట్ల పెట్టుబడులతో 23 లక్షల ఉద్యోగాలు సృష్టిస్తాం. కాకినాడ సమీపంలో రూ. 80 వేల కోట్లతో గ్రీన్ అమ్మోనియా పరిశ్రమ, అనకాపల్లి వద్ద ఆర్సెలార్ మిట్టల్ స్టీల్ సిటీ, విశాఖలో గూగుల్ డేటా సెంటర్ వస్తున్నాయి. పీఎం సేతు కింద ఏటా 25 వేల మంది యువతకు నైపుణ్యాభివృద్ధి శిక్షణ ఇస్తాం. కేంద్ర సహకారంతో విశాఖ స్టీల్ ప్లాంట్‌ను పునరుద్ధరించాం. ఎన్నో ఏళ్ల కల అయిన విశాఖ రైల్వే జోన్ కూడా సాకారమైంది" అని ముఖ్యమంత్రి ప్రకటించారు. పోలవరం ఎడమ కాలువను జూలైలోగా పూర్తి చేసి విశాఖకు నీరందిస్తామని హామీ ఇచ్చారు. పేదలకు నాణ్యమైన విద్య, వైద్యం అందించడమే లక్ష్యమని చంద్రబాబు స్పష్టం చేశారు. "పాఠశాలల్లో సంస్కరణలు తెచ్చి నాణ్యమైన విద్యను అందిస్తాం. ఖరీదైన వైద్యం కోసం అప్పులపాలు కాకుండా 'యూనివర్సల్ హెల్త్ పాలసీ' తెస్తున్నాం. 'సంజీవని' పేరుతో ప్రతి ఒక్కరి ఆరోగ్య రికార్డులను డిజిటలైజ్ చేసి, ప్రివెంటివ్, ప్రిడిక్టివ్, క్యూరేటివ్ విధానంలో రాష్ట్రాన్ని ఆరోగ్య ఆంధ్రప్రదేశ్‌గా తీర్చిదిద్దుతాం," అని తెలిపారు. 2047 స్వర్ణాంధ్ర విజన్ ద్వారా రాష్ట్రాన్ని ఆదర్శంగా నిలబెడతామని, శ్రీకాకుళం, అమరావతి, తిరుపతి కేంద్రంగా మూడు రీజియన్లను సమానంగా అభివృద్ధి చేస్తామని పునరుద్ఘాటించారు.

# భారత శక్తి

VOICE OF INDIAN

Published from Hyderabad, Kadapa, Guntur, Kurnool, Khammam, Vijayawada & Warangal

సంపుటి : 20 | సంచిక : 310 | మంగళవారం,జూన్ 2 , 2026 | పేజీలు : 12 | వెల : 1.00


## కొత్త నాయకత్వం కోసం కాంగ్రెస్ 'టాలెంట్ హంట్'.. యువతకు మహేష్ కుమార్ గౌడ్ పిలుపు!



**హైదరాబాద్(భారత శక్తి)** రాజకీయాల్లోకి సమర్థులైన, చదువుకున్న యువతను ఆకర్షించేందుకు తెలంగాణ కాంగ్రెస్ ఒక సరికొత్త కార్యక్రమానికి శ్రీకారం చుట్టింది. టీపీసీసీ అధ్యక్షుడు మహేష్ కుమార్ గౌడ్ సోమవారం గాంధీ భవన్‌లో పార్టీ తరఫున వినూత్నమైన 'టాలెంట్ హంట్' ప్రోగ్రామ్‌ను అధికారికంగా ప్రకటించారు. ప్రజా జీవితంలోకి రావాలనుకునే ప్రతిభావంతులైన యువతీ యువకులకు కాంగ్రెస్ పార్టీ ఒక సువర్ణావకాశాన్ని కల్పిస్తోందని, దేశ నిర్మాణంలో యువత ప్రధాన పాత్ర పోషించాలనే కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ

2లో..

# అక్షరాల అంగడిలో 'ఉత్తరాది' రాబందులు!



- **తెలంగాణ విద్యావ్యవస్థపై 'కోట' మాఫియా నిశ్శబ్ద పంజా..**
- **కార్పొరేట్ చెరసాలలో నలిగిపోతున్న బాల్యం!**
- **రూ. వేల కోట్ల దోపిడీకి 'నో-కాస్ట్ ఈఎంఐ'ల ఉచ్చు..**
- **ఇంటర్ బోర్డు కళ్లుండీ గ్రుడ్డిదేనా?**
- **అధికారుల మిలాఖత్‌పై 'భారత శక్తి' సంచలన రిపోర్ట్!**




మన తెలంగాణల ఇంటర్ సదువంటే ఒకప్పుడు ముచ్చటైన ముచ్చట. కానీ, ఇయ్యాల గిది పైసలొచ్చే పెద్ద బిజినెస్ అయిపోయింది! మన లోకల్ కార్పొరేట్ తిమింగలాలు చాలవన్నట్టు, ఉత్తరాది నుంచి వచ్చిన 'కోటా' రాబందులు కూడా జతకల్సిండ్రు. ర్యాంకుల ఎర వేసి, 'నో-కాస్ట్ ఈఎంఐ'ల ఉచ్చుతోటి గరీబోళ్ల, మధ్య తరగతి తల్లిదండ్రులకు జేబులకు చిల్లులు పెడుతుండ్రు. జైళ్ల లాంటి క్యాంపస్‌లల్లా పొద్దుగాల్న నంచి రాత్రి దాకా రుబ్బుడు.. మార్కులు తక్కువొస్తే పిల్లల్ని పశువులకంటే హీనంగా సూసుడు.. గిదేం సదువురా అయ్యా? ఇంటర్ బోర్డు అధికారులు మాత్రం ముడుపులు తిని, కండ్లుండి గ్రుడ్డోళ్లలా నటిస్తుండ్రు. మన పిల్లల ప్రాణాల్ని, బాల్యాన్ని మింగుతున్న ఈ అక్షరాల అంగడి దోపిడీని నడిబజార్ల ఎండగడుతూ 'భారత శక్తి' అందిస్తున్న సంచలన దర్యాప్తు కథనం గిది!

**(ప్రత్యేక పరిశోధనాత్మక పాత్రికేయులు: ఎం.వేణుగోపాల్ రెడ్డి)**

**హైదరాబాద్, జూన్ 1 (భారత శక్తి):** తెలంగాణలో ఇంటర్మీడియట్ విద్య అంటే ఒకప్పుడు అదొక పవిత్రమైన విద్యాదశ, విద్యార్థుల ఉజ్వల భవిష్యత్తుకు పునాది. కానీ నేడు అదొక మైండ్ గేమ్.. కొన్ని వేల కోట్ల రూపాయల నెత్తుటి కూడు తినే కార్పొరేట్ వ్యాపార సామ్రాజ్యం! భాగ్యనగరాన్ని హబ్‌గా చేసుకుని దశాబ్దాలుగా నిలువు దోపిడీకి అలవాటు పడ్డ స్థానిక కార్పొరేట్ తిమింగలాలు శ్రీ చైతన్య, నారాయణ కాలేజీలకు తోడు.. ఇప్పుడు ఉత్తరాది నుంచి దిగుమతి అయిన 'కోట' విద్యా మాఫియా జతకట్టింది. రాజస్థాన్‌లోని కోట (Kota) కేంద్రంగా దేశాన్ని కుదిపేసిన 'నీట్' పేపర్ లీకేజీల మూలాలున్న అలెన్ (Allen), రెజోనెన్స్ (Resonance), ఫిట్‌జీ (FIITJEE), ఆకాష్ (Aakash) వంటి జాతీయ శకునులు నేడు తెలంగాణ గడ్డపై విద్యావ్యాపార

4లో..



## వానాకాలం సన్నద్ధతపై సర్కార్ నజర్!

- ఎగువ రాష్ట్రాలతో నదీ జలాల సమన్వయానికి సీఎం రేవంత్ రెడ్డి ఆదేశం.
- యుద్ధప్రాతిపదికన జలాశయాల గేట్ల మరమ్మతులు... నిధుల కొరత లేదు.
- సాగు మార్పిడిపై రైతులకు అవగాహన... నగరంలో ఇంకుడు గుంతల నిర్మాణం వేగవంతం

**భారత శక్తి ప్రతినిధి, హైదరాబాద్:** రాబోయే వానాకాలంలో వర్షాభావ పరిస్థితులు ఎదురయ్యే సూచనలున్నందున, కృష్ణా, గోదావరి నదుల్లో తెలంగాణకు దక్కాల్సిన వాటా జలాలను సాధించుకునేందుకు అధికారులు తక్షణమే రంగంలోకి దిగాలని ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి ఆదేశించారు. ఎగువ రాష్ట్రాలైన మహారాష్ట్ర, కర్ణాటకలు తమ జలాశయాలు నిండిన తర్వాతే నీటిని కిందకు విడుదల చేసే విధానాన్ని పాటిస్తే రాష్ట్రానికి ఇబ్బందులు ఎదురవుతాయని, అందుకే ముందస్తుగానే ఆయా రాష్ట్రాల అధికారులతో నిష్పత్తి (ప్రొరేటా) ప్రకారం నీటి విడుదలపై చర్చలు జరపాలని స్పష్టం చేశారు. సచివాలయంలో సోమవారం వివిధ శాఖల ఉన్నతాధికారులతో నిర్వహించిన వర్షాకాల సన్నద్ధత సమీక్షా సమావేశంలో ముఖ్యమంత్రి పలు కీలక మార్గదర్శకాలు జారీ చేశారు.

### అంతరాష్ట్ర జలాలపై ముందస్తు కార్యాచరణ

మహారాష్ట్రలోని కోయనా జలాశయం నీటిని ఆ రాష్ట్రం పూర్తిగా జల విద్యుత్ ఉత్పత్తికే వినియోగిస్తోందని ముఖ్యమంత్రి గుర్తు చేశారు. ఆ నీటిని తెలంగాణకు తీసుకొని, దానికి బదులుగా వారికి అవసరమైన విద్యుత్తును సరఫరా చేసేలా చర్చలు జరపాలని ప్రభుత్వ ప్రధాన కార్యదర్శిని ఆదేశించారు. గోదావరి, ప్రాణహిత నదుల నుంచి వచ్చే వరద నీరు స్వల్ప కాలంలోనే సముద్రం పాలు కాకుండా, ఆ నీటిని సమర్థవంతంగా మళ్లించేందుకు స్పష్టమైన విధానాన్ని రూపొందించాలన్నారు. అలాగే, ఉమ్మడి రాష్ట్రంలో నిర్మించిన సీలేరు, తుంగభద్ర జలాశయాల నుంచి ఉత్పత్తి అయ్యే విద్యుత్‌లో తెలంగాణకు రావాల్సిన వాటాపై నివేదిక సమర్పించాలని విద్యుత్ శాఖను ఆదేశించారు.

### జలాశయాల మరమ్మతులకు రూ. 300 కోట్లు

రాష్ట్రంలోని అన్ని

2లో..

## పవన్ కల్యాణ్ సభకు అనుమతి నిరాకరణ

**- తీవ్రంగా స్పందించిన జనసేన పార్టీ**



**అమరావతి(భారత శక్తి)** తెలంగాణలో పవన్ కల్యాణ్ తలపెట్టిన 'తెలంగాణ నవ నిర్మాణ సంకల్ప సభ'కు రాష్ట్ర ప్రభుత్వం అనుమతి నిరాకరించడంపై జనసేన పార్టీ తీవ్రంగా స్పందించింది. ప్రభుత్వ చర్య పూర్తిగా అర్థరహితమని, రాజకీయ దురుద్దేశంతోనే తమ కార్యక్రమాన్ని అడ్డుకున్నారని పార్టీ వర్గాలు ఆరోపించాయి. వివరాల్లోకి వెళితే, తెలంగాణ ఆవిర్భావ దినోత్సవాన్ని పురస్కరించుకుని, 'తెలంగాణ నవ నిర్మాణ సంకల్ప

2లో..

# హైడ్రా యాక్షన్ ప్లాన్

## ఐటీ కారిడార్‌కు 'వరద' గండం గట్టెక్కించేలా ముందస్తు వ్యూహం!

- మహానగరంలో ముంపు నివారణకు 15 రోజుల గడువు
- యుద్ధప్రాతిపదికన రంగంలోకి హైడ్రా, సైబరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ యంత్రాంగం

**హైదరాబాద్, జూన్ 01 (భారత శక్తి బ్యూరో):** భాగ్యనగర గుండెకాయ, ఆర్థిక చోదక శక్తి అయిన ఐటీ కారిడార్‌ను వర్షాల ముప్పు నుండి రక్షించేందుకు ప్రభుత్వం నడుం బిగించింది. వర్షాకాలంలో రహదారులపై ఐదు నిమిషాలు నీరు నిలిచినా.. కిలోమీటర్ల మేర రవాణా వ్యవస్థ స్తంభించిపోతుందనే చేదు నిజాలను దృష్టిలో ఉంచుకొని సరికొత్త ముందస్తు వ్యూహానికి తెరతీసింది. వర్షాకాల సన్నద్ధతపై సైబరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని అన్ని శాఖల ఉన్నతాధికారులతో హైడ్రా కమిషనర్ ఏవీ రంగనాథ్, సైబరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ సృజన సోమవారం హైడ్రా ప్రధాన కార్యాలయంలో




అత్యున్నత స్థాయి ఉమ్మడి సమీక్షా సమావేశాన్ని నిర్వహించారు.కార్పొరేషన్ పరిధిలో నీరు నిలిచే 202 ముంపు ప్రాంతాలను అధికారులు

2లో..

## గల్ఫ్ దేశాలతో సరికొత్త వాణిజ్య ఒప్పందం

న్యూ ఢిల్లీ, భారత శక్తి ప్రతినిధి, జూన్



01:జూన్ 1 నుంచి 'భారతదేశం-ఒమన్ స్వేచ్ఛా వాణిజ్య ఒప్పందం' అమలులోకి వచ్చింది. కొత్త మార్కెట్లను అవకాలశాలను ఏర్పరిచి, ఉద్యోగాల కల్పనను వేగవంతం చేయడం ద్వారా భారతదేశంలోని విద్యార్థులు, చేతివృత్తుల వారు, మహిళలు, రైతులు, మత్స్యకారులు, ఎంఎస్ఎంఈల (సూక్ష్మ, చిన్న, మధ్యతరహా పరిశ్రమల) శ్రేయస్సు కోసం ప్రపంచవ్యాప్తంగా మార్గాలను సృష్టించాలనే ప్రధానమంత్రి నరేంద్ర మోదీ సంకల్పంలో ఇదో చారిత్రాత్మక మైలురాయి. దాదాపు 7 లక్షల మంది భారతీయులు నివసిస్తున్న ఒమన్‌తో భారత్ కు బలమైన ఆర్థిక, సాంస్కృతిక సంబంధాలున్నాయి. అక్కడి వ్యాపార కుటుంబాలలో కొందరి మూలాలు 200-300 సంవత్సరాల నాటివి. ఒమన్ నుంచి భారతదేశానికి వచ్చే విదేశీ నగదు ఏటా సుమారు 2 బిలియన్ డాలర్లుగా ఉంది, అలాగే 6,000 పైగా భారతీయ సంస్థలు అక్కడ కార్యకలాపాలు నిర్వహిస్తున్నాయి.ఇరు దేశాల మధ్య కుదిరిన సమగ్ర ఆర్థిక భాగస్వామ్య ఒప్పందం (సీఈపీఏ), ఆర్థిక మరియు వ్యూహాత్మక సంబంధాలను మరింత బలోపేతం చేస్తుంది.

4లో..

## కడుపు మంటతోనే రాష్ట్రంలో వైసీపీ కుట్రలు



**(భారత శక్తి)** కూటమి ప్రభుత్వం రాష్ట్రంలో సుపరిపాలనా యజ్ఞం చేస్తుంటే, ఓటమిని జీర్ణించుకోలేని వైసీపీ నేతలు రాక్షసుల్లా ఆటంకాలు సృష్టిస్తున్నారని ముఖ్యమంత్రి చంద్రబాబు తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. అధికారం కోల్పోయిన కడుపు మంటతోనే రాష్ట్రంలో విద్వేషాలు రగిల్చేందుకు అడుగడుగునా కుట్రలు, కుతంత్రాలకు పాల్పడుతున్నారని ఆరోపించారు. కాకినాడ జిల్లా తుని నియోజకవర్గంలోని చామవరంలో సోమవారం జరిగిన 'పేదల సేవలో ఎన్టీఆర్ భరోసా' పెన్షన్ల పంపిణీ కార్యక్రమంలో ఆయన పాల్గొని ప్రసంగించారు. ఈ సందర్భంగా వైసీపీ నేతలను ఏకిపారేశారు. గత ఐదేళ్ల పాలనలో ధ్వంసమైన రాష్ట్రాన్ని పునర్నిర్మించేందుకు రాత్రింబవళ్లు శ్రమిస్తుంటే, వైసీపీ ఇంకా విధ్వంసాన్ని కొనసాగించే

2లో..

# కారులో "వార్"




- ▶ కట్టు తెగుతున్న గులాబీ పార్టీ క్రమశిక్షణ ▶ గర్జిస్తున్న అసమ్మతి గళాలు
- ▶ నివురు గప్పిన నిప్పులా నేతల మధ్య వర్గ విభేదాలు ▶ గళం విప్పుతున్న అసమ్మతి నాయకులు
- ▶ పినపాక, మణుగూరు అశ్వాపురంలోనూ లుకలుకలు ▶ మున్ముందు మరిన్ని తిరుగుబాట్లు తప్పవా.?
- ▶ పార్టీలో మంటల వెనుక ఎవరున్నారు.? ▶ ఫ్యూచర్ లో అసమ్మతి భగ్గుమనడం ఖాయమా..?
- ▶ యువ నాయకత్వంతో ఆగని అసమ్మతి రాగాలు.! షాకిస్తున్న నేతలు.!
- ▶ "బాస్.. జరా పట్టించుకోండి" కార్యకర్తల విజ్ఞప్తి.! ▶ వ్యంగ్యాస్త్రాలతో నువ్వేనా.. విలేకరవు.?
- ▶ ప్రస్తుత సమీకరణాలపై వ్రాస్తే ఉలిక్కిపడ్డ బాస్.?

**భద్రాద్రి జిల్లా బ్యూరో, జూన్ 01 (భారతశక్తి) :** పినపాక నియోజకవర్గంలోని కారులో వార్ మొదలైంది. బిఆర్ఎస్ పార్టీలో ఎన్నడూ లేనివిధంగా అసమ్మతి రాగాలు వినిపిస్తున్నాయి. యువ నాయకత్వం ఒట్టేందు పోకడలతో సీనియర్ నేతల మధ్య సమన్వయం లోపించి కారులో చిచ్చు రగులుతోంది. ఒకరిపై ఒకరు విమర్శలు చేసుకునే స్థాయికి చేరడంతో బీఆర్ఎస్ అధినాయకత్వం లోనూ గుబులు మొదలైంది. పైకి గంభీరం గానే ఉన్నట్లు కనిపిస్తున్నా లోలోపల పార్టీ నేతల్లో అలజడి మొదలైంది. పినపాక

2లో..

## రాళ్ల వాగు బ్రిడ్జి నిర్మాణ పనులు తక్షణమే నిలిపి వేయాలి

**- బీజేపీ రాష్ట్ర ఉపాధ్యక్షులు రఘునాథ్ వెరబెల్లి**



మంచిర్యాల జిల్లా ప్రతినిధి, జూన్ 1 (భారత శక్తి): రాళ్ళ వాగు పై 100 ఫీట్ల వెడల్పు తో నిర్మాణం చేపడుతున్న పై వంతెన నిర్మాణ పనులను వెంటనే నిలిపి డిమాండ్ చేస్తూ సన్ సిటీ కాలనీ చేపట్టిన నిరసన కార్యక్రమంలో బీజేపీ రాష్ట్ర ఉపాధ్యక్షులు రఘునాథ్ వెరబెల్లి పాల్గొని వారికి మద్దతు తెలిపారు. ఈ సందర్భంగా రఘునాథ్ మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం రాళ్లవాగు పై కొత్తగ నిర్మిస్తున్న 6 వే బ్రిడ్జి నిర్మాణ పనులు వెంటనే నిలిపివేయాలని డిమాండ్ చేశారు.రాళ్ల వాగు పై భారీ ఎత్తున బ్రిడ్జి నిర్మాణం చేపట్టడం వలన సన్ సిటీ లో నివాసం ఉంటున్న 200 పైగా కుటుంబాలకు రోడ్డు సదుపాయం లేకుండా పోతుంది అని అన్నారు.ఈ ప్రాంతంలో భారీ వంతెన అవసరం లేనప్పటికీ స్థానిక ఎమ్మెల్యే కమీషన్ల కోసం భారీ వంతెన నిర్మాణం చేపడుతున్నారని అన్నారు. రాళ్ల వాగు కాజ్ వే పై నూతన వంతెన నిర్మాణం అవసరం ఉన్నప్పటికీ ఇంత పెద్ద వంతెన ప్రజలకు ఇబ్బంది కల్పించే విధంగా బ్రిడ్జి నిర్మాణం అవసరం లేదని అన్నారు. కార్మెల్ స్కూల్ వద్ద రాళ్ళ వాగు పై ఎలాగయితే బ్రిడ్జి నిర్మాణం చేపట్టారో అదే విధంగా అంతే ఎత్తు తో ఇక్కడ బ్రిడ్జి నిర్మాణం చేపట్టాలని డిమాండ్ చేశారు.రాష్ట్ర ప్రభుత్వం తక్షణమే పనులు నిలిపివేసి స్థానిక ప్రజలకు న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. బ్రిడ్జి నిర్మాణ పనులు వెంటనే నిలిపి వేయని పక్షంలో మున్సిపల్ కార్యాలయం ఎదుట బాధిత కుటుంబాలతో కలిసి ఆందోళనలు చేస్తామని హెచ్చరించారు.ఈ కార్యక్రమంలో అమిరిశెట్టి రాజ్ కుమార్, రంగ శ్రీశైలం, కార్పొరేటర్ కస్తూరి నాగరాజు,మెట్టుపల్లి జయ రామ రావు, నాంపల్లి శ్రీనివాస్,అదే ప్రేమ్ సింగ్,నాగుల రాజన్న, తుల పెద్దన్న,రాజబాబు తదితరులు పాల్గొన్నారు.

# ప్రశ్నిస్తే అరెస్టులా ?

**- బాల్క సుమన్ అరెస్టుపై బిఆర్ఎస్ శ్రేణులు మండిపాటు**

మంచిర్యాల జిల్లా ప్రతినిధి, జూన్ 1 (భారత శక్తి): సింగరేణిలో జరిగిన అవినీతిని ప్రశ్నించినందుకు చెన్నూరు మాజీ ఎమ్మెల్యే బాల్క సుమన్ ను అరెస్టు చేస్తారా అంటూ బిఆర్ఎస్ పార్టీ శ్రేణులు మంచిర్యాల మాజీ శాసనసభ్యులు నడిపెల్లి దివాకర్ రావు,బిఆర్ఎస్ పార్టీ రాష్ట్ర నాయకులు నడిపెల్లి విజిత్ కుమార్ ఆదేశానుసారం అక్రమ అరెస్టుకు నిరసనగా ఓవర్ బ్రిడ్జి వద్ద ధర్నా, రాస్తారోక నిర్వహించారు. ప్రభుత్వ వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు అనంతరం బిఆర్ఎస్ నాయకులు మాట్లాడుతూ

ప్రశ్నించే గొంతుకులను కాంగ్రెస్ ప్రభుత్వం అణగదొక్కుతుందని ఆరోపించారు. సింగరేణిలో అక్రమాలను ప్రభుత్వ వైఫల్యాలను ప్రశ్నిస్తున్న దళిత నాయకుడు పై అక్రమ కేసులు పెట్టి అరెస్టు చేస్తున్నారంటూ మండిపడ్డారు. బేషరతుగావిడుదల చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ప్రజా ప్రతినిధులు, మాజీ ప్రజా ప్రతినిధులు, యువజన నాయకులు,ఏదీ+ఖూ నాయకులు, బిఆర్ఎస్ పార్టీ నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.



## 32 లక్షలతో సీసీ రోడ్డు ప్రారంభమైన పనులను పరిశీలించిన మాజీ మేయర్, కాంగ్రెస్ పార్టీ నేతలు

ఉప్పల్, భారత శక్తి ప్రతినిధి, జూన్ 1: బోడుప్పల్ సర్కిల్లో అనేక రోజులుగా పెండింగ్‌లో ఉన్న రోడ్డు పనులు త్వరలో పూర్తికానున్నాయని బోడుప్పల్ మాజీ మేయర్ తోటకూర అజయ్ యాదవ్ తెలిపారు. సోమవారం బోడుప్పల్‌లోని బచ్ పబ్ స్కూల్ మెడిప్లస్ నుండి అమృత బార్ వద్ద ఉన్న మెడిప్లస్ వరకు వేయనున్న కొత్త సీసీ రోడ్డు పనులను కాంగ్రెస్ పార్టీ నేతలు, మాజీ కార్పొరేటర్లతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా మాజీ మేయర్ అజయ్ యాదవ్ మాట్లాడుతూ, పెండింగ్‌లో ఉన్న రోడ్డు పనులను త్వరితగతిన పూర్తి చేసేందుకు చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. అందులో భాగంగా రూ. 32 లక్షల వ్యయంతో ఈ పనులను ప్రారంభిస్తున్నామని చెప్పారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ ప్రధాన కార్యదర్శి కొత్త ప్రభాకర్ గౌడ్, వర్కింగ్ ప్రెసిడెంట్ పీ. హరినాథ్ రెడ్డి, మాజీ కార్పొరేటర్లు బొమ్మకు కళ్యాణ్ కొత్త చందర్ గౌడ్, సింగిరెడ్డి పద్మారెడ్డి, కొత్త దుర్గమ్మ, చీరాల నరసింహ, కుంభం కిరణ్ కుమార్ రెడ్డి, సుమన్ నాయక్, సీసా వెంకటేష్ గౌడ్, అలాగే కాంగ్రెస్ పార్టీ నేతలు కుర్రి శివశంకర్, అసర్ల బీరప్ప తదితరులు పాల్గొన్నారు.



## గంభీరావుపేట నూతన ఎస్సైగా బాధ్యతలు స్వీకరించిన శ్రీకాంత్.




భారత శక్తి న్యూస్, గంబీరావుపేట, జూన్ 1: గంభీరావుపేట నూతన ఎస్సైగా సీహెచ్. శ్రీకాంత్ సోమవారం ఉదయం బాధ్యతలు స్వీకరించారు. గతంలో ఇక్కడ విధులు నిర్వహించిన అనిల్ కుమార్ సిరిసిల్ల సీసీఎస్‌కు బదిలీ కాగా, ఆయన స్థానంలో సిరిసిల్ల టౌన్ ఎస్సైగా పనిచేస్తున్న శ్రీకాంత్ గంభీరావుపేట ఎస్సైగా బాధ్యతలు చేపట్టారు. ఈ సందర్భంగా నూతన ఎస్సై మాట్లాడుతూ మండలంలో శాంతి భద్రతలకు ఎవరైనా భంగం కలిగిస్తే ఉపేక్షించేది లేదని స్పష్టం చేశారు. ప్రజలు ఎక్కడైనా చట్ట వ్యతిరేక పనులకు పాల్పడుతుంటే తమకు సమాచారం అందించాలని, సమాచారం అందించిన వారి వివరాలు గోప్యంగా ఉంచుతామని ఆయన తెలిపారు.

## నిర్మల్ జిల్లా వ్యాప్తంగా 30 పోలీస్ యాక్ట్ అమలు.

**-ముందస్తు అనుమతి లేకుండా ప్రజా బహిరంగ కార్యక్రమాలు, సభలు, ర్యాలీలు నిషేధం**

**- జూన్ 30 వ తేది వరకు జిల్లా అంతటా 30 పోలీస్ యాక్ట్ 1861 నిబంధనలు వర్తిస్తాయి**

**- ఉల్లంఘించిన వారిపై కఠిన చర్యలు - జిల్లా ఎస్పీ డా.జి.జానకి షర్మిల**



నిర్మల్ జిల్లా ప్రతినిధి, జూన్ 1(భారత శక్తి) నిర్మల్ జిల్లాలో శాంతి భద్రతల దృష్ట్యా, ప్రశాంతత ను పెంపొందించేందుకు జూన్ 30,2026 వరకు, జిల్లా కలెక్టర్ భవేశ్ మిశ్రా, ఐఏఎస్ ఉత్తర్వుల ప్రకారం జిల్లా అంతటా 30 పోలీస్ యాక్ట్ 1861 అమలులో ఉంటుందని జిల్లా ఎస్పీ డా.జి.జానకి షర్మిల ఐపీఎస్ ఒక ప్రకటనలో తెలిపారు. ఈ 30 పోలీస్ ఆక్ట్ 1861 అమలులో ఉన్నందున జిల్లాలో సబ్ డివిజనల్ పోలీస్ అధికారి లేదా పోలీస్ ఉన్నత అధికారుల నుంచి అనుమతి లేకుండా ఎటువంటి పబ్లిక్ మీటింగులు, ఊరేగింపులు, ధర్నాలు జరుపరాదు. నిషేదిత ఆయుధములు అయిన కత్తులు, చాకులు, కర్రలు, జెండా కర్రలు, దుడ్డుకర్రలు, తుపాకులు ప్రేలుడు పదార్థములు, నేరమునకు పురిగొల్పే ఎటువంటి ఆయుధములను వాడరాదు. ప్రజలకు ఇబ్బంది, చిరాకు కలిగించేందుకు దారితీసే పబ్లిక్ మీటింగ్ లను మరియు జనసమూహం పోగు అవుట వంటివి నిషేధం. రాళ్ళను జమ చేయుట, ధరించి సంచరించుట వంటివి నిషేధం. లౌడ్ స్పీకర్ లు, డీజే లు వంటివి కూడా ఈ సమయంలో నిషేధము. నియమాలు ఎవరైనా ఉల్లంఘించిన 30 పోలీస్ యాక్ట్ 1861 కింద శిక్షార్హులు అవుతారని ఎస్పీ పేర్కొన్నారు.

## వివోఏల సమ్మెకు మహిళా సంఘాల అధ్యక్షుల సంఘీభావం.




భారత శక్తి న్యూస్, రాజన్న సిరిసిల్ల,జూన్ 1: తమ న్యాయమైన డిమాండ్ల సాధన కోసం కోనరావుపేట మండలంలోని వివోఏలు చేపట్టిన నిరవధిక సమ్మెకు మండలంలోని మహిళా సంఘాల ప్రతినిధుల నుంచి పూర్తిస్థాయిలో మద్దతు లభిస్తోంది. మండల కేంద్రంలో వివోఏలు చేపట్టిన సమ్మె శిబిరానికి సోమవారం మండలంలోని 21 గ్రామాలకు చెందిన 41 మహిళా సంఘాల అధ్యక్షులు తరలివచ్చి వారికి సంఘీభావం ప్రకటించారు. వివోఏల సమస్యలను ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని, వారిని గుర్తించి ఆదుకోవాలని ఈ సందర్భంగా వారు డిమాండ్ చేశారు.ఈ నిరసన కార్యక్రమంలో అన్ని గ్రామాల అధ్యక్షులు, పలువురు ముఖ్య నాయకులు పాల్గొన్నారు.

## ముస్తాబాద్ మండల నూతన ఎస్సైగా బాధ్యతలు స్వీకరించిన జ్యోతి.

భారత శక్తి న్యూస్, ముస్తాబాద్, జూన్ 1: ముస్తాబాద్ మండల నూతన ఎస్సైగా జి.జ్యోతి సోమవారం బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడ విధులు నిర్వహించిన ఎస్సై గణేష్ సిరిసిల్ల పట్టణ పోలీస్ స్టేషన్‌కు బదిలీ కావడంతో, ఆయన స్థానంలో జ్యోతి బాధ్యతలు చేపట్టారు.

ఈ సందర్భంగా సిబ్బంది ఆమెకు పుష్పగుచ్ఛాలు అందజేసి స్వాగతం పలికారు. అనంతరం ఆమె మాట్లాడుతూ.. మండలంలో శాంతి భద్రతలను కాపాడటంతో పాటు, ప్రజల సమస్యల పరిష్కారానికి ఎల్లప్పుడూ అందుబాటులో ఉంటానని తెలిపారు. చట్ట వ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడే వారిపై కఠిన చర్యలు ఉంటాయని హెచ్చరించారు.




## దైవం దిన్నె గ్రామంలో తాగునీటి సమస్యను వెంటనే పరిష్కరించాలి : బహుజన సేన సమితి



ఎమ్మిగనూరు, భారత శక్తి ప్రతినిధి, జూన్ 1:ఎమ్మిగనూరు మండలం దైవం దిన్నె గ్రామ ప్రజలు తీవ్రమైన తాగునీటి సమస్యతో ఇబ్బందులు పడుతున్న నేపథ్యంలో, బహుజన సేన సమితి రాష్ట్ర అధ్యక్షుడు గడ్డం నాగేంద్ర ఆధ్వర్యంలో ఈరోజు ఎమ్మిగనూరు ఎంపీడీవో కు వినతిపత్రం అందజేశారు.గ్రామంలో తాగునీటి కొరత కారణంగా మహిళలు, వృద్ధులు, చిన్నపిల్లలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని, ప్రజలకు తక్షణమే శుద్ధమైన తాగునీరు అందించే చర్యలు చేపట్టాలని వినతిపత్రంలో కోరారు.ఈ సందర్భంగా ఎంపీడీవో సమస్యను త్వరితగతిన పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. గ్రామ ప్రజల సమస్యల పరిష్కారానికి అధికారులు స్పందించడం సంతోషకరమని, కానీ వెంటనే చర్యలు తీసుకుని ప్రజలకు ఉపశమనం కల్పించాలని బహుజన సేన సమితి నాయకులు కోరారు.ఈ కార్యక్రమంలో బహుజన సేన సమితి నాయకులు, గ్రామ ప్రజలు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## వేలేరు నుండి హైదరాబాద్ కొత్త బస్సు సర్వీస్ ను ప్రారంభించిన ఎమ్మెల్యే కడియం శ్రీహరి.



జనగామ(భారతశక్తి)జూన్ 1: వేలేరు నుండి హైదరాబాద్ వెళ్లే కొత్త ఎక్స్ ప్రెస్ బస్సు సర్వీస్ కు వేలేరు మండల కేంద్రంలో మాజీ ఉప ముఖ్యమంత్రి, స్టేషన్ ఘనపూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరి జెండా ఊపి ప్రారంభించారు. ఈ కొత్త బస్సు సర్వీస్ వేలేరులో ఉదయం నాలుగు గంటలకు బయలుదేరి కమ్మరిపేట, బండ తండా,నారాయణగిరి,ముప్పారం, సాయిపేట, క్యాతంపల్లి,పెద్దపెండ్యాల, కరుణాపురం మీదుగా సికింద్రాబాద్ జూబ్లీ బస్టాండ్ కు ఉదయం ఎనిమిది గంటలకు చేరుకుంటుంది అని తెలిపారు. తిరిగి సాయంత్రం నాలుగు గంటలకు సికింద్రాబాద్ నుండి బయలుదేరి రాత్రి ఎనిమిది గంటలకు వేలేరు కు చేరుకుంటుందని తెలిపారు. ప్రయాణికులు ఈ బస్సు సౌకర్యాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఈ ఎక్స్ ప్రెస్ సర్వీస్ ద్వారా మహిళలు ఉచిత ప్రయాణ సదుపాయాన్ని పొందవచ్చని అన్నారు. జూన్ రెండు నుండి వేలేరు వరకు వచ్చే బస్సులను గొల్లకిష్టంపల్లి వరకు పొడిగించనున్నట్లు ప్రకటించారు. ఈ బస్సు సర్వీస్ వెళ్లే ఆయా గ్రామాల ప్రజలు, ప్రయాణికులు ఆర్టీసీ సిబ్బందికి సహకరించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో జనగామ ఆర్టీసీ డిపో మేనేజర్ స్వాతి,వేలేరు, ధర్మసాగర్ మండలాల సర్పంచులు, తహసీల్దార్లు, ఎంపిడివోలు, ఇతర ప్రజా ప్రతినిధులు, అధికారులు, నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## ప్రభుత్వ ఉద్యోగుల బదిలీలపై నిషేధం విధిస్తూ ఉత్తర్వులు



-2-

5. In respect of the existing vacancies to be filled for administrative efficiency, the same shall be filled with persons who have completed one year of active service at their present station, duly submitting proper justification of the proposal for obtaining the concurrence of Finance Department.

6. It is further ordered that the orders issued vide G.O.Ms.No.23, Finance (W&M) Department, dt.23-01-2008, G.O.Ms.No.7, Finance (DCM-III) Department, dt.24-01-2011, G.O.Ms.No.182, General Administration (SPF-MC) Department, dt.21-05-2016, G.O.Ms.No.34, Department for Women, Children, Disabled and Senior Citizens (Prog.II), dt.07.08.2025, Memo.No.3271509-C/455/A1/HRM-I/2025, Finance (HRM.I) Department, dt.08.09.2025 and Memo.No.3607154/147/A1/HRM.I/2026, Finance (HRM.I) Department,dt.10.03.2026 shall continue to be in force until further orders. The administrative department concerned in the Secretariat shall obtain concurrence of Finance Department in all cases proposed to be considered under these G.Os.

7. The Director of Treasuries & Accounts, Telangana State, Hyderabad/ Pay and Accounts Officer, Hyderabad/ Director of Works Accounts, Telangana State, Hyderabad shall not admit the pay bills of the employees whose transfers are considered in deviation of the above orders.

8. All the Departments of Secretariat and Heads of Departments shall follow the above orders scrupulously.

(BY ORDER AND IN THE NAME OF THE GOVERNOR OF TELANGANA)

SANDEEP KUMAR SULTANIA
PRINCIPAL SECRETARY TO GOVERNMENT

To
All Departments of Secretariat.
All Heads of Departments.
All District Collectors.
The Registrar, High Court for the State of Telangana at Hyderabad.
The Accountant General, Telangana, Hyderabad.
The Pay and Accounts Officer, Hyderabad.
The Director of Treasuries & Accounts, Hyderabad.
All District Treasury Officers.
All Officers/ Sections in Finance Department.
Copy to SF/SCs.

// FORWARDED:: BY ORDER //

SECTION OFFICER

-2-

5. In respect of the existing vacancies to be filled for administrative efficiency, the same shall be filled with persons who have completed one year of active service at their present station, duly submitting proper justification of the proposal for obtaining the concurrence of Finance Department.

6. It is further ordered that the orders issued vide G.O.Ms.No.23, Finance (W&M) Department, dt.23-01-2008, G.O.Ms.No.7, Finance (DCM-III) Department, dt.24-01-2011, G.O.Ms.No.182, General Administration (SPF-MC) Department, dt.21-05-2016, G.O.Ms.No.34, Department for Women, Children, Disabled and Senior Citizens (Prog.II), dt.07.08.2025, Memo.No.3271509-C/455/A1/HRM-I/2025, Finance (HRM.I) Department, dt.08.09.2025 and Memo.No.3607154/147/A1/HRM.I/2026, Finance (HRM.I) Department,dt.10.03.2026 shall continue to be in force until further orders. The administrative department concerned in the Secretariat shall obtain concurrence of Finance Department in all cases proposed to be considered under these G.Os.

7. The Director of Treasuries & Accounts, Telangana State, Hyderabad/ Pay and Accounts Officer, Hyderabad/ Director of Works Accounts, Telangana State, Hyderabad shall not admit the pay bills of the employees whose transfers are considered in deviation of the above orders.

8. All the Departments of Secretariat and Heads of Departments shall follow the above orders scrupulously.

(BY ORDER AND IN THE NAME OF THE GOVERNOR OF TELANGANA)

SANDEEP KUMAR SULTANIA
PRINCIPAL SECRETARY TO GOVERNMENT

To
All Departments of Secretariat.
All Heads of Departments.
All District Collectors.
The Registrar, High Court for the State of Telangana at Hyderabad.
The Accountant General, Telangana, Hyderabad.
The Pay and Accounts Officer, Hyderabad.
The Director of Treasuries & Accounts, Hyderabad.
All District Treasury Officers.
All Officers/ Sections in Finance Department.
Copy to SF/SCs.

// FORWARDED:: BY ORDER //

SECTION OFFICER

భారత శక్తి ప్రతినిధి, హైదరాబాద్, జూన్ 1: తెలంగాణలో ప్రభుత్వ ఉద్యోగుల బదిలీలపై ప్రభుత్వం నిషేధం విధించింది. నేటి (జూన్ 1, 2026) నుండి బదిలీల ప్రక్రియపై నిషేధం అమలులోకి వచ్చినట్లు ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. గత నెల (మే 1 నుండి మే 31 వరకు) ఇచ్చిన బదిలీల వెసులుబాటు గడువు ముగియడంతో ఈ నిర్ణయం తీసుకున్నారు.రాబోయే ఆరు నెలల పాటు ఎటువంటి బదిలీ ప్రతిపాదనలను పరిగణనలోకి తీసుకోకూడదని స్పష్టం చేసింది.అయితే, ప్రమోషన్లు, పోస్టుల రద్దు, క్రమశిక్షణ చర్యలు, మరియు దీర్ఘకాలిక సెలవుల నుండి తిరిగి వచ్చిన ఉద్యోగుల పోస్టింగ్‌లకు మాత్రం మినహాయింపు ఇచ్చింది.ఈ ఉత్తర్వులను తెలంగాణ గవర్నర్ పేరుతో ప్రిన్సిపల్ సెక్రటరీ సందీప్ కుమార్ సుల్తానియా విడుదల చేశారు.

నిబంధనలకు విరుద్ధంగా జరిగే బదిలీలకు సంబంధించిన జీతాల బిల్లులను ట్రెజరీ అధికారులు అనుమతించవద్దని ఆదేశించారు.

## మత్స్య శాఖ అధికారిగా బాధ్యతలు స్వీకరించిన మొయినుద్దీన్



కామారెడ్డి జిల్లా (భారత శక్తి ప్రతినిధి) జూన్ 01: మత్స్య శాఖ అధికారిగా లయబ్ మొయినుద్దీన్ ఎఫ్ఏసి గా సోమవారం బాధ్యతలు చేపట్టిన సందర్భంగా జిల్లా కలెక్టర్ ఆశిష్ సాంగ్వాన్ ను మర్యాద పూర్వకంగా కలిసి పూల మొక్కను అందించారు.

# పీర్జాదిగూడలో ఘనంగా బీరప్ప కామరాతి కల్యాణ మహోత్సవం



ఉప్పల్, భారత శక్తి ప్రతినిధి, జూన్ 01:పీర్జాదిగూడలో నిర్వహించిన బీరప్ప కామరాతి కల్యాణ మహోత్సవంలో పీర్జాదిగూడ మున్సిపల్ కార్పొరేషన్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు, ఆర్.వి. ఫౌండేషన్ చైర్మన్ తుంగతుర్తి రవి పాల్గొన్నారు.ఈ సందర్భంగా తుంగతుర్తి రవి మాట్లాడుతూ,బీరప్ప కామరాతి కల్యాణ మహోత్సవం మన సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీక. ఇలాంటి ఆధ్యాత్మిక కార్యక్రమాలు సమాజంలో ఐక్యత, సోదరభావాన్ని పెంపొందిస్తాయి. యువత మన ఆచారాలను, సంప్రదాయాలను పరిరక్షిస్తూ ముందుకు తీసుకెళ్లాల్సిన బాధ్యత ఉంది. భక్తులందరికీ బీరప్ప స్వామి ఆశీస్సులు లభించి సుఖశాంతులు, ఆయురారోగ్యాలు కలగాలని కోరుకుంటున్నాను అని అన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ డిప్యూటీ మేయర్ కుర్ర శివ కుమార్ గౌడ్, కుర్ర శ్రీకాంత్ గౌడ్, ఆలయ కమిటీ సభ్యులు, భక్తులు మరియు స్థానిక ప్రజాప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

# నిర్మల్ జిల్లా కలెక్టర్‌ను మర్యాదపూర్వకంగా కలిసిన రాథోడ్ రమేష్.



నిర్మల్ జిల్లా ప్రతినిధి, జూన్ 01(భారత శక్తి ) నూతన డిఆర్ఓగా బాధ్యతలు స్వీకరించిన అనంతరం జిల్లా కలెక్టరేట్ సమావేశ మందిరంలో జిల్లా కలెక్టర్ భవేశ్ మిశ్రాను రాథోడ్ రమేష్ మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఆయనకు శుభాకాంక్షలు తెలియజేస్తూ పూల మొక్కను అందజేశారు.జిల్లా అభివృద్ధి, ప్రజా సమస్యల పరిష్కారం, ప్రభుత్వ సంక్షేమ పథకాల సమర్థ అమలులో డిఆర్ఓ కీలక పాత్ర పోషించాలని ఆకాంక్షిస్తూ రాథోడ్ రమేష్ అభినందనలు తెలిపారు. అనంతరం జిల్లా పరిపాలనకు సంబంధించిన పలు అంశాలపై స్వల్పంగా చర్చించినట్లు సమాచారం.ఈ కార్యక్రమంలో పలువురు అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

# ప్రజావాణి దరఖాస్తులను సత్వరమే పరిష్కరించాలి

**- జిల్లా కలెక్టర్ - తేజస్ నంద్ లాల్ పవర్**



సూర్యాపేట(భారత శక్తి ప్రతినిధి) జూన్ 1: ప్రజల సమస్యల పరిష్కారమే వేదికగా సాగుతున్న ప్రజావాణి కార్యక్రమానికి అత్యంత ప్రాధాన్యత ఇచ్చి సమస్యలను వెంటనే పరిష్కరించాలని జిల్లా కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవార్ అధికారులను ఆదేశించారు. సోమవారం సమీకృత కలెక్టరేట్ కార్యాలయంలో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమం అనంతరం అధికారులతో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ, ప్రభుత్వ ఆదేశాల మేరకు జిల్లా మరియు డివిజన్ స్థాయి ప్రజావాణి దరఖాస్తులను తప్పనిసరిగా ఆన్‌లైన్ పోర్టల్‌లో నమోదు చేయాలని స్పష్టం చేశారు. పాత ప్రజావాణి పోర్టల్‌లో ఇంకా పరిష్కారం కాకుండా ఉన్న దరఖాస్తులను యుద్ధప్రాతిపదికన పూర్తి చేయాలని కలెక్టర్ ఆదేశించారు. కొత్తగా అందుతున్న దరఖాస్తులను ఎప్పటికప్పుడు పోర్టల్‌లో నమోదు చేయాలని సూచించారు. అధికారులు ప్రజలు పెట్టుకున్న అర్జీలను పెండింగ్‌లో ఉంచకుండా, నిర్ణీత గడువులోగా వాటిని పరిష్కరించేలా చర్యలు తీసుకోవాలని అన్నారు.డివిజన్ స్థాయి ప్రజావాణికి అన్ని శాఖల డివిజనల్ అధికారులు తప్పనిసరిగా హాజరయ్యేలా జిల్లా అధికారులు పర్యవేక్షించాలని ఆదేశించారు. స్థానిక సమస్యలు స్థానికంగానే పరిష్కారమైతే ప్రజలకు ఇబ్బందులు తప్పుతాయని ఆయన పేర్కొన్నారు.సోమవారం నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో భూ సమస్యలకి సంబందించి 57 దరఖాస్తులు, డీపీఓ 6, మున్సిపాలిటీ 6, డిడబ్ల్యుఓ 4, మిగిలిన 30 దరఖాస్తులు వివిధ శాఖలకి చెందినవని, మొత్తం 103 దరఖాస్తులు వచ్చాయాని వాటిని పరిష్కరించేందుకు శాఖల వారీగా పంపించటం జరిగిందని కలెక్టర్ ఈ సందర్భంగా అన్నారు.ఈ కార్యక్రమానికి అదనపు కలెక్టర్ బి. హరి సింగ్, డీఏవో, డిఎంహెచ్ఓ వెంకటరమణ,డి ఇ ఓ అశోక్, డి సి ఓ ప్రవీణ్, డి వై ఎస్ ఓ వెంకటరెడ్డి, ఎస్ సి సంక్షేమ అధికారి దయానందరాణి ఇతర జిల్లా అధికారులు,తదితరులు హాజరైనారు.

# పోలీస్ గ్రీవెన్స్ డేలో బాధితుల పిర్యాదులను పరిశీలించిన జిల్లా ఎస్పి- నరసింహ



సూర్యాపేట (భారత శక్తి ప్రతినిధి) జూన్ 1: సూర్యాపేట జిల్లా పోలీస్ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన పోలీస్ గ్రీవెన్స్ డే కార్యక్రమంలో జిల్లా ఎస్పి నరసింహ పిర్యాదుదారుల నుండి వినతులు స్వీకరించారు. జిల్లా పరిధిలోని వివిధ మండలాల నుంచి వచ్చిన బాధితులు వివిధ సమస్యలపై ఫిర్యాదులకు సంబంధించి బాధితులు ఎస్పిని ప్రత్యక్షంగా కలిసి వినతులు సమర్పించారు.ఈ సందర్భంగా ఎస్పి ప్రతి ఒక్క బాధితుడి సమస్యను విని, వాటి పరిష్కారం కోసం తక్షణ చర్యలు తీసుకునేలా సంబంధిత పోలీస్ అధికారులుతో ఫోన్ ద్వారా మాట్లాడి అవసరమైన సూచనలు జారీ చేశారు. ప్రజలకు త్వరితగతిన న్యాయం అందేలా, వారి సమస్యలను ఆలస్యం చేయకుండా పరిష్కరించాలనే దిశగా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు.అలాగే, ప్రజలు తమ సమస్యల పరిష్కారం కోసం పోలీస్ శాఖ ఎల్లప్పుడూ ప్రజలకు అందుబాటులో ఉంటుందని ఎస్పి తెలిపారు.చట్టబద్ధమైన విధానంలో ప్రతి ఫిర్యాదును పరిశీలించి బాధితులకు న్యాయం జరిగేలా చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు.

# పండగ వాతావరణం లో ఇందిరమ్మ ఇండ్ల ప్రారంభోత్సవాలు

- మన్ సాన్ పల్లిలో ఇందిరమ్మ ఇళ్లను ప్రారంభించిన మంత్రి దామోదర రాజనర్సింహా
- పేదల సొంతింటి కల సాకారం చేస్తున్న ఇందిరమ్మ ఇళ్లు
- లబ్ధిదారులతో గృహప్రవేశాలు చేయించిన ప్రజాప్రతినిధులు అధికారులు





సంగారెడ్డి, భారత శక్తి ప్రతినిధి, జూన్ 01: రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న ఇందిరమ్మ ఇళ్ల పథకంలో ఎంతో కీలకమైన గృహప్రవేశాల మహోత్సవం జిల్లాలో సోమవారం పండుగ వాతావరణంలో ఘనంగా జరిగాయి. రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అసిఫాబాద్లో ఇందిరమ్మ ఇళ్లకు ప్రారంభోత్సవాలు చేసిన నేపథ్యంలో జిల్లాలోని అన్ని అసెంబ్లీ నియోజక వర్గాల పరిధిలోను ఇందిరమ్మ పథకం కింద నిర్మాణాలు పూర్తి చేసుకున్న లబ్ధిదారుల ఇండ్లను ప్రజా ప్రతినిధులు, అధికారులు ప్రారంభోత్సవాలు చేసారు. స్థానిక ప్రజాప్రతినిధులు, నియోజకవర్గ ప్రత్యేక అధికారులు, మండల స్థాయి అధికారులు పాల్గొని లబ్ధిదారులతో గృహప్రవేశాలను చేయించారు.ఆందోల్ మండలం మన్సాన్ పల్లిలో రాష్ట్ర వైద్య, ఆరోగ్య శాఖ మంత్రి దామోదర రాజనర్సింహ ఇందిరమ్మ ఇళ్లను ప్రారంభించి లబ్ధిదారులచే గృహప్రవేశాలు చేయించారు. నీరుడి జ్యోతి, గొల్ల లావణ్య, వంగ సుజాత లబ్ధిదారుల ఇండ్లను మంత్రి ప్రారంభించి గృహప్రవేశాలు చేయించారు.ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ, పేదలకు సొంతింటి కలను సాకారం చేయడం రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని అన్నారు. దశాబ్దాలుగా గూడు కోసం ఎదురుచూస్తున్న పేద కుటుంబాలకు గౌరవప్రదమైన జీవనం అందించేందుకు ముఖ్యమంత్రి నాయకత్వంలో ప్రభుత్వం ఇందిరమ్మ ఇళ్ల కార్యక్రమాన్ని ప్రతిష్ఠాత్మకంగా అమలు చేస్తోందన్నారు. ఇల్లు అనేది కేవలం నాలుగు గోడలు మాత్రమే కాదని, కుటుంబానికి భద్రత, ఆత్మవిశ్వాసం, సామాజిక గౌరవాన్ని కల్పించే ఆస్తి అని పేర్కొన్నారు.రాష్ట్రంలోని ప్రతి అర్హత గల కుటుంబానికి సొంత ఇంటి కలను నెరవేర్చడమే ప్రభుత్వ లక్ష్యమని మంత్రి అన్నారు. ఈ సందర్భంగా లబ్ధిదారులు మాట్లాడుతూ, సొంత ఇంటి కల నిజం కావడం జీవితంలో మరచిపోలేని ఆనందమని పేర్కొన్నారు. ప్రభుత్వం తమ కుటుంబాలకు శాశ్వత భద్రతను కల్పించిందని, సమాజంలో ఆత్మగౌరవంతో జీవించే అవకాశం కల్పించిందని ఆనందం వ్యక్తం చేశారు. ఇందిరమ్మ ఇళ్లు అందించిన రాష్ట్ర ముఖ్యమంత్రికి, జిల్లా మంత్రికి మరియు ప్రభుత్వానికి వారు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్, అదనపు కలెక్టర్ పాండు, స్థానిక ప్రజాప్రతినిధులు, నియోజకవర్గ ప్రత్యేక అధికారి, తహసీల్దార్, ఎంపీడీవో తదితరులు పాల్గొన్నారు.

# ఇందిరమ్మ ఇళ్ల పథకంతో నెరవేరుతున్న పేదల సొంతింటి కల

**- టీజిఐఐసి చైర్ పర్సన్ నిర్మలా జగ్గారెడ్డి**



సంగారెడ్డి, భారత శక్తి ప్రతినిధి, జూన్ 1 : కాంగ్రెస్ ప్రభుత్వం చేపట్టిన ఇందిరమ్మ ఇళ్ల పథకంతో పేదల చిరకాల వాంఛ అయిన సొంతింటి కల నెరవేరుతుందని టీజిఐఐసి చైర్ పర్సన్ నిర్మలా జగ్గారెడ్డి అన్నారు. సోమవారం కంది మండలం కవలంపెట్ లో లబ్ధిదారులు నూతనంగా నిర్మించుకున్న ఇందిరమ్మ ఇళ్ల గృహ ప్రవేశంలో పాల్గొన్నారు.ఈ సందర్భం గా నిర్మలా జగ్గారెడ్డి మాట్లాడుతూ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆధ్వర్యం లో అమలుచేస్తున్న ఇందిరమ్మ ఇళ్ల పథకం ద్వారా రాష్ట్రం లో పేదల సొంతిటి కల నెరవేరుతుందని అన్నారు.

సంగారెడ్డి జిల్లాకు మరో పదివేల ఇందిరమ్మ ఇళ్లు మంజూరు కావడం సంతోషకరమన్నారు. ఇందిరమ్మ ఇంటి కోసం ఇప్పటికీ దరఖాస్తు చేసుకోని వారు వెంటనే దరఖాస్తు చేసుకోవాలని సూచించారు.ఈ కార్యక్రమంలో సంగారెడ్డి నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ కన్వీనర్ జూలకంటి ఆంజనేయులు, మార్కెట్ కమిటీ చైర్మన్ రామ్ చందర్ నాయక్, కవలంపేట సర్పంచ్ కుమ్మరి స్వాతి శ్రీశైలం,కంది మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు మొగులయ్య తదితరులు పాల్గొన్నారు.

# ఐ ఐ టి- జేఈఈ అడ్వాన్స్డ్ పరీక్షల్లో జయ జూనియర్ కళాశాల విద్యార్థుల విజయభేరి

సూర్యాపేట (భారత శక్తి ప్రతినిధి) జూన్ 1: ప్రతిష్టాత్మక భారతీయ సాంకేతిక విద్యా సంస్థల సంయుక్త ప్రవేశ పరీక్ష -- ఉన్నత శ్రేణి 2026 ఫలితాల్లో జయ జూనియర్ కళాశాల, సూర్యాపేట విద్యార్థులు జాతీయ స్థాయిలో అత్యుత్తమ ప్రతిభ కనబరిచారు.అఖిల భారత సాధారణ విభాగంలో 155, 278, 298, 490 స్థానాలతో పాటు వెయ్యి లోపు 7 గురు, ఐదు వేల లోపు 16 మంది విద్యార్థులు స్థానాలు సాధించారు. మొత్తం 21 మంది విద్యార్థులు భారతీయ సాంకేతిక విద్యా సంస్థలలో ప్రవేశానికి అర్హమైన స్థానాలు సాధించారని నిర్వాహకులు జయ మేలుగోపాల్ తెలిపారు. భారతీయ సాంకేతిక విద్యా సంస్థల సంయుక్త ప్రవేశ పరీక్ష -- ఉన్నత శ్రేణి 2026లో జాతీయ స్థాయి అర్హత స్థానాలు సాధించిన విద్యార్థులు ఎన్.అవినాష్ -- అఖిల భారత స్థాయి 155వ స్థానం, డి.రూపశ్రీ -- అఖిల భారత స్థాయి 278వ స్థానం, జి.లిఖిత -- అఖిల భారత స్థాయి 298వ స్థానం, జి.మహేష్ -- అఖిల భారత స్థాయి 490వ స్థానం, ఆర్.మేఘరాజ్ -- అఖిల భారత స్థాయి 551వ స్థానం, లూసిఫెవెన్సి -- అఖిల భారత స్థాయి 848వ స్థానం, బి.భవిత -- అఖిల భారత స్థాయి 938వ స్థానం, ఎం.రితిష్ రెడ్డి -- అఖిల భారత స్థాయి 1005వ స్థానం, డి.రామ్‌చరణ్ తేజ్ -- అఖిల భారత స్థాయి 1615వ స్థానం, పి.సాత్విక్ కుమార్ -- అఖిల భారత స్థాయి 1755వ స్థానం, ఎస్.కె నేహా -- అఖిల భారత స్థాయి 2421వ స్థానం, ఎన్.హరిణి -- అఖిల భారత స్థాయి 2538వ స్థానం, ఎం.డి.ముస్తాఫా -- అఖిల భారత స్థాయి 2691వ స్థానం, జి.శ్రీన -- అఖిల భారత స్థాయి 2941వ స్థానం, బి.శాలిని -- అఖిల భారత స్థాయి 2946వ స్థానం, జి.రంజిత్ కుమార్ -- అఖిల భారత స్థాయి 4434వ స్థానం, యం.హర్షిత -- అఖిల భారత స్థాయి 5987వ స్థానం, వి.గౌతమ్ కుమార్ -- అఖిల భారత స్థాయి 6421వ స్థానం, ఎన్.సిద్ధార్థ -- అఖిల భారత స్థాయి 7655వ స్థానం, జి.లాస్య -- అఖిల భారత స్థాయి 7657వ స్థానం, సి.హెచ్. శివకుమార్ -- అఖిల భారత స్థాయి 9240వ స్థానం సాధించారు.ఈ సందర్భంగా ప్రతిభను కనబరిచిన విద్యార్థులను మరియు కృషి చేసిన అధ్యాపక బృందాన్ని నిర్వాహకులు జయ మేలుగోపాల్ మరియు సంచాలకులు బి.గి జ్యోతి, జిల్లా పద్మ అభినందించారు.

# ప్రజావాణి దరఖాస్తులను వెంటవెంటనే పరిష్కరించాలి: జిల్లా కలెక్టర్ భవేశ్ మిశ్రా



నిర్మల్ జిల్లా ప్రతినిధి, జూన్ 01(భారత శక్తి) ప్రజావాణి దరఖాస్తులను వెంటనే పరిష్కరించాలని జిల్లా కలెక్టర్ భవేశ్ మిశ్రా అధికారులను ఆదేశించారు.సోమవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో కలెక్టర్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ప్రజల నుంచి వచ్చిన ఫిర్యాదులను ఆయన స్వయంగా స్వీకరించారు.ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, ఆయా శాఖల అధికారులు ప్రతి దరఖాస్తును క్షుణ్ణంగా పరిశీలించి తక్షణమే స్పందించాలని సూచించారు. మండలాల వారీగా పెండింగ్‌లో ఉన్న ప్రజావాణి దరఖాస్తులకు సంబంధించి సమస్యలను వెంటనే పరిష్కరించాలన్నారు. ప్రజల సమస్యలను సంబంధిత శాఖలు సమన్వయంతో పరిష్కరించేలా పనిచేయాలని ఆదేశించారు.ప్రజావాణి కార్యక్రమంలో భాగంగా ప్రజలు విద్య, వైద్యం, ఇందిరమ్మ ఇండ్లు, పింఛన్లు, భూ సమస్యలకు సంబంధించి దరఖాస్తులను కలెక్టర్‌కు సమర్పించారు.ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్లు బి. వెంకటేశ్వర్లు, కిషోర్ కుమార్, డి ఆర్ ఓ రాథోడ్ రమేష్, ఎస్ డి సి జల కుమారి, వివిధ శాఖల అధికారులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# బాధితుల సమస్యల పరిష్కారమే లక్ష్యంగా గ్రీవెన్స్ డే కార్యక్రమం

**-గ్రీవెన్స్ డే ద్వారా ప్రజా సమస్యలకు పారదర్శకంగా తక్షణ పరిష్కారం**

**-జిల్లా పోలీసు కార్యాలయంలో ప్రజా ఫిర్యాదులు స్వీకరించిన జిల్లా ఎస్పీ డా.జి.జానకి షర్మిల.**



నిర్మల్ జిల్లా ప్రతినిధి, జూన్ 01(భారత శక్తి) జిల్లా పోలీసు ముఖ్య కార్యాలయం నందు నిర్వహించిన గ్రీవెన్స్ డే కార్యక్రమానికి నిర్మల్ డివిజన్ పరిధిలోని వివిధ ప్రాంతాల నుండి వచ్చిన ఆర్జీదారుల నుండి ఫిర్యాదులు స్వీకరించి వెంటనే పిర్యాదు దారుల ముందే సంబంధిత పోలీస్ స్టేషన్ల అధికారులకు ఫోన్ల ద్వారా బాధితులకు చట్టపరంగా అందాల్సిన సహాయాన్ని అందిస్తూ వారి సమస్యలను పరిష్కరించాలని జిల్లా ఎస్పీ ఆదేశించారు.ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ మాట్లాడుతూ ప్రజలకు పోలీస్ సేవలు మరింత చేరువ చేయడమే లక్ష్యంగా, ప్రజా సమస్యలు పరిష్కరించే విధంగా కృషి చేయడం జరుగుతుందని, పోలీస్ అధికారులు, సిబ్బంది పోలీస్ స్టేషన్ కి వచ్చిన ఫిర్యాదుదారులతో మర్యాదపూర్వకంగా ప్రవర్తించి, వినతులు, ఫిర్యాదులు స్వీకరించి, అవసరమైతే క్షేత్ర స్థాయిలో పరిశీలించి చట్ట ప్రకారం బాధితులకు న్యాయం జరిగే విధంగా చూడాలన్నారు.తద్వారా ఫిర్యాదుదారునికి పోలీస్ శాఖపై భరోసా, నమ్మకం కలుగుతుందన్నారు. గ్రీవెన్స్ డే లో వచ్చిన ఫిర్యాదులు ఆన్ లైన్ లో పొందుపరుస్తూ ఏ మేరకు పరిష్కారం అయ్యాయో అని ఎప్పటికప్పుడు సమీక్షించుకుంటూ ప్రజలకు మరింత సమర్ధవంతంగా సేవలందించడం జరుగుతుందని అన్నారు. గ్రీవెన్స్ డే ద్వారా ప్రజలు నేరుగా వారి సమస్యలను మా దృష్టికి తీసుకురావడం ద్వారా సాధ్యమైనంత త్వరగా వాటిని పరిష్కరించేలా చూస్తామని ఎస్పీ తెలిపారు.గ్రీవెన్స్ డేలో వచ్చిన ప్రతి ఫిర్యాదు పైన సంబంధిత పోలీసు స్టేషన్ అధికారులకు వెంటనే ఆదేశాలు జారీ చేసి, ఫాలోఅప్ చర్యలు తీసుకుంటున్నామని చెప్పారు.సమస్యల పరిష్కారంలో ఆలస్యం జరగకుండా పర్యవేక్షణ చేస్తామని హామీ ఇచ్చారు.బాధితులకు సత్వర న్యాయం జరిగేలా పారదర్శక విధానంలో చర్యలు తీసుకోవడమే మా ప్రధాన లక్ష్యం అని పేర్కొన్నారు.

# అగ్నివీర్‌లుగా ఎంపికైన ముగ్గురు యువకులకు సన్మానం.



నిర్మల్ జిల్లా ప్రతినిధి, జూన్ 01 (భారత శక్తి) సోన్ మండలం కడ్తాల్ గ్రామానికి చెందిన ముగ్గురు యువకులు అగ్నివీర్ సైనికులుగా ఎంపిక కావడం అభినందనీయమని ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా పరిషత్ మాజీ చైర్‌పర్సన్ వి.శోభారాణి, బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు, నిర్మల్ ఉమ్మడి మండల పరిషత్ మాజీ అధ్యక్షుడు వి.సత్యనారాయణ గౌడ్ అన్నారు. సోమవారం నిర్మల్ పట్టణంలోని ఇంద్రానగర్‌లో అగ్నివీర్‌లుగా ఎంపికైన బర్మ మహేష్, అరిగెల లక్ష్మణ్, కొమ్ముల రామ్‌చరణ్‌లను ఘనంగా సన్మానించారు. యువకులను ప్రోత్సహించిన వారి తల్లిదండ్రులను అభినందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కష్టపడి చదివి సైనికులుగా ఎంపిక కావడం గర్వకారణమన్నారు. క్రమశిక్షణతో శిక్షణ పొంది దేశ రక్షణలో భాగస్వాములు కావాలని సూచించారు. ఒకే గ్రామానికి చెందిన ముగ్గురు యువకులు ఒకేసారి అగ్నివీర్‌లుగా ఎంపిక కావడం గ్రామానికి గర్వకారణమని పేర్కొన్నారు. కార్యక్రమంలో మంజులాపూర్ వైస్‌చైర్మన్ బర్మ గంగాదాస్, నాయకులు భూమన్న, అశోక్, యువకుల తల్లిదండ్రులు తదితరులు పాల్గొన్నారు.

# పర్యవేక్షణ కమిటీ సమావేశంలో పడకేసిన అధికారులు



ములుగు జిల్లా ప్రతినిధి, జూన్ 01 (భారత శక్తి): జిల్లా కలెక్టర్, డీఎఫ్ఓ నిర్వహించిన జిల్లా స్థాయి పర్యవేక్షణ కమిటీ సమావేశంలో కొందరు అధికారులు నిద్రలోకి జారుకున్నారు. జిల్లా కేంద్రంలోని కలెక్టరేట్ సమావేశ హాల్లో అటవీశాఖ ఆధ్వర్యంలో సోమవారం నిర్వహించిన జిల్లా స్థాయి పర్యవేక్షణ కమిటీ సమావేశంలో జిల్లా కలెక్టర్ భోర్ఖడే హేమంత్ సహదేవరావు, జిల్లా అటవీశాఖ అధికారి వికాస్ మీనా లు ప్రజా పాలన ప్రగతి ప్రణాళికలో భాగంగా ప్రకృతి పర్యవేక్షణ ప్రగతి ప్రణాళిక లక్ష్యంపై పలు శాఖల అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహిస్తుండగా కొందరు అధికారులు మాత్రం నిద్రలోకి జారుకున్నారు. దీంతో సంబంధిత అధికారులు ప్రకృతి పర్యవేక్షణ ఎంతవరకు నిర్వహిస్తారో వేచి చూడాల్సిందే.

# వరి ధాన్యం కొనుగోలు చేసి లారీలు పంపించాలని కలెక్టర్‌కు వినతి



సంగారెడ్డి, భారత శక్తి ప్రతినిధి, జూన్ 1 :జిల్లాలో వరి ధాన్యం కొనుగోలు ప్రక్రియను వేగవంతం చేసి, కొనుగోలు కేంద్రాలకు వెంటనే లారీలు పంపించాలని కోరుతూ జిల్లా రైతు సమాఖ్య అధ్యక్షులు రంగా గౌడ్, ఉపాధ్యక్షులు మద్దుల బాల్ రెడ్డి ఆధ్వర్యంలో రైతులు ప్రజావాణి కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ ప్రదీప్ జైన్‌ను కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, వరి పండించిన రైతుల నుంచి ధాన్యం కొనుగోలు చేయడంలో తీవ్ర జాప్యం జరుగుతోందని ఆవేదన వ్యక్తం చేశారు. కొనుగోలు కేంద్రాలకు సమయానికి లారీలు రాకపోవడంతో ధాన్యం బస్తాలు కేంద్రాల వద్దే పేరుకుపోయాయని తెలిపారు. ఇప్పటికే రైతులు అనేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని, వర్షాలు కురిసే అవకాశం ఉన్న నేపథ్యంలో ధాన్యం తడిసిపోతే భారీ నష్టం వాటిల్లుతుందని ఆందోళన వ్యక్తం చేశారు. అందువల్ల అధికారులు వెంటనే స్పందించి ధాన్యం కొనుగోలు ప్రక్రియను వేగవంతం చేయడంతో పాటు, అవసరమైన లారీలను పంపించి రైతులకు న్యాయం చేయాలని కలెక్టర్‌ను కోరారు. ఈ కార్యక్రమంలో రైతు ప్రతినిధులు, రైతులు పాల్గొన్నారు.

# తెలంగాణ బీజేపీలో పోస్టర్ వార్

**మేడ్చల్ (భారత శక్తి)** మల్కాజ్ గిరి ఎంపి ఈటెల రాజేందర్ మీద నిజామాబాద్ ఎంపీ అరవింద్ ఫ్లెక్సీలు ఏర్పాటు చేసినట్లు సమాచారం. ఈటెల ఏడుపే బీజేపీకి శాపం. ఈటలకు రాష్ట్ర అధ్యక్ష పదవి రాలేదని ఏడుపు. సీఎం అభ్యర్థిగా ప్రకటించలేదని ఏడుపు. కేంద్ర మంత్రి పదవి రాలేదని ఏడుపు అని ఫ్లెక్సీలలో పేర్కొన్నారు.రెండు చోట్ల ఎమ్మెల్యేగా ఈటల పోటీ చేసే అవకాశం ఇచ్చింది బీజేపీ. ఓడిపోయినా మల్కాజిగిరి ఎంపీ టికెట్ ఇచ్చింది బీజేపీ. మోదీ రి నాయకత్వంలో గెలిచాక కూడా "నా ఇమేజ్ తోనే గెలిచాను" అనడం ఏ రాజకీయ నైతికత. బీసీ నాయకులు ఎదుగుతుంటే అసహనం ఎందుకు ? ఇందూరు బిడ్డ ఎంపీ అరవింద్ కు వస్తున్న ఆదరణ చూసి కడుపుమంట ఎందుకు ? "నేనే బీసీ నాయకుడిని... నేనే ప్రత్యామ్నాయం" అనే భ్రమ నుంచి బయటకు రా ఈటెల! అంటే మేడ్చల్ లోని పలు చోట్ల ఫ్లెక్సీలు ఏర్పాటు చేసారు.

# ఆర్టీసీ బస్సును ఢీకొన్న కారు

**హైదరాబాద్ (భారత శక్తి)** మెహదీపట్నం బస్ స్టాప్ సమీపంలో సోమవారం రోడ్డు ప్రమాదం జరిగింది. ప్రయాణీకుల కోసం ఆగి ఉన్న ఆర్టీసీ బస్సును వెనక నుంచి వచ్చిన ఒక కారు అతివేగంగా బలంగా ఢీకొట్టింది.

ఈ ప్రమాదంలో కారు ఇంజిన్ భాగం పూర్తిగా బస్సు క్రిందకు దూసుకుపోవడంతో కారు నుజ్జునుజ్జయింది. ప్రయాణికులకు స్వల్ప గాయలయ్యాయి.

# ప్రజల అర్జీలను పరిష్కరించాలి: జిల్లా కలెక్టర్



ములుగు జిల్లా ప్రతినిధి, జూన్ 01 (భారత శక్తి): ప్రజావాణిలో ప్రజలు ఇచ్చిన అర్జీలను వెంటనే పరిష్కరించాలని జిల్లా కలెక్టర్ భోర్ఖడే హేమంత్ సహదేవరావు అధికారులను ఆదేశించారు.జిల్లా కేంద్రంలోని కలెక్టరేట్ సమావేశ మందిరంలో నిర్వహించిన ప్రజావాణి లో కలెక్టర్ ప్రజల నుంచి దరఖాస్తులను స్వయంగా స్వీకరించారు.ప్రజావాణి కార్యక్రమంలో మొత్తం వంద దరఖాస్తులు రాగా, వాటిలో ఇందిరమ్మ ఇండ్లకు 25, పెన్షన్లకు 37,ఇతర శాఖలకు సంబంధించినవి 38 దరఖాస్తులు అందాయి.ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ప్రజలు సమర్పించిన ప్రతి అర్జీని సంబంధిత శాఖ అధికారులు బాధ్యతాయుతంగా పరిశీలించి, నిర్దేశిత గడువులోగా పరిష్కరించాలని ఆదేశించారు. ప్రజలు కార్యాలయాల చుట్టూ తిరగాల్సిన అవసరం లేకుండా సమస్యల పరిష్కారానికి అధికారులు ప్రత్యేక దృష్టి సారించాలని సూచించారు. ప్రజావాణిలో వచ్చిన దరఖాస్తులపై ఎప్పటికప్పుడు సమీక్ష నిర్వహిస్తూ పరిష్కార ప్రక్రియను వేగవంతం చేయనున్నట్లు తెలిపారు.ప్రభుత్వం ప్రజా సమస్యల పరిష్కారానికి అత్యంత ప్రాధాన్యత ఇస్తోందని, ప్రజావాణి ద్వారా అందిన ప్రతి వినతిని పారదర్శకంగా పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటున్నామని కలెక్టర్ పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో జిల్లా అదనపు కలెక్టర్లు సీహెచ్ మహేందర్ జి, సంపత్ రావు, ఇంచార్జ్ ఆర్డీఓ ప్రతాప్,అన్ని శాఖల జిల్లా అధికారులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# చెన్నూరు రిజర్వాయర్ పనులను పరిశీలించిన పాలకుర్తి ఎమ్మెల్యే యశస్వినిరెడ్డి.



జనగామ(భారత శక్తి)జూన్ 1: పాలకుర్తి నియోజకవర్గ పరిధిలోని చెన్నూరు రిజర్వాయర్ వద్ద కొనసాగుతున్న అభివృద్ధి పనులను పాలకుర్తి శాసన సభ్యురాలు మామిడాల యశస్విని రెడ్డి ప్రత్యక్షంగా పరిశీలించారు.రిజర్వాయర్ పరిసర ప్రాంతాలను సందర్శించి జరుగుతున్న పనుల పురోగతిని అధికారులను,సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా రిజర్వాయర్ పనుల నాణ్యత, వేగం, ప్రజలకు కలిగే ప్రయోజనాలపై ప్రత్యేక దృష్టి సారించిన ఎమ్మెల్యే అక్కడికక్కడే సంబంధిత అధికారులతో ఫోన్‌లో మాట్లాడి పనులను మరింత వేగవంతం చేయాలని,ముఖ్యంగా రైతులకు సాగునీటి అవసరాలు అన్నారు. స్థానిక ప్రజలకు తాగునీటి సౌకర్యాలు సమయానికి అందే విధంగా ఎటువంటి నిర్లక్ష్యం లేకుండా పనులను త్వరగా పూర్తి చేయాలని, ప్రజల అవసరాలను దృష్టిలో పెట్టుకొని ప్రభుత్వం చేపడుతున్న ప్రతి అభివృద్ధి కార్యక్రమం సమయానికి పూర్తవ్వాలని, పనుల విషయంలో రాజీ పడబోమని, రిజర్వాయర్ పూర్తి అయితే పరిసర గ్రామాల రైతులకు పెద్ద ఎత్తున ప్రయోజనం చేకూరుతుందని, నీటి సమస్యకు శాశ్వత పరిష్కారం లభిస్తుందని అన్నారు. అలాగే పనుల నాణ్యత విషయంలో ఎటువంటి లోపాలు ఉండకూడదని, అధికారులు తరచూ పర్యవేక్షణ నిర్వహించాలని, ప్రజలకు ఇచ్చిన హామీలను నెరవేర్చేందుకు నిరంతరం కృషి చేస్తున్నామని ఎమ్మెల్యే యశస్విని అన్నారు.

# ప్రజావాణి సమస్యల సత్వర పరిష్కారంపై దృష్టి సారించాలి

**- జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్**



సంగారెడ్డి, భారత శక్తి ప్రతినిధి, జూన్ 01: ప్రజావాణి లో వచ్చిన దరఖాస్తులను త్వరితగతిన పరిష్కరించేలా అధికారులు ప్రత్యేక దృష్టి సారించాలని కలెక్టర్ ప్రతీక్ జైన్ అధికారులను ఆదేశించారు. ప్రజావాణి కార్యక్రమానికి వచ్చే ప్రతి ఫిర్యాదును బాధ్యతగా స్వీకరించి, నిర్ణీత గడువులో పరిష్కరించాలని సూచించారు.సోమవారం జిల్లా కలెక్టరేట్‌లోని గ్రీవెన్స్ హాల్‌లో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో అడిషనల్ కలెక్టర్లతో కలిసి కలెక్టర్ ప్రజల నుంచి వినతులు స్వీకరించారు. వివిధ సమస్యలతో వచ్చిన ప్రజల నుంచి వివరాలు తెలుసుకుని, సమస్యల పరిష్కారం కోసం సంబంధిత శాఖల అధికారులకు తగిన సూచనలు జారీ చేశారు.జిల్లాలో డివిజన్ వారీగా, కలెక్టరేట్లో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమాల్లో మొత్తం 73 ఫిర్యాదులు అందినట్లు అధికారులు తెలిపారు. అందులో కలెక్టరేట్‌కు 38, సంగారెడ్డి డివిజన్‌కు 05, ఆందోల్ డివిజన్‌కు 01, నారాయణఖేడ్ డివిజన్‌కు 9, జహీరాబాద్ డివిజన్‌కు 20 ఫిర్యాదులు అందినట్లు వెల్లడించారు.ఈ కార్యక్రమం లో అడిషనల్ కలెక్టర్లు సంగీత, పాండు, జిల్లా అధికారులు, రెవెన్యూ అధికారులు,, మున్సిపల్ కమిషనర్లు, కలెక్టరేట్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## కల్లుగీత కార్మిక సంఘం రాష్ట్ర గౌరవ అధ్యక్షుడు కల్లెపు వెంకటయ్య కుమారుడు దశదిన కార్యక్రమంలో పాల్గొన్న రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బెల్లంకొండ వెంకటేశ్వర్లు



జనగామ(భారత శక్తి)జూన్ 1: కల్లుగీత కార్మిక సంఘం రాష్ట్ర గౌరవాధ్యక్షుడు కళ్లేపు వెంకటయ్య కుమారుడు సుధాకర్ అనారోగ్యంతో మరణించగా ఈరోజు అశోక నగరంలో దశదిన కార్యక్రమంలో పాల్గొన్న కల్లుగీత కార్మిక సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బెల్లంకొండ వెంకటేశ్వర్లు, మహబూబాబాద్ జిల్లా అధ్యక్ష కార్యదర్శులు గౌని వెంకన్న, యమగాని వెంకన్న, హనుమకొండ సిపిఎం పార్టీ జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు ఎమ్ చుక్కయ్య, పానుగంటి వీరస్వామి, వారి కుమారుడి చిత్రపటానికి పూలువేసి నివాలర్పించారు.వారితో పాటు నాయకులు పాల్గొన్నారు.

# మొక్కలు నాటి ప్రకృతినికాపాడుదాం

**- జిల్లా కలెక్టర్ బోర్ఖడే హేమంత్ సహదేవరావు**



ములుగు జిల్లా ప్రతినిధి, జూన్ 01 భారత శక్తి): ప్రకృతి పరిరక్షణే ప్రగతి ప్రణాళిక లక్ష్యమని, ప్రతి ఒక్కరూ మొక్కలను నాటి ప్రకృతిని పరిరక్షించాలని జిల్లా కలెక్టర్ బోర్ఖడే హేమంత్ సహదేవరావు అన్నారు. ప్రజాపాలన -- ప్రగతి ప్రణాళికలో భాగంగా వన మహోత్సవ కార్యక్రమాల నిర్వహణ, పర్యావరణ, అటవీ శాఖ కార్యక్రమాల ప్రారంభం, సమీక్షకు సంబంధించి జిల్లా స్థాయి పర్యవేక్షణ కమిటీ సమావేశం సోమవారం జిల్లా కలెక్టరేట్ సమావేశ మందిరంలో అటవీ శాఖ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సమావేశానికి జిల్లా కలెక్టర్ బోర్ఖడే హేమంత్ సహదేవరావు, జిల్లా అటవీ శాఖ అధికారి వికాస్ మీనా తో కలిసి పాల్గొన్నారు.ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ, పర్యావరణ పరిరక్షణ ప్రతి ఒక్కరి సామాజిక బాధ్యత అని అన్నారు. వన మహోత్సవం ద్వారా ప్రజల్లో ప్రకృతి సంరక్షణపై అవగాహన పెంపొందించాల్సిన అవసరం ఉందన్నారు. మొక్కలు నాటడం మాత్రమే కాకుండా వాటిని సంరక్షించి పెంచడం ద్వారా భవిష్యత్ తరాలకు స్వచ్ఛమైన, ఆరోగ్యకరమైన వాతావరణాన్ని అందించవచ్చని తెలిపారు. జిల్లాలోని అన్ని ప్రభుత్వ శాఖలు, విద్యాసంస్థలు, స్వచ్ఛంద సంస్థలు, స్వయం సహాయక సంఘాలు, యువత, ప్రజలు వన మహోత్సవ కార్యక్రమాల్లో స్వచ్ఛందంగా భాగస్వాములు కావాలని ఆయన కోరారు. : జిల్లా అటవీ శాఖ అధికారి వికాస్ మీనా మాట్లాడుతూ,ఈ కార్యక్రమంలో భాగంగా పర్యావరణ పరిరక్షణపై అవగాహన సదస్సులు, సింగిల్ యూజ్ ప్లాస్టిక్ నిర్మూలన కార్యక్రమాలు, సైకిల్ ర్యాలీలు, పరిశుభ్రత కార్యక్రమాలు, పాఠశాలలు మరియు కళాశాలల్లో క్విజ్, వ్యాసరచన, చిత్రలేఖన పోటీలు నిర్వహించనున్నట్లు తెలిపారు.ఈ కార్యక్రమంలో జిల్లా అదనపు కలెక్టర్, స్థానిక సంస్థల సంపత్ రావు, ఇన్‌ఛార్జ్ ఆర్డీఓ ప్రతాప్, జిల్లా అధికారులు, అటవీ శాఖ అధికారులు, సంబంధిత శాఖల అధికారులు పాల్గొన్నారు.

# ఇందిరమ్మ ఇండ్ల గృహప్రవేశాలు పాల్గొన్న ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు



రేగొండ, జూన్ 1 (భారత శక్తి): రేగొండ మండలం కేంద్రంతో పాటు రావులపల్లె లో ఇందిర మ్మ ఇల్లు నిర్మించుకున్న బైరగాని రమ్య, మద్ది కవిత ఇందిరమ్మ ఇళ్ల నూతన గృహప్రవేశ కార్యక్రమనికి భూపాలపల్లి ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు హాజరై ప్రారంభోత్సవాలు చేశారు. ఇందిరమ్మ ఇళ్ల పథకం ద్వారా నిరుపేదలైన భైరగాని రమ్య, మద్ది కవిత లు ప్రభుత్వ లక్ష్యానికి అనుగుణంగా పూర్తి చేసిన సందర్భంగా ఎమ్మెల్యే గండ్ర వారి కుటుంబ సభ్యులను అభినందించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే గండ్ర మాట్లాడుతూ ప్రజా ప్రభుత్వం మహిళల సంక్షేమం, ఆర్థిక భద్రత మరియు గౌరవప్రదమైన జీవన విధానానికి ప్రత్యేక ప్రాధాన్యత ఇస్తోందని తెలిపారు. ప్రతి పేద కుటుంబానికి సొంత ఇల్లు కల్పించాలనే లక్ష్యంతో ప్రభుత్వం ఇందిరమ్మ ఇండ్ల పథకాన్ని సమర్థవంతంగా అమలు చేస్తోందని అన్నారు. మహిళ సాధికారత ద్వారానే సమాజ అభివృద్ధి సాధ్యమవుతుందని పేర్కొన్నారు.అలాగే గ్రామీణ ప్రాంతాల్లో మౌలిక వసతుల అభివృద్ధి, సంక్షేమ పథకాల అమలు, పేదల జీవన ప్రమాణాల మెరుగుదల కోసం ప్రభుత్వం కట్టుబడి పనిచేస్తోందని ఎమ్మెల్యే గండ్ర వివరించారు ఈ కార్యక్రమంలో తాసిల్దార్ శ్వేత, ఎంపీడీవో యం వెంకటేశ్వర్ రావు, హౌసింగ్ డిఈ శ్రీకాంత్ , ఏ ఈ ప్రేమలత,రేగొండ మండల పార్టీ అధ్యక్షుడు ఇప్ప కాయల నరసయ్య, టౌన్ అధ్యక్షులు ఏనుగు రవీందర్ రెడ్డి, భూపాల పల్లి వ్యవసాయ మార్కెట్ చైర్మన్ గుటోజు కిష్టయ్య, కోటంచ ఆలయ చైర్మన్ రాష్ట్ర నాయకులు నాయినేని సంపత్ రావు, పిఏసిఎస్ చైర్మన్ నడిపెల్లి విజన్ రావు , స్థానిక సర్పంచ్ వారణాసి మౌనిక అంజి, సర్పంచులు గడ్డే రఘు,గూట్ల స్వప్న తిరుపతి, బానోతు రవళిక వీర నాయక్, మాజీ ఎంపీపీ పున్నం లక్ష్మి రవి మాజీ ఎంపిటిసి మైస సుమలత బిక్షపతి పట్టేం శంకర్, జిల్లా సీనియర్ నాయకులు శ్రీపతి పురుషోత్తం గౌడ్, కొలెపాక సాంబయ్య,రొంటాల సదానందం, మండల నాయకులు బైరగాని వెంకన్న గౌడ్ ,పున్నం భాస్కర్, సామల సురేందర్, తదితరులు పాల్గొన్నారు.

# అనాథ విద్యార్థులకు జూనియర్ ఛాంబర్ శాఖల విరాళం



ఎల్బీనగర్, జూన్ 01(భారత శక్తి): ఆర్కేపురంలోని అనాథ విద్యార్థి గృహంలో ఉంటున్న 100 మంది విద్యార్థులకు జూనియర్ ఛాంబర్ ఇంటర్నేషనల్ శాఖ -- హైదరాబాద్ ఛాంపియన్స్ మరియు సికింద్రాబాద్ దాఫోదిల్స్ శాఖల సభ్యులు సోమవారం ప్రఖ్యాత వారిస్ కంపెనీకీ చెందిన 100 వాటర్ బాటిల్స్ ను ముఖ్య అతిథిగా హాజరైన జూనియర్ ఛాంబర్ ఇంటర్నేషనల్ నేషనల్ ప్రెసిడెంట్ భరత్ ఆచార్య చేతుల మీదుగా అందజేయడం జరిగింది..ఈ సందర్భంగా భరత్ మాట్లాడుతూ, ఒక మంచి ఉద్దేశంతో రెండు రాష్ట్రాలలోని అనాథ, నిరుపేదలను తీసుకొని వారికి అన్ని సౌకర్యాలు కల్పించి, ముఖ్యంగా కార్పొరేట్ విద్యా సౌకర్యాలు కల్పించి వారి భవిష్యత్తు కోసమే కృషి చేస్తున్న అనాథ విద్యార్థి గృహ కమిటీని అభినందించారు. ఈ విద్యా సంవత్సరంలో విద్యార్థులకు అత్యవసరమైన స్టీల్ వాటర్ బాటిల్స్ అత్యవసరమని విద్యార్థుల ద్వారా తెలుసుకొని డబ్బుకు వెనుకాడక జెసిఐ హైదరాబాద్ ఛాంపియన్స్ మరియు జెసిఐ సికింద్రాబాద్ డఫసిల్స్ శాఖల వారు ఈ విద్యార్థి గృహములోని విద్యార్థులకు 100 వాటర్ స్టీల్ బాటిల్స్ ను అందజేయాలని నిర్ణయించుకున్నందుకు ఆ శాఖల బాధ్యులను నేషనల్ ప్రెసిడెంట్ భరత అభినందించారు.ఈ కార్యక్రమంలో జెసిఐ 12 వ జోన్ అధ్యక్షులు గౌతమ్ కుమార్ జైన్, హైదరాబాద్ ఛాంపియన్స్ అధ్యక్షులు కిషోర్ కుమార్ , సికింద్రాబాద్ దాఫోదిల్స్ శాఖ ముఖ్యులు అనిత చెక్కాలా,అనాథ విద్యార్థుల గృహ అధ్యక్షులు మార్గం రాజేష్ పాల్గొన్నారు.

# నూతన పార్కుల ఏర్పాటుతో ఆరోగ్యం - ఆహ్లాదం

**- పటాన్చెరు శాసనసభ్యులు గూడెం మహిపాల్ రెడ్డి**

**-24 పార్కుల అభివృద్ధికి ప్రత్యేక నిధులు..**







రామచంద్రాపురం జూన్ 1 భారత శక్తి అమీన్‌పూర్, పటాన్‌చెరు సర్కిళ్ల పరిధిలోని డివిజన్లలో 24 పార్కుల అభివృద్ధికి ప్రత్యేక నిధులు విడుదల అయ్యాయని.. ప్రతి పార్కుని ప్రజల కోసం ఆహ్లాదకరంగా తీర్చిదిద్దుతున్నామని పటాన్‌చెరు శాసన సభ్యులు గూడెం మహిపాల్ రెడ్డి తెలిపారు. సోమవారం తెల్లాపూర్ డివిజన్ పరిధిలోని కొల్లూరు డబుల్ బెడ్ రూమ్ ఫేజ్ 2 కాలనీ పార్కు, హుడా కాలనీ పార్కు 2 కాలనీలలో ఒక కోటి 40 లక్షల రూపాయలతో చేపట్టనున్న పార్కుల అభివృద్ధి పనులకు ఎమ్మెల్యే జీఎంఆర్ శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పట్టణాలు, గ్రామాల్లో నూతన పార్కుల ఏర్పాటు ద్వారా ప్రజల ఆరోగ్యం, ఆహ్లాదానికి దోహదపడుతుందని తెలిపారు . పార్కులు పచ్చదనాన్ని పెంపొందించడమే కాకుండా ప్రజలకు స్వచ్ఛమైన వాతావరణంలో నడక, వ్యాయామం చేసుకునే అవకాశాన్ని కల్పిస్తాయని అన్నారు. పార్కుల అభివృద్ధితో పర్యావరణ పరిరక్షణకు తోడ్పాటుతో పాటు ప్రజల మానసిక, శారీరక ఆరోగ్యం మెరుగుపడుతుందని పేర్కొన్నారు.

ప్రజలు పార్కులను సద్వినియోగం చేసుకొని ఆరోగ్యకరమైన జీవనశైలిని అలవరుచుకోవాలని, పరిసరాలను పరిశుభ్రంగా ఉంచడంలో భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు.

ఈ కార్యక్రమంలో రామచంద్రపురం తహసిల్దార్ సరస్వతి, పటాన్‌చెరు సర్కిల్ డిప్యూటీ కమిషన్ జ్యోతి రెడ్డి, ఈఈ సురేష్, తెల్లాపూర్ మున్సిపల్ మాజీ చైర్మన్ లలిత సోమిరెడ్డి, మాజీ వైస్ చైర్మన్ రాములు గౌడ్, డి ఈ కృష్ణవేణి, యు బి డి మేనేజర్ విక్రమ్, బి ఆర్ ఎస్ పార్టీ సీనియర్ నాయకులు దేవేందర్ యాదవ్, మల్లారెడ్డి, మాజీ ప్రజా ప్రతినిధులు, తదితరులు పాల్గొన్నారు.

# విచారణ చేపట్టి...నివేదిక ఇస్తాం

## - ఎమ్మార్వో వేణుగోపాల్



ఎల్బీనగర్, జూన్ 01(భారత శక్తి): 'సరూర్‌నగర్ మండలం కర్మన్‌ఘాట్, నందిహిల్స్‌లోని పలు సర్వే నంబర్లపై హైకోర్టు స్టే ఇచ్చింది. గతంలో ఇచ్చిన ఆక్యుపెన్సీ రైట్స్ సర్టిఫికెట్ (ఓఆర్‌సీలను రద్దు చేసింది). ఈ అంశంపై సమగ్ర విచారణ జరిపి... తుది నివేదికను అందజేయాలని సూచించింది. ఆ మేరకు చర్యలు చేపడుతామని సరూర్‌నగర్ తహశీల్దార్ వేణుగోపాల్ స్పష్టం చేశారు. ఈ మేరకు సోమవారం ఆయన మీడియాతో మాట్లాడారు. . ఈ అంశంపై ఆందోళన చెందాల్సిన అవసరం లేదు.

### కోర్టు ఉత్తర్వుల నేపథ్యంలో ఆంక్షలు

1970 దశకం నాటి ల్యాండ్ రీఫార్మ్ ట్రిబ్యునల్ రికార్డులు ఇప్పుడు సంచలనంగా మారాయి. కర్మన్‌ఘాట్ గ్రామంలోని (సీసీ నంబర్ ఈ/2476,2477,2478,/1975) పలు సర్వే నంబర్ల భూములపై హైకోర్టు ఉత్తర్వులు జారీ చేసింది. ఇనాందారు వారసులకు, ఇతర ప్రైవేటు భాగస్వాములకు నోటీసులు ఇచ్చి, ఆరు నెలల వ్యవధిలో విచారణ ముగించాలని ఆదేశించింది. అప్పటి వరకు ఈ సర్వే నంబర్లలోని భూములకు ఎలాంటి అనుమతులు ఇవ్వకూడదని పేర్కొంది. దీంతో రిజిస్ట్రేషన్లు, ఇంటి నిర్మాణానికి అనుమతులు నిలిపి వేస్తున్నట్లు అధికారులు చెప్పడంతో స్థానికుల్లో అలజడి మొదలైంది.

అసలు ఈ కేసు ఏమిటీ..? మరణించిన వ్యక్తులు, వారి చట్టబద్ధమైన వారసులను పార్టీగా చేర్చకుండా ఇనాం భూములకు ఓఆర్‌సీలు జారీ చేశారనే అభియోగంపై దాఖలైన రిట్ పిటిషన్(డబ్ల్యూపీ నంబర్ 11087/ 2004)పై హైకోర్టు ఇటీవల కీలక తీర్పును వెల్లడించింది. 2004 మార్చి 3న అప్పటి జిల్లా జాయింట్ కలెక్టర్ జారీ చేసిన కామన్ ఆర్డర్‌ను రద్దు చేసింది. 1/11/1973లో ఈ ఇనాం భూములు ఎవరి ఆధీనంలో ఉన్నాయో నిర్ధారించకుండా, ఓఆర్‌సీలు మంజూరు చేశారని, వీటిని రద్దు చేస్తున్నట్లు కోర్టు ప్రకటించింది. ఈ అంశంపై విచారణ జరిపి నివేదికను అందజేయాలని ఆర్డీఓను ఆదేశించింది. ఆ మేరకు రెవెన్యూ యంత్రాంగం విచారణకు సిద్ధమైంది. ఆరు మాసాల్లో నివేదికను అందజేయనుంది.

# సికింద్రాబాద్ పరేడ్ గ్రౌండ్స్‌లో తెలంగాణ ఆవిర్భావ వేడుకలు

**- ముప్పేట భద్రత, పటిష్ట ట్రాఫిక్ ఆంక్షలు:**




**సికింద్రాబాద్: జూన్ 1 భారత శక్తి** తెలంగాణ రాష్ట్ర 13వ అవతరణ దినోత్సవ వేడుకలకు సికింద్రాబాద్‌లోని పరేడ్ గ్రౌండ్స్ సర్వసన్నద్ధమైంది. జూన్ 2వ తేదీ ఉదయం 08:00 గంటల నుండి 10:00 గంటల వరకు నిర్వహించే ఈ వేడుకలకు ముఖ్యమంత్రి ముఖ్య అతిథిగా హాజరుకానున్నారు. దాదాపు 6,000 మంది ఆహ్వానితులు విచ్చేసే అవకాశం ఉండటంతో మల్కాజ్‌గిరి పోలీస్ కమిషనరేట్ ఆధ్వర్యంలో భారీ ఏర్పాట్లు పూర్తి చేశారు.

### మూడంచెల భద్రత.. 1,140 మందితో నిఘా నీడ

వేడుకల నేపథ్యంలో మల్కాజ్‌గిరి పోలీస్ కమిషనర్ భద్రత, ట్రాఫిక్ నిర్వహణ ఏర్పాట్లను పర్యవేక్షిస్తున్నారు. శాంతిభద్రతల పరిరక్షణ కోసం మొత్తం 1,140 మంది పోలీస్ సిబ్బందిని విధుల్లో నియమించారు.శాంతిభద్రతల విభాగం:507 మంది, ట్రాఫిక్ విభాగం:లి 358 మంది, కేంద్ర భద్రతా విభాగం (జూబె): 125 మంది, సవాలచ్చ బలగాలు (AR): 90 మంది, తెలంగాణ రాష్ట్ర ప్రత్యేక పోలీస్ (TGSP):,4 ప్లాటూన్లు ఈ మొత్తం కార్యక్రమాన్ని 3 గురు డిప్యూటీ కమిషనర్లు (DCP), 4 గురు అడిషనల్ డిప్యూటీ కమిషనర్లు, 8 మంది అసిస్టెంట్ కమిషనర్లు (ూజా), 49 మంది ఇన్‌స్పెక్టర్లు, 88 మంది సబ్-ఇన్‌స్పెక్టర్లు ప్రత్యక్షంగా పర్యవేక్షిస్తున్నారు. వీరికి తోడుగా 723 మంది సహాయ సబ్-ఇన్‌స్పెక్టర్లు, హెడ్ కానిస్టేబుళ్లు, కానిస్టేబుళ్లు, హోం గార్డులు విధుల్లో పాల్గొంటున్నారు.

### వ్యూహాత్మక ప్రాంతాల్లో ప్రత్యేక బృందాలు

భద్రతను మరింత కఠినతరం చేయడానికి ఆక్టోపస్ (ాజుూాఖూ) బృందాలు, ప్రత్యేక కార్యాచరణ బృందాలు (ూా), ఇంటెలిజెన్స్ సిబ్బంది, సమాచార సాంకేతిక విభాగాలు, బాంబు నిర్వీర్యక బృందాలు, అన్వేషక శునకాలను రంగంలోకి దించారు. జూన్ 1వ తేదీ నుంచే పరేడ్ గ్రౌండ్స్ పరిసరాలను 55 సీసీ కెమెరాల పూర్తి నిఘా నీడలోకి తీసుకువచ్చారు.

### ఆహ్వానితులకు సూచనలు.. పాస్‌ల ఆధారంగా ప్రవేశం:

సభకు వచ్చే ఆహ్వానితులంతా ఉదయం "07:30 గంటల కల్లా తమకు కేటాయించిన సీట్లలో కూర్చోవాలని పోలీసులు సూచించారు. పరేడ్ గ్రౌండ్స్‌లోని 12 గేట్ల ద్వారా ప్రవేశాన్ని ఈ క్రింది విధంగా వర్గీకరించారు:

AA పాస్‌లు: గేట్ నంబర్ - 6 A1 పాస్‌లు: గేట్ నంబర్ - 8 A2 పాస్‌లు వార్తా ప్రతినిధులు (Press):గేట్ నంబర్ - 4, B1 పాస్‌లు: గేట్ నంబర్ - 7 B2 పాస్‌లు: గేట్ నంబర్ - 8 C బ్లాక్ గేట్ నంబర్ - 2 F బ్లాక్: గేట్ నంబర్ 10 మరియు 11

### తనిఖీలు - నిషేధిత వస్తువులు:

ద్వారాల వద్ద లోహ గుర్తింపు పరికరాల (ఱఖీవీఱ/ఎఖీవీఱా) ద్వారా క్షుణ్ణంగా తనిఖీ చేసిన తర్వాతే లోపలికి అనుమతిస్తారు. ఆహ్వానితులు అసలు (ాతీఅస్త్రఱఖుశ్రీ) ఆహ్వాన పత్రికను వెంట తెచ్చుకోవాలి. ఆయుధాలు, పదునైన వస్తువులు, మంటలు అంటుకునే పదార్థాలు, బాణసంచా, డ్రోన్లు, కాంతి కిరణాల (ఘుంవతీ) లైట్లను వేదిక లోపలికి అనుమతించరు.

### బేగంపేట్ పరిసరాల్లో డ్రోన్ల ఎగరవేతపై నిషేధం

భద్రతా కారణాల దృష్ట్యా జూన్ 2వ తేదీ అర్ధరాత్రి "00:00 గంటల నుండి మధ్యాహ్నం 14:00 గంటల వరకు" బేగంపేట్, బోయిన్‌పల్లి, మారేడ్‌పల్లి పోలీస్ స్టేషన్ల పరిధిలో భారతీయ నాగరిక్ సురక్ష సంహిత (దీఛీూ) సెక్షన్ 163 ప్రకారం అన్ని రకాల రిమోట్ కంట్రోల్డ్ డ్రోన్లు, పారా-గ్లైడర్లు, మైక్రో-లైట్ ఎయిర్‌క్రాఫ్ట్‌ల ఎగరవేతపై తాత్కాలిక నిషేధాజ్ఞలు విధించారు. ఉత్తర్వులను ఉల్లంఘిస్తే చట్టప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామని మల్కాజ్‌గిరి జోన్ డిప్యూటీ కమిషనర్ హెచ్చరించారు.

### పరేడ్ గ్రౌండ్స్ పరిసరాల్లో ట్రాఫిక్ మళ్లింపుల మార్గదర్శిని

తెలంగాణ రాష్ట్ర అవతరణ దినోత్సవ వేడుకల (జూన్ 2) సందర్భంగా సికింద్రాబాద్ పరేడ్ గ్రౌండ్స్ పరిసరాల్లో "ఉదయం 7:00 నుండి మధ్యాహ్నం 12:00 గంటల వరకు" ట్రాఫిక్ ఆంక్షలు విధించారు. వాహనదారులు ప్రయాణించే ప్రధాన మార్గాలు, వాటి ప్రత్యామ్నాయ దారులు ఇలా ఉన్నాయి: లిబేగంపేట నుండి సంగీత్ కూడలి: ప్రధాన రవాణా అధికారి కార్యాలయం వద్ద మళ్లింపు ఉంటుంది. వాహనదారులు పారడైజ్, ప్యాట్నీ, గడియారపు స్తంభం మీదుగా వెళ్లాలి. బేగంపేట నుండి తిరుమలగిరి: పైవంతెనలు, సెయింట్ జాన్స్ వృత్తం, షెనాయ్, సైనిక దళాల పరిపాలనా కేంద్రం కూడలి, కేంద్రీయ విద్యాలయ మీదుగా ప్రయాణించాలి. సంగీత్ కూడలి నుండి పంజగుట్ట:లిసంగీత్ వద్దే మళ్లిస్తారు. గడియారపు స్తంభం, ప్యాట్నీ, ఘాస్మండి, కర్బలా మైదానం, ట్యాంక్ బండ్, ఖైరతాబాద్ మీదుగా వెళ్లాల్సి ఉంటుంది. సికింద్రాబాద్ నుండి తిరుమలగిరి: గడియారపు స్తంభం వద్ద మళ్లిస్తారు. అక్కడ నుండి సంగీత్, సెయింట్ జాన్స్ వృత్తం, షెనాయ్, సైనిక దళాల పరిపాలనా కేంద్రం కూడలి మీదుగా వెళ్లాలి. సికింద్రాబాద్ నుండి బోయిన్‌పల్లి: గడియారపు స్తంభం వద్ద మళ్లిస్తారు. ప్యాట్నీ, పారడైజ్, ప్రధాన రవాణా అధికారి కార్యాలయం మీదుగా బోయిన్‌పల్లి చేరుకోవచ్చు. బోయిన్‌పల్లి నుండి సికింద్రాబాద్: బ్రూక్‌బాండ్, తివోలి, స్వీకార్ ఉపకార్, యువజన క్రైస్తవ సంఘం మీదుగా సికింద్రాబాద్ స్టేషన్‌కు చేరుకోవాలి. ట్యాంక్ బండ్ నుండి తిరుమలగిరి: పారడైజ్, ప్రధాన రవాణా అధికారి కార్యాలయం, తాడ్‌బన్, డైమండ్ పాయింట్, బోయిన్‌పల్లి మార్కెట్ మీదుగా తిరుమలగిరి వెళ్లాలి.

### తిరుమలగిరి నుండి ట్యాంక్ బండ్:

జాతీయ క్యాడెట్ దళం, పికెట్, స్వీకార్ ఉపకార్, యువజన క్రైస్తవ సంఘం, గడియారపు స్తంభం, ప్యాట్నీ, ఘాస్మండి మీదుగా ట్యాంక్ బండ్ చేరుకోవాలి.ముఖ్య గమనిక: జూన్ 2 ఉదయం వేళల్లో సికింద్రాబాద్, బేగంపేట, తిరుమలగిరి వైపు ప్రయాణించే వారు ఈ మార్పులను గమనించి, తమ ప్రయాణాన్ని తదనుగుణంగా మార్చుకోవాలని మనవి.

### వాహనదారులకు కీలక సూచనలు:

మెట్రో సేవలు: ట్రాఫిక్ ఇబ్బందులు లేకుండా ఉండేందుకు ప్రయాణికులు వీలైనంత వరకు మెట్రో రైలు లేదా ప్రజా రవాణా వ్యవస్థను ఉపయోగించుకోవాలి.భారీ వాహనాలు/బస్సులు: ఆర్టీసీ బస్సులు, ప్రైవేట్ లారీలు, భారీ వాహనాలను ఉదయం 06:00 గంటల నుండి మధ్యాహ్నం 01:00 గంటల వరకు పరేడ్ గ్రౌండ్స్ వైపు అనుమతించరు.అత్యవసర సేవలు: అంబులెన్స్ వంటి అత్యవసర వాహనాలకు ట్రాఫిక్ నుండి తక్షణ ప్రాధాన్యత ఇచ్చి సులువుగా పంపిస్తారు.

**పార్కింగ్ నిబంధనలు:** రోడ్ల పక్కన వాహనాలు నిలిపితే క్రేన్ల ద్వారా తరలించి చట్టపరమైన చర్యలు తీసుకుంటారు. సభకు వచ్చేవారి కోసం ప్రత్యేకంగా 5 ప్రాంతాల్లో (జింఖానా గ్రౌండ్, బైసన్ పోలో గ్రౌండ్, వీజూా ఆఫీస్, సెంటెనరీ హైస్కూల్) పార్కింగ్ ఏర్పాటు చేశారు. వీటి లొకేషన్ల కోసం ప్రత్యేక క్యూఆర్ (ు=) కోడ్‌లను జారీ చేశారు ట్రాఫిక్ సహాయ కేంద్రం: ప్రయాణంలో ఎలాంటి సమస్యలు ఎదురైనా సహాయం కోసం మల్కాజ్‌గిరి ట్రాఫిక్ హెల్ప్‌లైన్ నంబర్: 8712662999ను సంప్రదించవచ్చునని మల్కాజ్‌గిరి ట్రాఫిక్ డిప్యూటీ కమిషనర్ తెలిపారు.

## పర్యావరణ పరిరక్షణ పోస్టర్ ఆవిష్కరించిన కలెక్టర్




**సిద్దిపేట (భారత శక్తి)** ప్రజా పాలన ప్రగతి ప్రాణాలిక కార్యక్రమంలో భాగంగా సోమవారం నుండి 12వ వరకు నిర్వహించనున్న పర్యావరణ పరిరక్షణ కార్యక్రమానికి సంబంధించిన పోస్టర్ ను సోమవారం ఐడిఓసి సమావేశ మందిరంలో జిల్లా కలెక్టర్ కే.హైమావతి జిల్లా అటవీశాఖ అధికారి పద్మజారాణి కలిసి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ పర్యావరణ పరిరక్షణ ప్రాముఖ్యతను తెలుపుతూ మరియు అడవులు వన్యప్రాణుల సంరక్షణ కార్యక్రమాలు విస్తృతంగా నిర్వహించి ప్రజల్లో అవగాహన కల్పించేందుకు ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక కార్యక్రమంలో భాగంగా సోమవారం నుండి 12వరకు అటవీశాఖ మరియు పొల్యూషన్ కంట్రోల్ బోర్డు వారిచే ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహించడం జరుగుతుందని ఈ కార్యక్రమంలో ప్రజలు, ప్రజా ప్రతినిధులు, అధికారులు, భాగస్వాములై పర్యావరణ పరిరక్షణ, మరియు అడవులు, వన్యప్రాణుల సంరక్షణకు పాటుపడాలని, అటవీ శాఖ అధికారులు పర్యావరణ పరిరక్షణలో అడవులు, వన్యప్రాణుల, ప్రాముఖ్యత పై విస్తృతంగా అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని, జూన్ 5న ప్రపంచ పర్యావరణ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో జిల్లా అదనపు కలెక్టర్ రెవెన్యూ లక్ష్మి కిరణ్, డిఆర్ఓ నాగరాజమ్మ, అటవీశాఖ అధికారులు, ఇతర అధికారుల తదితరులు పాల్గొన్నారు.

## ప్రజావాణి దరఖాస్తులు సత్వరం పరిష్కరించాలి

**- కలెక్టర్ చిత్ర మిశ్రా**



**కరీంనగర్ (భారత శక్తి)** ప్రజావాణి దరఖాస్తులకు ప్రాధాన్యతనిచ్చి క్షేత్రస్థాయిలో పరిశీలించి వాటి పరిష్కారానికి కృషి చేయాలని కలెక్టర్ చిత్రా మిశ్రా సంబంధిత శాఖల అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్ ఆడిటోరియంలో అదనపు కలెక్టర్ రెవెన్యూ శ్రీనివాస్ రెడ్డితో కలిసి ప్రజల నుంచి అర్జీలు స్వీకరించారు. కొన్ని దరఖాస్తులను అక్కడికక్కడే పరిష్కరించారు.మొత్తం ప్రజావాణికి 188 దరఖాస్తులు వచ్చాయి.ప్రజావాణి కార్యక్రమాన్ని సీఎంఓ అధికారులు పర్యవేక్షిస్తున్నారని సిబ్బంది నిబంధనలు పాటిస్తూ క్షేత్రస్థాయిలో పరిశీలించి అర్జీ పరిష్కారానికి కృషి చేయాలని కలెక్టర్ పేర్కొన్నారు.శాఖల వారీగా పెండింగ్ లో ఉన్నలోకాయుక్త, ఎన్ హెచ్ఆర్సీ తో పాటు కోర్టు కేసుల పరిష్కారానికి చర్యలు చేపట్టాలని అధికారులను ఆదేశించారు.రెడ్ క్రాస్ సభ్యత్వ నమోదు వేగవంతం చేయాలి:రెడ్ క్రాస్ సేవలను విస్తరించేందుకు, వరదలు, విపత్తులు, ఆపద వేళ బాధితులకు సహాయం అందించేందుకు ఉద్యోగులు రెడ్ క్రాస్ సొసైటీలో సభ్యత్వం పొందాలని జిల్లా కలెక్టర్ చిత్రా మిశ్రా పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో వివిధ శాఖల అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

## ఎర్రకోట రాజీవ్ రెడ్డి జన్మదిన వేడుకలలో పాల్గొన్న వైసీపీ నాయకులు

**హాజరైన వైఎస్సార్సీపీ నేతలు తుగ్గలి మోహన్ రెడ్డి,విష్ణువర్ధన్ రెడ్డి.**




**తుగ్గలి:(భారత శక్తి)** ఎమ్మిగనూరు నియోజకవర్గ వైఎస్సార్సీపీ ఇన్‌చార్జి ఎర్రకోట రాజీవ్ రెడ్డి జన్మదిన వేడుకలు వైసిపి పార్టీ నాయకులు మరియు కార్యకర్తల ఆధ్వర్యంలో ఆదివారం ఎర్రకోట గ్రామంలో ఘనంగా జరిగాయి.ఈకార్యక్రమానికి వైఎస్సార్సీపీ జిల్లా కార్యదర్శి తుగ్గలి మోహన్ రెడ్డి, యువజన వైఎస్సార్సీపీ నాయకుడు గిరిగెట్ల విష్ణువర్ధన్ రెడ్డి, తదితర వైసిపి పార్టీ నాయకులు,కార్యకర్తలు పెద్ద సంఖ్యలో హాజరై ఆయనకు జన్మదిన శుభాకాంక్షలు తెలిపి ఘనంగా సన్మానించారు.ఈ సందర్భంగా జిల్లా కార్యదర్శి మోహన్ రెడ్డి మాట్లాడుతూ నియోజకవర్గంలో చురుగ్గా విధులను నిర్వహిస్తూ పార్టీ బలోపేతానికి కృషి చేస్తున్నారని ఆయన తెలియజేశారు. పార్టీ అధినేత జగన్మోహన్ రెడ్డి ఆశయాల కోసం నిరంతరం ప్రజలలో ఉంటూ కార్యకర్తల ద్వారా ప్రభుత్వ వైఫల్యాలను ఎండగడుతున్నారని ఆయన తెలియజేశారు.ఆయన దగ్గర ఉన్న సేవా గుణంతోనే నేడు జరుగుతున్న జన్మదిన వేడుకలకు పెద్ద ఎత్తున వైఎస్ఆర్సిపి నాయకులు, కార్యకర్తలు హాజరై జన్మదిన శుభాకాంక్షలు తెలియజేశారన్నారు.ఈ సందర్భంగా ఎర్రకోట రాజీవ్ రెడ్డి మాట్లాడుతూ తనపై అభిమానంతో సుదూర ప్రాంతాల నుండి వచ్చి జన్మదిన శుభాకాంక్షలు తెలియజేసిన ప్రతి ఒక్కరికి పేరుపేరునా ధన్యవాదాలు తెలియజేశారు.ఈ కార్యక్రమంలో వైఎస్ఆర్సిపి నాయకులు,కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

### పండుగ వాతావరణంలో

# పింఛన్ పంపిణీ కార్యక్రమం

**- లబ్ధిదారుల ఇళ్ల వద్దకే వెళ్లి పింఛన్ అందజేసిన ఎమ్మెల్యే అమిలినేని సురేంద్ర బాబు**







**కళ్యాణదుర్గం (భారత శక్తి)** ఆంధ్రప్రదేశ్ లో మొట్టమొదటి సారిగా వృద్ధులు, వికలాంగులు, వితంతువులకు పింఛన్లు అందించిన ఘనత అన్న నందమూరి తారక రామారావు గారు మొదలుపెడితే నేడు రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు గారు 4000 రూపాయలకు పెంచి అందిస్తున్నారని ఎమ్మెల్యే అమిలినేని సురేంద్ర బాబు పేర్కొన్నారు. అందులోను మన కళ్యాణదుర్గం నియోజకవర్గ వ్యాప్తంగా 36504 పింఛన్లు ఉండగా 16.07 కోట్లు అందిస్తున్నామని, లక్ష్మంపల్లి పంచాయతీలో 535 పింఛన్లు ఉండగా 23.77 లక్షలు అందిస్తున్నామని ఎమ్మెల్యే అమిలినేని సురేంద్ర బాబు అన్నారు..శెట్టూరు మండలం యరబోరెపల్లి గ్రామంలో పింఛన్ల పంపిణీ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా ఎమ్మెల్యే విచ్చేయగా గ్రామస్థులు, టీడీపీ నాయకులు పూలవర్షం కురిపించి ఘన స్వాగతం పలికారు..నేడు దేశంలోనే అత్యధికంగా పింఛన్లు అందిస్తున్నది మన రాష్ట్రమేనని రాష్ట్ర వ్యాప్తంగా పింఛన్ల పండుగ జరుగుతోందని అందులోను ముఖ్యమంత్రి సూచనలతో పింఛన్లు పంపిణీలో పాల్గొనడం నా అదృష్టమని ఎమ్మెల్యే పేర్కొన్నారు..

### కడప జిల్లా వ్యాప్తంగా

# కొనసాగుతున్న నైట్ పెట్రోలింగ్



**కడప (భారత శక్తి)** జిల్లా వ్యాప్తంగా నైట్ పెట్రోలింగ్ ముమ్మరంగా కొనసాగుతోంది. నియంత్రణే లక్ష్యంగా పోలీసులు అప్రమత్తంగా విధులు నిర్వర్తిస్తున్నారు. నేర నియంత్రణతో పాటు అసాంఘిక కార్యకలాపాల కట్టడి, ప్రజల్లో భద్రత భావాన్ని పెంపొందించడం కోసం ప్రతీ రోజు నైట్ పెట్రోలింగ్ విధులు కొనసాగుతున్నాయి. లాక్డ్ హౌస్ ( తాళాలు వేసిన ఇళ్లు ) వద్ద దొంగతనాలు జరగకుండా ప్రత్యేకంగా నిఘా ఉంచారు. కింది స్థాయి సిబ్బంది నుండీ ఎస్సైలు, సి.ఐ లు, డీఎస్పీల దాకా రాత్రి వేళ మరింత అప్రమత్తత తో గస్తీ విధులు, పర్యవేక్షణ కొనసాగిస్తున్నారు. బీట్ తనిఖీ అధికారులు, సిబ్బంది వాహనాలను క్షుణ్ణంగా పరిశీలించి రవాణా వివరాలు, కొత్త వ్యక్తుల వివరాలు ఆరా తీసి అక్రమ రవాణాను అరికట్టే చర్యలు తీసుకుంటున్నారు. బీట్ తనిఖీ అధికారులు తరచూ బీట్ పాయింట్స్ తనిఖీ చేసి, సిబ్బందిని అప్రమత్తం చేస్తూ ఎటువంటి నేరాలు జరగకుండా పకడ్బందీగా గస్తీ విధులు నిర్వర్తించేలా చేస్తున్నారు. లాడ్జి రూమ్స్ లో ఎలాంటి అసాంఘిక కార్యక్రమాలు జరగకుండా ప్రత్యేక తనిఖీలు నిర్వహించారు. ?? లాడ్జిలో ఉంటున్న వారి అధార్ కార్డు పరిశీలించి వివరాలు సేకరించారు. లాడ్జిలో అసాంఘిక కార్యక్రమాలు నిర్వహిస్తుంటే చట్టపరమైన చర్యలు తప్పవన్నారు. ?? నైట్ పెట్రోలింగ్ ముమ్మరం చేసి అనుమానాస్పద/కొత్త వ్యక్తుల యొక్క వివరాలు ఆరా తీశారు. పాత నేరస్తులు, అనుమానితులు, చెడునడత కలిగిన వారి పై నిఘాను పెడుతున్నారు.

# వికారాబాద్ జిల్లా కేంద్రంలో విషాదం

**- మహావీర్ హాస్పిటల్లో ఐదు నెలల పసిబిడ్డ మృతి**



**వికారాబాద్ (భారత శక్తి)** వికారాబాద్ జిల్లా కేంద్రంలోని మహావీర్ హాస్పిటల్లో చికిత్స పొందుతున్న ఐదు నెలల పసిబిడ్డ మృతి చెందడంతో తీవ్ర విషాదం నెలకొంది. నవాబ్పేట్ మండలం మినాపల్లి గ్రామానికి చెందిన జోగు మధుకర్, మౌనిక దంపతుల ఐదు నెలల పసిబిడ్డ అనారోగ్యంతో ఆస్పత్రిలో చేరినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. అయితే వైద్యుల నిర్లక్ష్యం కారణంగానే తమ బిడ్డ మృతి చెందిందని తల్లిదండ్రులు ఆరోపిస్తున్నారు. పసిబిడ్డ మృతితో ఆస్పత్రి ఆవరణలో తల్లిదండ్రులు, బంధువులు కన్నీరుమున్నీరుగా విలపించారు. ఈ ఘటనతో ఆస్పత్రి వద్ద ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి. ఘటనపై పూర్తి స్థాయిలో విచారణ జరిపి, బాధ్యులపై చర్యలు తీసుకోవాలని కుటుంబ సభ్యులు, బంధువులు డిమాండ్ చేస్తున్నారు. ఈ ఘటనకు సంబంధించిన మరిన్ని వివరాలు తెలియాల్సి ఉంది..

# టీజీఎస్ఆర్టిసి ఉద్యోగుల మహాదీక్ష

**హైదరాబాద్ (భారత శక్తి)** తెలంగాణ జాతీయ మజ్దూర్ యూనియన్ ఆధ్వర్యంలో టీజీఎస్ఆర్టిసి ఉద్యోగుల మహాదీక్ష ఇందిరాపార్క్ ధర్నా చౌక్ లో నిర్వహిస్తున్నారు. జూన్ రెండవ తేదీన తెలంగాణ ఆవిర్భావ దినోత్సవ సందర్భంగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆర్టీసీని విలీనం చేయాలంటూ డిమాండ్ చేస్తూ దీక్ష, విలీనం స్పష్టం చేసిన తరువాత ఎన్నికలు పెట్టమని ఎఏఓజ డిమాండ్. ప్రభుత్వంలో విలీనం చేయు అపాయింట్మెంట్ డేటును వెంటనే ప్రకటించాలని డిమాండ్ చేశారు. కొందరు వేరే యూనియన్ నాయకులు వాళ్ల స్వార్థం కోసం వాళ్ళ లాభాల కోసం ఎన్నికలు జరపాలని చెప్తున్నారు, కార్మికుల సంక్షేమం కోరుకునే టీజే ఎం యు విలీనం ప్రకటన చేయాలని కోరారు.

# సికింద్రాబాద్‌లో భారీ హెల్మెట్ శిల్పం ప్రారంభం

**- రోడ్డు భద్రతే ధ్యేయంగా మల్కాజ్గిరి పోలీస్ బృందం ముందడుగు**



**హైదరాబాద్ జూన్ 1 భారత శక్తి:** రోడ్డు భద్రతపై వాహనదారుల్లో చైతన్యం నింపేందుకు మల్కాజ్గిరి పోలీస్ కమిషనరేట్ సరికొత్త కార్యక్రమాలకు శ్రీకారం చుట్టింది. ఇందులో భాగంగా ఈ రోజు సికింద్రాబాద్‌లోని అత్యంత కీలకమైన సంగీత్ క్రాస్ రోడ్స్ వద్ద ఏర్పాటు చేసిన ఒక భారీ హెల్మెట్ శిల్పాన్ని మల్కాజ్గిరి పోలీస్ కమిషనర్ సుమతి గారు, తమ పోలీస్ బృందంతో కలిసి ఘనంగా ప్రారంభించారు.

ద్విచక్ర వాహనదారులు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలనే సందేశాన్ని ప్రజల్లోకి బలంగా తీసుకెళ్లడమే లక్ష్యంగా ఈ భారీ శిల్పాన్ని కూడలిలో ప్రతిష్టించారు.

### హెల్మెట్ ప్రాధాన్యతను వివరిస్తూ పోలీస్ కమిషనర్ సందేశం:

ఈ సందర్భంగా పోలీస్ కమిషనర్ సుమతి గారు మాట్లాడుతూ, ప్రయాణాల్లో భద్రత అనేది ప్రతి ఒక్కరి ప్రాథమిక బాధ్యత అని గుర్తుచేశారు.

"హెల్మెట్ అనేది కేవలం చలానాల నుంచి తప్పించుకోవడానికి పెట్టుకునే ఒక రక్షణ అనుబంధం (ూాఎఎవంంశీతీఎ) మాత్రమే కాదు---అది ప్రమాద సమయాల్లో ప్రాణాలను నిలిపే ఒక అమూల్యమైన లైఫ్‌సేవర్. ప్రతి ఒక్కరూ బాధ్యతాయుతమైన రోడ్డు ప్రవర్తనను ఒక అలవాటుగా మార్చుకోవాలి. అప్పుడే ప్రతి ప్రయాణం సురక్షితంగా సాగుతుంది."

### అవగాహన కార్యక్రమాల విస్తరణ:

మల్కాజ్గిరి పోలీస్ బృందం ఈ ప్రాంతంలో ట్రాఫిక్ నిబంధనల అమలుతో పాటు ప్రజల్లో అవగాహన పెంచేందుకు క్షేత్రస్థాయిలో కౌన్సిలింగ్, 'హెల్మెట్ బ్యాంక్' వంటి వినూత్న కార్యక్రమాలను కూడా వేగవంతం చేస్తోంది. ప్రమాదాల రహిత సమాజ స్థాపన కోసం వాహనదారులు, ముఖ్యంగా యువత పోలీసులకు సహకరించాలని ఈ సందర్భంగా ఉన్నతాధికారులు పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో పలువురు ట్రాఫిక్ పోలీస్ అధికారులు, సిబ్బంది మరియు స్థానిక పౌరులు పాల్గొన్నారు.

# కీసర పోలీస్ స్టేషన్‌ను తనిఖీ చేసిన మల్కాజ్‌గిరి సీపీ

**- సాంకేతికతతో ప్రజలకు వేగవంతమైన సేవలు అందించాలి: సుమతి**





**కీసర, జూన్ 1:భారత శక్తి,** మల్కాజ్‌గిరి పోలీస్ కమిషనర్ సుమతి సోమవారం కీసర పోలీస్ స్టేషన్‌ను ఆకస్మికంగా సందర్శించారు. ఈ సందర్భంగా స్టేషన్‌లోని రికార్డులు, సిసి కెమెరాల పనితీరు, వివిధ విభాగాల నిర్వహణ మరియు ఇతర వసతులను ఆమె నిశితంగా పరిశీలించారు. అనంతరం పోలీస్ స్టేషన్ పరిసరాలను తిరిగి చూసి, అక్కడ నెలకొన్న పరిశుభ్రత, పచ్చదనం పట్ల సంతృప్తి వ్యక్తం చేశారు.

### విధుల్లో చురుకుదనం ప్రదర్శించాలి

స్టేషన్‌లోని క్రైమ్, రిసెప్షన్ మరియు ఇతర విభాగాల సిబ్బందితో సీ.పీ ప్రత్యేకంగా మాట్లాడారు. వారి విధుల నిర్వహణ తీరును, అవగాహనను అడిగి తెలుసుకున్నారు. సిబ్బంది అంతా విధుల్లో మరింత చురుకుదనం ప్రదర్శించాలని ఆదేశించారు. సాంకేతిక పరిజ్ఞానాన్ని మరియు వినూత్న యాప్‌లను మరింత సమర్థవంతంగా వినియోగించుకుంటూ ప్రజలకు వేగవంతమైన, పారదర్శకమైన సేవలు అందించాలని స్పష్టం చేశారు.

### కేసుల దర్యాప్తుపై దిశానిర్దేశం

ఎన్‌పీడీఎస్ (చీూణూ) కేసుల దర్యాప్తును వేగవంతం చేయాలని, 'మీ సురక్ష' (వీవవ ూబతీఖుసెంష్త్రు) అప్లికేషన్‌లో ప్రజల భాగస్వామ్యాన్ని పెంచేలా చర్యలు చేపట్టాలని సీపీ సూచించారు. కేసులకు సంబంధించిన వివరాలను ఎప్పటికప్పుడు ఆన్‌లైన్‌లో నవీకరించాలని (అప్‌డేట్) ఆదేశించారు. ప్రజలకు నమ్మకమైన, సురక్షితమైన వాతావరణాన్ని కల్పించడంలో ప్రతి ఒక్కరూ బాధ్యతాయుతంగా పనిచేయాలని పిలుపునిచ్చారు. ఈ తనిఖీ కార్యక్రమంలో కీసర ఇన్‌స్పెక్టర్ ఆంజనేయులు, సబ్ ఇన్‌స్పెక్టర్లు (ఎస్‌ఐలు) మరియు స్టేషన్ సిబ్బంది పాల్గొన్నారు.

### " వేముల" జన్మదిన వేడుకలకు

# "కవ్వంపల్లి" హాజరు



**కరీంనగర్ (భారత శక్తి)** హైదరాబాద్‌లోని ఎమ్మెల్యే క్వార్టర్స్‌లో సోమవారం జరిగిన ప్రభుత్వ విప్, నకిరేకల్ శాసనసభ్యుడు వేముల వీరేశం జన్మదిన వేడుకలకు మానకొండూర్ ఎమ్మెల్యే, టీపీసీసీ ఎస్సీ సెల్ చైర్మన్, డాక్టర్ సెల్ సలహాదారు డాక్టర్ కవ్వంపల్లి సత్యనారాయణ ప్రత్యేకంగా హాజరై జన్మదిన శు భాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా డాక్టర్ కవ్వంపల్లి సత్యనారాయణ వేముల వీరేశంకు శాలువా కప్పి ఘనంగా సన్మానించారు. అనంతరం ఆయనకు పుష్పగుచ్ఛం అందజేసి, కేక్ కట్ కార్యక్రమంలో పాల్గొన్నారు. ప్రజా సేవలో వేముల వీరేశం మరింత ఉన్నత స్థాయికి చేరుకోవాలని, ఆయురారోగ్యాలతో ప్రజలకు సేవ చేసే అవకాశం కలగాలని ఆకాంక్షించారు. వేముల వీరేశం ప్రజా సమస్యల పరిష్కారంలో చురుకైన పాత్ర పోషిస్తూ ప్రజల మన్ననలు పొందుతున్నారని డాక్టర్ కవ్వంపల్లి పేర్కొన్నారు. రాష్ట్ర అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాల అమలులో ఆయన చేస్తున్న కృషి అభినందనీయమని ఆయన పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో పలువురు ప్రజాప్రతినిధులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు

### ఎన్టీఆర్ భరోసా పెన్షన్లను లబ్ధిదారులకు

# అందజేసిన జిల్లా కలెక్టర్, తిరుపతి ఎమ్మెల్యే

**తిరుపతి,(భారత శక్తి)** ఎన్టీఆర్ భరోసా పెన్షన్ పథకం ద్వారా అర్హులైన లబ్ధిదారులకు ప్రభుత్వం సామాజిక భద్రత కల్పిస్తోందని జిల్లా కలెక్టర్ డాక్టర్ ఎస్. వెంకటేశ్వర్ తెలిపారు. సోమవారం ఉదయం తిరుపతి పట్టణంలోని ముత్యాలరెడ్డి పల్లిలో గల దుర్గా నగర్‌లో తిరుపతి ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులతో కలిసి పెన్షన్ల పంపిణీ కార్యక్రమంలో పాల్గొని లబ్ధిదారులకు పెన్షన్లు అందజేశారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ.., సామాజిక భద్రత కల్పించే ఈ కార్యక్రమం రాష్ట్ర ప్రభుత్వ అత్యంత ప్రాధాన్యత కలిగిన సంక్షేమ పథకాలలో ఒకటిగా నిలిచిందన్నారు. దేశంలో మరే రాష్ట్రంలో లేని విధంగా ఆంధ్రప్రదేశ్‌లో ఈ కార్యక్రమాన్ని ప్రతిష్టాత్మకంగా, పెద్ద ఎత్తున నిర్వహిస్తున్నామన్నారు. ఒక్క జిల్లాకే నెలకు సుమారు రూ.120 కోట్ల మేర పెన్షన్లు పంపిణీ చేస్తున్నట్లు తెలిపారు. ఇది దేశంలోనే అతిపెద్ద సంక్షేమ కార్యక్రమాలలో ఒకటని పేర్కొన్నారు. జూన్ నెలకు సంబంధించిన ఎన్టీఆర్ భరోసా పెన్షన్ల పంపిణీ కార్యక్రమాన్ని ప్రజాప్రతినిధుల సమక్షంలో ప్రారంభించినట్లు తెలిపారు. అర్హులైన ప్రతి లబ్ధిదారునికి పెన్షన్ సకాలంలో అందేలా అధికారులు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఈ సందర్భంగా స్థానిక ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు మాట్లాడుతూ, గౌరవ ముఖ్యమంత్రి మరియు ఉపముఖ్యమంత్రి నేతృత్వంలోని ఎన్డీఏ కూటమి ప్రభుత్వం ప్రజా సంక్షేమానికి అత్యంత ప్రాధాన్యత ఇస్తోందన్నారు. రాష్ట్రంలో వృద్ధులు, వితంతువులు, దివ్యాంగులు మరియు ఇతర అర్హులైన లబ్ధిదారుల జీవన ప్రమాణాలను మెరుగుపరచాలనే లక్ష్యంతో సామాజిక భద్రతా పెన్షన్లను రూ.3,000 నుండి రూ.4,000కు పెంచినట్లు తెలిపారు. తిరుపతి నియోజకవర్గంలో 18,303 మంది లబ్ధిదారులకు వివిధ కేటగిరీల కింద ప్రతి నెలా రూ.8 కోట్ల 19 లక్షల మేర పెన్షన్లు అందజేస్తున్నట్లు పేర్కొన్నారు. ప్రతి నెల ఒకటో తేదీన ఉదయం నుంచే లబ్ధిదారుల ఇంటి వద్దకే వెళ్లి పెన్షన్లు అందించడం రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న అత్యంత ప్రజాదరణ పొందిన కార్యక్రమమని అన్నారు. లబ్ధిదారులందరూ ప్రభుత్వంపై హర్షం వ్యక్తం చేస్తున్నారని, ఎలాంటి ఇబ్బందులు లేకుండా, అదనపు ఖర్చులు లేకుండా ఇంటి వద్దకే పెన్షన్లు అందుతున్నాయని ప్రజలు సంతోషం వ్యక్తం చేస్తున్నారని తెలిపారు.

# దిశానిర్దేశంతో ట్రాఫిక్ సులభతరం : వాహనదారుల హర్షం

**(భారత శక్తి)** పెద్ది సినిమా ప్రీ-రిలీజ్ ఈవెంట్ సందర్భంగా ఎన్టీఆర్ జిల్లా పోలీస్ కమిషనర్ ఎస్.వి. రాజశేఖర్ బాబు, ఆదేశాల మేరకు, ట్రాఫిక్ డీసీపీ షరీనా బేగం, పర్యవేక్షణలో ట్రాఫిక్ ఏసీపీలు మరియు సిబ్బంది చేపట్టిన ప్రత్యేక దిశానిర్దేశ చర్యలు వాహనదారుల ప్రశంసలు అందుకుంటున్నాయి. కార్యక్రమానికి హాజరయ్యే అభిమానులు, అతిథులు మరియు ప్రజలు ఎలాంటి ఇబ్బందులు లేకుండా పార్కింగ్ ప్రాంతాలకు చేరుకునేలా ప్రధాన కూడళ్లు, జంక్షన్లు, పార్కింగ్ ప్రాంతాల వద్ద ట్రాఫిక్ పోలీసులు ప్రత్యేకంగా క్యూ ఆర్ కోడ్‌లతో కూడిన దిశానిర్దేశక ప్లకార్డులను ఏర్పాటు చేసి మార్గనిర్దేశం చేస్తున్నారు. ప్లకార్డులపై ఉన్న క్యూ ఆర్ కోడ్‌ను స్కాన్ చేయడం ద్వారా వాహనదారులు తమకు కేటాయించిన పార్కింగ్ ప్రాంతానికి సులభంగా చేరుకునే అవకాశం కల్పించారు. ఈ వినూత్న చర్యతో వాహనదారులు సరైన మార్గాల్లో ప్రయాణించి తమ వాహనాలను నిర్దేశిత పార్కింగ్ స్థలాల్లో నిలిపివేయగలుగుతున్నారు. ఫలితంగా ట్రాఫిక్ రద్దీ గణనీయంగా తగ్గి, వాహనాల రాకపోకలు సాఫీగా సాగుతున్నాయి. ప్రజల సౌకర్యం, ట్రాఫిక్ క్రమబద్ధీకరణ మరియు కార్యక్రమం విజయవంతమైన నిర్వహణ లక్ష్యంగా చేపట్టిన ఈ ముందుచూపు చర్యపై వాహనదారులు హర్షం వ్యక్తం చేస్తూ ట్రాఫిక్ అధికారులను అభినందిస్తున్నారు.



# 'డ్రింకర్ సాయి' మూవీ రివ్యూ!



ధర్మ మహేశ్ హీరోగా రూపొందిన సినిమానే 'డ్రింకర్ సాయి'. కిరణ్ తిరుమల శెట్టి దర్శకత్వం వహించిన ఈ సినిమాలో కథానాయికగా ఐశ్వర్య నటించింది. 2024లో డిసెంబర్ 27వ తేదీన విడుదలైన ఈ సినిమాకి, అంతగా ఆదరణ లభించలేదు. సరైన పబ్లిసిటీ లేకపోవడం అందుకు ఒక కారణంగా చెప్పుకున్నారు. అలాంటి ఈ సినిమా ఇప్పుడు 'జీ 5' ఓటీటీలోకి వచ్చింది. మే 27వ తేదీ నుంచి స్ట్రీమింగ్ అవుతోంది. సాయి (ధర్మ మహేశ్) కలవారి అబ్బాయినే. అయితే తల్లిదండ్రులను కోల్పోయి ఒంటరిగా మిగిలిపోయిన అతను, మద్యానికి బానిస అవుతాడు. అందువలన అందరూ అతనిని 'డ్రింకర్ సాయి' అనే పిలుస్తూ ఉంటారు. మందుకొడుతూ .. సిగరెట్లు తాగుతూ .. తన స్నేహితులైన వంశీ – రిషితో కలిసి తిరుగుతూ ఉంటాడు. తగవులకు .. గొడవలకు ముందుంటాడు. తాగడం మానేయమని సన్నిహితులు ఎంతగా చెబుతున్నా పెద్దగా పట్టించుకోడు. ఒక రోజున 'భాగీ' (ఐశ్వర్య) అతని కంటపడుతుంది. ఆమె 'నేచురోపతి' ఫైనల్ ఇయర్ చదువుతూ ఉంటుంది. చెడు అలవాట్లతో ఆరోగ్యాన్ని పాడుచేసుకోవడం ఆమెకి ఎంతమాత్రం ఇష్టం ఉండదు. ప్రకృతి ద్వారా ఆరోగ్యాన్ని పొందడం గురించి చెబుతూ ఉండే 'వంతెన సుబ్బారావు'కి ఆమె అభిమాని. ఆయన సలహాలను .. సూచనలను ఆమె తప్పకుండా పాటిస్తూ ఉంటుంది. తన తండ్రి కూడా పాటించేలా చేస్తూ ఉంటుంది. అలాంటి భాగీపై సాయి మనసు పారేసుకుంటాడు. తనని ప్రేమించమంటూ వెంటపడుతూ ఉంటాడు.సాయి ప్రవర్తనకి భయపడిన భాగీ, అతణ్ణి ప్రేమిస్తున్నట్టు అబద్ధమాడుతుంది. తాను అలా చేయడం కరెక్టు కాదని గ్రహించడానికి ఆమెకి కొంత సమయం పడుతుంది. అతని పట్ల తనకి ఎలాంటి ప్రేమ లేదని తేల్చి చెబుతుంది. అప్పుడు సాయి ఏం చేస్తాడు? అతను తీసుకున్న ఆ నిర్ణయం ఎలాంటి పరిణామాలకి దారితీస్తుంది? తాను ఇష్టపడిన భాగీ ప్రేమను అతను పొందగలుగుతాడా లేదా? అనేది మిగతా కథ.ప్రేమ అనేది ఎప్పుడు ఎక్కడ ఎవరి పట్ల పుడుతుందనేది ఎవరూ చెప్పలేరు. అలా ఈ సినిమాలో హీరోయిన్ పట్ల హీరో మనసు పారేసుకుంటాడు. అయితే అతను మద్యానికి బానిస. చెడు అలవాట్లు ఉన్న వాళ్లంటే ఆమెకి అసహ్యం. 'నిన్ను ప్రేమిస్తున్నాను గనుక, నువ్వు తిరిగి ప్రేమించవలసిందే' అనేది అతని సిద్ధాంతం.ప్రేమకి కూడా అర్హత అవరమేననేది ఆమె ఉద్దేశం. అలాంటి వాళ్లిద్దరి మధ్య చోటుచేసుకునే సన్నివేశాల సమాహారమే ఈ సినిమా కథ.సాధారణంగా ఏ లవ్ స్టోరీలోనైనా కొంతసేపు అలకలు .. అల్లర్లు .. ఆ తరువాత ఇద్దరూ ఒక్కటైపోవడం జరుగుతుంది. కానీ ఈ సినిమాలో లవ్ యూ అంటూ హీరోయిన్ చుట్టూ హీరో తిరుగుతూనే ఉంటాడు. ఆమె అతణ్ణి తప్పించుకుని తిరుగుతూనే ఉంటుంది. తప్పకపోతే చీవాట్లు పెడుతూ ఉంటుంది. సినిమాలో మూడొంతులకుపైగా ఈ తతంగమే నడుస్తుంది. ఆ నేపథ్యంలోనే పాటలు వచ్చి వెళుతూ ఉంటాయి. హీరోయిన్ మనసు మారేదెప్పుడా అని హీరో కంటే ఎక్కువగా ఎదురుచూసి ప్రేక్షకులు అలసిపోతారు. ఆరోగ్యానికి హీరోయిన్ ఇచ్చే ప్రాధాన్యత ఎక్కువని చెప్పడం వరకూ బాగానే ఉంది. ప్రకృతి వైద్యం .. యోగాలు .. ఆసనాలు అంటూ హడావిడి చేయడం వరకూ కూడా ఓకే. కానీ 'వంతెన సుబ్బారావు' అంటూ ఒక పాత్రను డిజైన్ చేయడం .. ఆ పాత్రను ఇతర పాత్రలతో కామెంట్ చేయించడం సరిగ్గా అనిపించదు. దీని వలన కథ పక్కకి వెళ్లిపోవడమే కాకుండా, కామెడీ పరంగా కూడా ప్రభావితం చేయలేకపోయింది. ఐ లవ్యూకీ .. ఐ హేట్ యూకి మధ్య నడుస్తూ వెళ్లిన కథ, క్లైమాక్స్ లో ఏదైనా ట్విస్ట్ ఇస్తుందేమోనని అంతా వెయిట్ చేస్తుంటారు. అనుకున్నట్టుగానే ఒక ట్విస్ట్ పడుతుంది. కాకపోతే అది పాతకాలం నాటి సినిమా క్లైమాక్స్ ను ప్రేక్షకుల ముందుకు తీసుకు వస్తుంది. రొటీన్ ట్రాక్ లోకి నెట్టేస్తుంది. కథ అంతా హీరో – హీరోయిన్ చుట్టూనే తిరగడం, మరే పాత్రలకు ప్రాధాన్యత లేకపోవడం అసహనాన్ని కలిగిస్తుంది. తెరపై హీరో తన చేతిలో మందుబాటిలో .. సిగరెట్టో లేకుండా కనిపించడు. టైటిల్ లోనే విషయం చెప్పారు గనుక, దానిని గురించి మాట్లాడుకోవడానికేం లేదు.అయితే కథ చివరికి వచ్చేసరికి, మందు తాగినా మంచి మాటలే చెప్పాడే .. సిగరెట్లు తాగినా సత్యాలే సెలవిచ్చాడే .. వెకిలి వేషాలు వేసినా కనువిప్పు కలిగించాడే అనుకునే సన్నివేశాలు తెరపైకి వస్తాయి. అప్పుడు హీరోయిన్ మాత్రమే కాదు, ఆడియన్స్ కూడా 'అరెరే మనం ఇతన్ని అనవసరంగా అపార్థం చేసుకున్నామే' అనుకుని నాలుక్కరచుకుంటారు. ధర్మ మహేశ్ .. ఐశ్వర్య ఇద్దరూ బాగానే చేశారు. అంకిరెడ్డి ప్రశాంత్ ఫొటోగ్రఫీ .. శ్రీ వసంత్ సంగీతం ఫరవాలేదు. 'అర్థం చేసుకోవెందుకే .. ' అనే పాట ట్యూన్ పరంగా .. సాహిత్యం పరంగా కూడా బాగుంది. మార్తాండ్ కె వెంకటేశ్ ఎడిటింగ్ చాలా నీట్ గా అనిపిస్తుంది. సినిమా మొదలైన దగ్గర నుంచి క్లైమాక్స్ దగ్గరికంటా వెళ్లేంతవరకూ కూడా హీరోతో మందు .. సిగరెట్లు తాగించారు. ఆ తరువాత .. "చెడ్డ అలవాట్లు ఉన్న వాళ్లంతా చెడ్డవాళ్లు కాదు, మంచిగా కనిపిస్తున్న వాళ్లంతా మంచివాళ్లూ కాదు. వ్యసనాలు వదిలేస్తేనే అందమైన జీవితాన్ని అందుకునే అవకాశం ఉంటుంది" అనే సందేశం ఇచ్చారు. అక్కడక్కడా వినోదం వికటించినా, సందేశం బాగానే ఉంది గనుక సర్దుకుపోవడమే చేయాలేమో.

'మగధీర' సెట్స్‌లో

# రామ్ చరణ్ అల్లరి..

## ఫన్నీ సీక్రెట్ బయటపెట్టిన కాజల్ అగర్వాల్!



మెగా పవర్ స్టార్ రామ్ చరణ్, టాలీవుడ్ చందమామ కాజల్ అగర్వాల్ కాంబినేషన్‌లో వచ్చిన 'మగధీర' చిత్రం తెలుగు సినిమా చరిత్రలోనే ఒక ట్రెండ్ సెట్టర్‌గా నిలిచింది. దర్శకధీరుడు రాజమౌళి విజువల్ వండర్‌గా తెరకెక్కించిన ఈ సినిమా ఇండస్ట్రీ రికార్డులను తిరగరాసింది. అయితే, ఈ సినిమా షూటింగ్ సమయంలో సెట్స్‌పై జరిగిన ఒక క్రేజీ అండ్ ఫన్నీ సీక్రెట్‌ను కాజల్ అగర్వాల్ తాజాగా ఒక ఇంటర్వ్యూలో బయటపెట్టింది. షూటింగ్ గ్యాప్‌లో రామ్ చరణ్ తనను ఎలా ఆటపట్టించేవాడో కాజల్ గుర్తుచేసుకుంది. మగధీర సినిమాలో గుర్రపు స్వారీ సీన్లు ఎంతగా ఆకట్టుకున్నాయో తెలిసిందే. ఆ సమయంలో రామ్ చరణ్ తన సొంత గుర్రం 'బదల్'ను షూటింగ్‌కు తీసుకువచ్చాడు. షూటింగ్ బ్రేక్‌లో తనను ఆ గుర్రంపై ఊరేగించడం ఒకెత్తయితే, ఆ తర్వాత చరణ్ చేసిన అల్లరి మరో ఎత్తు అని కాజల్ పేర్కొంది. సెట్‌పై తాను ఎప్పుడు కనిపించినా రామ్ చరణ్ తన గుర్రం పేరు "బదల్.. బదల్" అని పదేపదే గట్టిగా పిలుస్తూ తనను టీజ్ చేసేవాడని చెప్పుకొచ్చింది. ఆ టైంలో చరణ్ చేసిన ఫన్నీ కామెంట్లు, ఆటపట్టించిన విధానం ఇప్పటికీ తన గుండెల్లో అలాగే గుర్తుండిపోయాయని కాజల్ ఆనందం వ్యక్తం చేసింది. కాగా, ప్రస్తుతం రామ్ చరణ్ తన తాజా చిత్రం 'పెద్ది' ప్రమోషన్స్‌తో ఫుల్ బిజీగా ఉన్నాడు. ఈ మోస్ట్ అవేటెడ్ చిత్రం జూన్ 4న ప్రపంచవ్యాప్తంగా ప్రేక్షకుల ముందుకు రాబోతోంది.

బాబోయ్ ఏదో

# అయిపోయింది..



94ఏండ్ల వయసులో ప్రఖ్యాత దర్శకుడు సింగీతం శ్రీనివాసరావు దర్శకత్వం వహించిన విభిన్న కథా చిత్రం 'సింగ్ గీతం'. భారతదేశపు తొలి మ్యూజికల్ ఫాంటసీగా రూపొందిన ఈ ప్రతిష్టాత్మక చిత్రాన్ని వైజయంతీ మూవీస్ సమర్పణలో, స్వప్న సినిమా పతాకంపై నాగ్‌అశ్విన్ నిర్మించారు. ఒక దిగ్గజ దర్శకుడు, ఒక లెజెండరీ నిర్మాణ సంస్థ కలిసి రూపొందించిన ఈ చిత్రం ద్వారా అయాన్, అహల్య బమ్రూ, శాలిని కొండేపూడి ప్రధాన పాత్రధారులుగా పరిచయం అవుతున్నారు. జూన్ 11న ప్రపంచవ్యాప్తంగా సినిమా విడుదల కానున్నది. ఈ నేపథ్యంలో ఈ సినిమాలోని 'ఏమైంది.. ఏమైంది.. బాబోయ్ ఏదో అయిపోయింది..' అంటూ సాగే పాటను స్టార్ హీరోయిన్ శ్రుతిహాసన్ విడుదల చేసి, చిత్రబృందానికి శుభాకాంక్షలు అందించారు. ఓ వింత పరిస్థితుల్లో చిక్కుకున్న గ్రామాన్ని పరిచయం చేస్తూ ఓ పజిల్‌గా ఈ పాట సాగింది. ఆ గ్రామంలో సాధారణ సంభాషణలన్నీ పాటగా మారిపోతాయి. ఎందుకలా జరిగిందో అర్థంకాకపోయినా, గ్రామస్తులంతా ఆ పరిస్థితికి అలవాటు పడాల్సొస్తుంది. ప్రశ్నలు, సందేహాలు, ఆశ్చర్యాలన్నీ ట్యూన్స్‌గా మారిపోతూ వినోదాన్ని పంచుతాయి. దేవిశ్రీప్రసాద్ స్వరపరిచిన ఈ పాటను చిత్రంలో నటించిన నటీనటులే ఆలపించడం విశేషం. శ్రీమణి, దేవిశ్రీప్రసాద్, గౌతమ్ చల్లగుల్ల, రత్న శ్రీకర్, శశాంక్ చింతలపూడి కలిసి రాసిన ఈ పాట సినిమాలోని విచిత్ర పరిస్థితిని ప్రజెంట్ చేస్తుంది.

## ప్రేక్షకులు దేవుళ్లు.. సినిమా ఓ సేవ: జాన్వీ కపూర్

సినిమా చూసే ప్రేక్షకులు దేవుళ్లతో సమానమని త్వరలో విడుదల కానున్న 'పెద్ది' సినిమా హీరోయిన్ జాన్వీ కపూర్ అభిప్రాయపడింది. సినిమా తీయడం వారికి చేసే ఓ గొప్ప సేవ అని వ్యాఖ్యానించింది. వారి అభిప్రాయాలే నటీనటులను మరింత రాటుదేలేలా చేస్తాయని తెలిపింది. ప్రేక్షకులను అలరించడానికే తాము నిరంతరం శ్రమిస్తామని జాన్వీ పేర్కొంది. సోషల్ మీడియాలో కొందరు సినిమా చూడకుండానే పెదవి విరుస్తుంటారని, అయినా వారి అభిప్రాయాలను తాము పూర్తిగా కొట్టిపారేయలేమని చెప్పింది. ప్రేక్షకుల అభిప్రాయాలు ఎంత కఠినంగా ఉన్నా.. అవి తమ పనితీరును మెరుగుపరుచుకోవడానికి ఎంతో సాయపడతాయని వివరించింది. మంచి ఉద్దేశంతో పూర్తి హార్డ్ వర్క్‌తో, నిజాయతీగా తీసే ఏ సినిమా అయినా కచ్చితంగా ప్రేక్షకులకు చేరుతుందని జాన్వీ ధీమా వ్యక్తం చేసింది. జనం తొందరగా ఒక అంచనాకు వచ్చేసినప్పటికీ సినిమాలో దమ్ముంటే ఆదరిస్తారని చెప్పింది. ప్రేక్షకులు ఇచ్చే ప్రతి ఫీడ్‌బ్యాక్‌ను మనస్ఫూర్తిగా స్వీకరిస్తానని స్పష్టం చేసింది. బుచ్చిబాబు సానా దర్శకత్వంలో రామ్ చరణ్ హీరోగా వస్తున్న 'పెద్ది' సినిమాలో జాన్వీ నటించిన విషయం తెలిసిందే. ఈ భారీ చిత్రం జూన్ 4న ప్రపంచవ్యాప్తంగా విడుదల కానుంది. ఇందులో శివరాజ్‌కుమార్, బొమన్ ఇరానీ, జగపతిబాబు వంటి ప్రముఖ నటులు కీలక పాత్రలు పోషిస్తున్నారు. బాలీవుడ్‌లో ఇటీవల వరుణ్ ధావన్‌తో కలిసి 'సన్నీ సంస్కారీ కీ తులసీ కుమారీ' సినిమాలో మెరిసిన ఈ భామ 'పెద్ది' ఎంతో నమ్మకంతో ఉంది.



తుది మెరుగుల్లో

# గూఢచారి 2

అడివి శేష్ 'గూఢచారి' సినిమా విడుదలై ఎనిమిదేళ్లు కావొస్తున్నది. బాక్సాఫీస్ వద్ద మంచి విజయం సాధించిన ఈ సినిమాకు సీక్వెల్‌గా 'గూఢచారి 2'(+2) రూపొందుతున్న విషయం తెలిసిందే. ఈ రెండు సినిమాల మధ్య ఇంతటి సుదీర్ఘమైన గ్యాప్ రావడం ప్రస్తుతం ఫిల్మ్ వర్గాల్లో చర్చనీయాంశమైంది. అడివి శేష్‌కి పెరిగిన పానిండియా మార్కెట్‌ని దృష్టిలో పెట్టుకొని, అన్ని భాషల్లోనూ అంతర్జాతీయ స్పై యాక్షన్ అనుభూతిని ఇవ్వాలనే కసితో.. స్క్రిప్ట్ విషయంలో గానీ, ప్రీ ప్రొడక్షన్ విషయంలో కానీ మేకర్స్ ఎక్కువ సమయం తీసుకున్నట్టు తెలిసింది. తాజా సమాచారం ప్రకారం 'గూఢచారి 2' షూటింగ్ పూర్తయింది. త్వరలోనే పోస్ట్ ప్రొడక్షన్ పనులు మొదలు కానున్నాయి. హై వోల్టేజ్ స్పై థ్రిల్లర్‌గా భారీ కాస్టింగ్‌తో అంతర్జాతీయ ప్రమాణాలతో ఈ సినిమా తెరకెక్కుతున్నదని మేకర్స్ చెబుతున్నారు. వినయ్‌కుమార్ సిరిగినీడి దర్శకత్వం వహిస్తున్న ఈ చిత్రానికి టీజీ విశ్వప్రసాద్, అభిషేక్ అగర్వాల్ నిర్మాతలు. ఈ చిత్రంలో ఇమ్రాన్ హష్మీ విలన్‌గా నటిస్తుండగా, వామిక గబ్బి కథానాయిక పాత్ర పోషిస్తున్నది. అన్ని కుదిరితే ఈ ఏడాది చివర్లో సినిమా విడుదల కానున్నదని సమాచారం.



# పోలీస్ కైంప్లెంట్ హంగామా



వరలక్ష్మి శరత్‌కుమార్, నవీన్‌చంద్ర ప్రధాన పాత్రధారులుగా రూపొందిన హారర్, యాక్షన్ థ్రిల్లర్ 'పోలీస్ కైంప్లెంట్'. సంజీవ్ మాగోటి దర్శకుడు. బాలకృష్ణ మహారాణా నిర్మాత. జూన్ 12న సినిమా విడుదల కానున్నది. ఈ సందర్భంగా ట్రైలర్ లాంచ్ ఈవెంట్ హైదరాబాద్‌లో జరిగింది. ఇందులో భాగంగా రెండు ప్రత్యేక గీతాలను కూడా రిలీజ్ చేశారు. వీటిలో సూపర్‌స్టార్ కృష్ణ నటించిన పలు చిత్రాల టైటిల్స్‌ను గుర్తుచేస్తూ రూపొందిన పాటను కృష్ణ అభిమానుల చేతుల మీదుగా విడుదల చేశారు. ఈ పాటలో కృష్ణ వీరాభిమాని, నటుడు కృష్ణసాయి, ప్రీతి సుందర్ నటించారు. చిత్ర దర్శకుడు సంజీవ్ మేగోటి ఈ పాటను రాసి స్వరపరిచారు. అలాగే 'నువ్వట్టా సూత్తా ఉంటే..' అంటూ సాగే మరో గీతాన్ని తెలంగాణ డీఐజీ రమణారెడ్డి విడుదల చేశారు. కృతి వర్మపై ఈ పాట చిత్రీకరించారు. ఇంకా ఈ కార్యక్రమంలో టి.ప్రసన్నకుమార్, నిర్మాతలు ఆర్. సీతారామరాజు, ఘంటా శ్రీనివాసరావు, కృష్ణ మేకప్‌మ్యాన్ మాధవరావు తదితరులు పాల్గొన్నారు.

# 'జైలర్-2'లో హృతిక్‌రోషన్?



సూపర్‌స్టార్ రజనీకాంత్ 'జైలర్ 2' అనగానే ముందు అందరికీ క్యామియోలే గుర్తొస్తున్నాయి. 'జైలర్'లో మోహన్‌లాల్, శివరాజ్‌కుమార్ ప్రత్యేకపాత్రల్లో కనిపించి సినిమా విజయంలో కీలక పాత్ర పోషించారు. 'జైలర్ 2'లో మరిన్ని క్యామియోలు ఉంటాయని దర్శకుడు నెల్సన్ దిలీప్‌కుమార్ ప్రకటించడంతో ఈ సినిమాపై అంచనాలు రెట్టింపయ్యాయి. ఇందులో ఓ కీలకమైన క్యామియో రోల్‌కి నందమూరి బాలకృష్ణను అడిగారు నెల్సన్. బిజీ కారణం చేత ఆయన ఆ రోల్‌ని సున్నితంగా తిరస్కరించారు. తర్వాత ఆ రోల్‌లో బాలీవుడ్ సూపర్‌స్టార్ షారుక్‌ఖాన్ నటిస్తారని వార్తలొచ్చాయి. అయితే.. తాజాగా ఆ రోల్‌ని బాలీవుడ్ టాప్‌హీరో హృతిక్‌రోషన్ పోషిస్తున్నట్టు కోలీవుడ్ మీడియా కోడై కూస్తున్నది. 40ఏండ్ల క్రితం రజనీకాంత్ నటించిన బాలీవుడ్ చిత్రం 'భగవాన్ దాదా'లో చైల్డ్ ఆర్టిస్టుగా నటించారు హృతిక్. ఇప్పుడు అదే రజనీ సినిమాలో గెస్ట్‌గా నటించనుండటం నిజంగా విశేషమే. దీనికి సంబంధించిన అధికారిక ప్రకటన రావాల్సివుంది.

# జీడి మామిడి తోటల్లో తల్లి కూతుర్ల అనుమానాస్పద మృతి

**ఏలూరు (భారత శక్తి)** ఉంగుటూరు మండలం నల్లమడు సమీపంలోని జీడి మామిడి తోటల్లో తల్లి కూతుర్ల అనుమానాస్పద మృతి చెందారు.. అనంతపల్లి కొత్తపేటకు చెందిన తల్లి వడ్డే వెంకటలక్ష్మి కూతురు వరలక్ష్మి లుగా గుర్తింపు వరలక్ష్మి ఏలూరు మున్సిపల్ కార్పొరేషన్ కార్యాలయంలో ఆఫీస్ సబార్డినేట్ గా విధులు నిర్వహిస్తుంది. ఆమె దివ్యాంగురాలు కావడంతో తల్లి సాయంతో విధులు నిర్వహిస్తుంది తల్లి కుమార్తెలుద్దరూ ప్రైవేట్ ఫంక్షన్ కు హాజరయ్యేందుకు శుక్రవారం ఊరికి వెళ్లారు అప్పటినుండి వీరి జాడ కనబడడం లేదు. జీడి మామిడి తోటలో శవాలుగా కనిపించారు.. ఎక్కడైనా హత్య చేసి ఎక్కడ తీసుకు వచ్చారా,? ఇక్కడే హత్య చేశారా అన్న కోణంలో పోలీసులు దర్యాప్తు కొనసాగిస్తున్నారు ఏలూరు డిఎస్పి శ్రావణ్ కుమార్ ఘటన స్థలానికి చేరుకుని పూర్తి వివరాలు సేకరిస్తున్నారు..మృతదేహాలు కొంత కుళ్ళిన స్థితిలో ఉన్నాయి.

# డీఎస్సీ అవకతవకలపై అనంతపురంలో వైసీపీ ఆందోళన

**అనంతపురం (భారత శక్తి)**డీఎస్సీ పరీక్షలో అవకతవకలు జరిగాయయని అనంతపురం లో వైకాపా అందోళనకు దిగింది. కలెక్టర్ కార్యాలయం ఎదుట జరిగిన ధర్నాలె వైసీపీ జిల్లా అధ్యక్షుడు మాజీ ఎమ్మెల్యే అనంత వెంకటరామిరెడ్డి తదితరులు పాల్గోన్నారు. ఈ కార్యక్రమంలో పార్టీ నేతలు, కార్యకర్తలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

# కూట్లో రాయి తీయలేనోడు ఏట్లో రాయి తీస్తాడటా

**(భారత శక్తి)** అస్థిత్వం,ఆత్మగౌరవం దెబ్బతీసేలా మాట్లాడిన పవన్ కళ్యాణ్ బీజేపీ ఎజెండా మోస్తున్నారు.తెలంగాణ మీద విషం కక్కి తెలంగాణ ప్రజల చూపు పడితే కోనసీమ కొబ్బరి చెట్లు ఎండిపోతున్నాయని చెప్పిన పవన్ కళ్యాణ్ తెలంగాణ ప్రజలకు క్షమాపణలు చెప్పాలి.తెలంగాణ ఏర్పడితే 11 రోజులు అన్నం మానేసినా అని బహిరంగంగా చెప్పిన వ్యక్తి తెలంగాణ ఆవిర్భావ దినోత్సవ వేడుకల్లో పాల్గొంటే మాకు అభ్యంతరం లేదు కానీ ఇక్కడ నవ నిర్మాణ సభ పెడితే తీవ్ర ఆక్షేపిస్తున్నాం.కన్న తల్లికి గాజులు కొనలేని వాడు పినతల్లి కి ఒడ్డాణం చేస్తారని సమేత ఉంది కుట్ల రాయి తీయలేని వాడు ఎట్లా రాయి తీస్తాడా,తెలంగాణ ఆవిర్భావ నేడు దినోత్సవం దీనిని ప్రతి తెలంగాణ బిడ్డ వేడుకల పండగల జరుపుకుంటాం.ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం కలిసి విడిపోయిన రాష్ట్రంగా మాకు ప్రేమ ఉంటదిభారతీయులుగా ఇతర రాష్ట్రాలను గౌరవించాలి అవమాన పరుచుకోవద్దు,తెలంగాణ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా ఆవిర్భావ దినోత్సవ వేడుకల్లో పాల్గొనాలనుకుంటే ఎవరైనా పాల్గొనచ్చు.ఆంధ్రపదేశ్ ఉప ముఖ్యమంత్రి గా చేయలేనిది ఇక్కడికి వచ్చి నవ నిర్మాణ సభ పెడితే ఎవరు వినడానికి సిద్దంగా లేరు.తెలంగాణ ఏర్పడితే 11 రోజులు అన్నం తినను అన్న వెధవ వచ్చి. ఇక్కడ తెలంగాణ పట్ల మొసలి కన్నీరు కారిస్తే ఒప్పుకోము వాస్తవంగా పవన్ కళ్యాణ్ సినిమా నటుడు.తెలంగాణ లో విద్వేషాలు రెచ్చగొట్టేలా మాట్లాడి తెలంగాణ వాతావరణాన్ని కలుషితం చేయాలని బీజేపీ తో లోపాయికారి ఒప్పందం చేసుకొని పవన్ కళ్యాణ్ ఈ నటన స్టార్ట్ చేశారు.2014 లో నేను పార్లమెంట్ సభ్యుడిగా ఉన్నప్పుడు పోచేస్తున్నప్పుడు పవన్ కళ్యాణ్ ఇక్కడికి వచ్చారు తొడకలు తీస్తాం అని చెప్పం తెలంగాణ కళ్ళ దృష్టి పడితే కోనసీమ కొబ్బరి చెట్లు ఎండిపోయాయనీ చెప్పిన పవన్ కళ్యాణ్ తెలంగాణ రక్తం ఉన్న ఏ బిడ్డ ఆయన సభకు పోరు.తెలంగాణ ప్రజల ఆత్మగౌరవసినిమాల్లో దేశభక్తిక చూపించడం కాదు నిజ జీవితంలో దేశభక్తి చూయించు పవన్ కళ్యాణ్. దేశంలో నిరుద్యోగం పెరుగుతుంది. నిరుద్యోగులంతా ఇబ్బంది పడుతున్నారు. మీ ఫ్యాన్స్ చాలామంది నిరుద్యోగులే ఉన్నారు చేతనైతే వారికి ఉద్యోగాలు ఇప్పించు కేవలం జై జైలు కొట్టించుకొని పస్తులు ఉంచడం తగదు.

# శ్రీ భీమేశ్వర స్వామి ఆలయంలో భక్తుల రద్దీ ఏర్పాట్లను పరిశీలించిన ఈవో



**వేములవాడ (భారత శక్తి)** రాజన్న సిరిసిల్ల జిల్లాలోని వేములవాడ శ్రీ రాజరాజేశ్వర స్వామి దేవస్థానం అనుబంధ ఆలయమైన శ్రీ భీమేశ్వర స్వామి ఆలయంలో సోమవారం భక్తుల రద్దీ నెలకొంది. వేసవి సెలవులు ముగింపు దశకు చేరుకోవడంతో విద్యార్థులు తిరిగి పాఠశాలలు,హాస్టళ్లకు వెళ్లే ముందు కుటుంబ సభ్యులతో కలిసి స్వామివారిని దర్శించుకోవడానికి పెద్ద సంఖ్యలో ఆలయానికి తరలివచ్చారు.ఉదయం నుంచే భక్తులు స్వామివారికి తలనీలాలు సమర్పించి, కోడె మొక్కులు చెల్లించుకున్నారు. అలాగే రుద్రాభిషేకం, అన్నపూజ, నిత్య చండీహోమం, నిత్య కల్యాణం, శ్రీ సత్యనారాయణ స్వామి వ్రతం, లింగార్చన, ఆకుల పూజ తదితర విశేష పూజల్లో పాల్గొని మొక్కులు తీర్చుకున్నారు.

అనంతరం ఆలయ అర్చకులు భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు.భక్తుల రద్దీ అధికంగా ఉండటంతో ఆలయ ఈవో ఎల్. రమాదేవి ప్రత్యేక ఏర్పాట్లు చేపట్టారు. ఆలయ సిబ్బందికి ప్రత్యేక విధులు కేటాయించి, ఉచిత దర్శనం, శీఘ్ర దర్శనం, అతి శీఘ్ర దర్శనం, కోడె మొక్కుల క్యూలైన్ల వద్ద ఏర్పాట్లను స్వయంగా పరిశీలించారు. భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా తాగునీరు, క్యూలైన్లు, ఇతర సౌకర్యాలపై అధికారులను ఆదేశించారు.

# బద్వేలు మున్సిపల్ కమిషనర్‌గా హరినాథ్



**బద్వేలు (భారత శక్తి)** బద్వేలు మున్సిపాలిటీ కమిషనర్ గా హరినాథ్ సోమవారం బాధ్యతలు స్వీకరించారు గతంలో కమిషనర్ గా ఉన్న నరసింహారెడ్డి ఆరు నెలలపాటు సెలవుపై వెళ్లడంతో ఆయన స్థానంలో హరినాధు ను ప్రభుత్వం నియమించింది

# టిమ్స్ మార్చురీ తరలించాలి

- పలు కాలనీల ప్రజల ఆందోళన - దుర్వాసనలు, అంబులెన్స్ శబ్దాలు, ప్రజారోగ్య సమస్యలు తలెత్తే అవకాశం ఉంది
- ప్రజల మానసిక ప్రశాంతతకు భంగం కలుగుతుంది - ఆసుపత్రి సేవలకు వ్యతిరేకం కాదు,స్థానికుల ఇబ్బంది కలుగద్దు
- మార్చురీ సమీపంలో ప్రభుత్వ స్కూల్స్, కాలేజీ ఆరోగ్య కేంద్రం,ప్రభుత్వ కార్యాలయాలు
- దుర్వాసనలు, అంబులెన్స్ శబ్దాలు, ప్రజారోగ్య సమస్యలు తలెత్తే అవకాశం ఉంది
- ప్రజల మానసిక ప్రశాంతతకు భంగం కలుగుతుంది - ఆసుపత్రి సేవలకు వ్యతిరేకం కాదు,స్థానికుల ఇబ్బంది కలుగద్దు
- సీఎం రేవంత్ రెడ్డి, ఆరోగ్య మంత్రి దామోదర్ రాజనర్సింహకు కాలనీ వాసుల విజ్ఞప్తి




**(భారత శక్తి)** సనత్ నగర్ టిమ్స్ ఆసుపత్రి ప్రాంగణంలో శవాలను భద్రపరిచే మార్చురీని తరలించాలని పలు కాలనీవాసులు డిమాండ్ చేస్తున్నారు.సనత్ నగర్ టీమ్స్ ఆస్పత్రి లో నిర్మించిన శవాలను భద్రపరిచే మార్చురీని వెంగళరావునగర్ కాలనీ ప్రధాన రోడ్డును ఆనుకొని నిర్మించారు,మార్చురీ చుట్టుపక్కల సిద్ధార్థ నగర్ మధుర నగర్,కళ్యాణ్ నగర్ కాలనీలతో పాటు జవహర్ నగర్,వికాస్ పూరి కాలనీలు ఉన్నాయి అంతేకాదు సమీపంలోనే రాష్ట్రస్థాయి మహిళ శిశు సంక్షేమ ఆరోగ్య కేంద్రాలు, డ్రగ్ కంట్రోల్ కార్యాలయం, ప్రభుత్వ,ప్రైవేటు స్కూల్స్ కాలేజీలు ఉన్నాయి.అంతే కాదు వెంగళ్ రావు నగర్ చౌరస్తా నుంచి రాజీవునగర్,మోతినగర్ మీదుగా బోరబండ వరకు ప్రధాన మార్గం,కృష్ణకాంత్ పార్క్ మీదుగా జూబ్లీహిల్స్ వైపు ప్రధాన మార్గం కావడంతో నిత్యం రద్దీగా ఉంటుంది. ఉదయం నుంచి సాయంత్రం వరకు ఈ ప్రాంతంలో ప్రజల జీవనం సాగిస్తారు అలాంటి ప్రదేశంలో శవాలను భద్రపరిచే గది మార్చురిని ఏర్పాటు చేయడం పట్ల కాలనీవాసులతోపాటు వైద్య శాఖలో పనిచేసే ఉద్యోగులు డ్రగ్స్ కంట్రోల్ అధికారులు విద్యార్థుల తల్లిదండ్రులు ఆందోళన చెందుతున్నారు. ఈ ప్రాంతంలో మార్చురీ ఏర్పాటు చేయడం వల్ల చుట్టుపక్కల ప్రాంతాల ప్రజలకు పలు సమస్యలు తలెత్తుతాయని ముఖ్యంగా దుర్గంధం,దుర్వాసనతో పాటు రాత్రి పగలు అంబులెన్స్ శబ్దాలు.... చనిపోయిన వారి కుటుంబాల ఆర్తనాధానాలతో ఈ ప్రాంతమంతా భయానకంగా మారుతుందని చుట్టుపక్కల కాలనీలవాసులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.వెంగళ్ రావు నగర్ ప్రధాన రహదారి పక్కన, నివాస ప్రాంతానికి సమీపంలో మార్చురీ ఏర్పాటు చేయడం వల్ల స్థానిక ప్రజలపై ప్రతికూల ప్రభావం పడే అవకాశం ఉందని స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఆసుపత్రి ప్రాంగణంలోనే ఇతర ఖాళీ స్థలాలు అందుబాటులో ఉన్నప్పటికీ ప్రజలు అధికంగా నివసిస్తున్న ప్రాంతానికి ఆనుకుని మార్చురీ నిర్మాణాన్ని చేపట్టడం సరికాదని కాలనీల సంక్షేమ సంఘాల ప్రతినిధులు అంటున్నారు.ఈ అంశంపై గత కొన్ని నెలలుగా ఆసుపత్రి అధికారులు, ఆరోగ్య శాఖ ఉన్నతాధికారులు, ప్రజాప్రతినిధులకు పలుమార్లు వినతిపత్రాలు సమర్పించినప్పటికీ ఇప్పటివరకు సమస్య పరిష్కారానికి స్పష్టమైన చర్యలు కనిపించలేదని కాలనీ ప్రతినిధులు తెలిపారు. మృతదేహాల రవాణా వాహనాల రాకపోకలు, ప్రజారోగ్య సమస్యలు, మానసిక ఇబ్బందులు తలెత్తే అవకాశాన్ని దృష్టిలో ఉంచుకుని మార్చురీని ఆసుపత్రి ప్రాంగణంలోనే ప్రజలకు ఇబ్బంది కలగని అనువైన ప్రాంతానికి తరలించాలని కోరుతున్నారు.ఆసుపత్రి సేవలను లేదా వైద్య మౌలిక సదుపాయాల అభివృద్ధిని తాము వ్యతిరేకించడం లేదని, ప్రజల జీవన నాణ్యతకు భంగం కలగకుండా ప్రత్యామ్నాయ స్థలాన్ని ఎంపిక చేయాలని మాత్రమే కోరుతున్నామని స్థానికులు అంటున్నారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, ఆరోగ్య మంత్రి దామోదర్ రాజనర్సింహ,వైద్య శాఖ ఉన్నతాధికారులు జీహెచ్ఎంసీ అధికారులు వెంటనే జోక్యం చేసుకుని సమస్యను పరిష్కరించాలని పలు కాలనీ ప్రజలు విజ్ఞప్తి చేస్తున్నారు. ఇక్కడి నుండి శవాలను భద్రపరిచే మార్చురిని తరలించకపోతే అన్ని కాలనీల ప్రజలతో కలిసి జేఏసీ ఏర్పాటు చేసి పెద్ద ఎత్తున నిరసన కార్యక్రమాలు, ఆందోళనలతో పాటు న్యాయపోరాటం చేస్తామని కాలనీలో సంక్షేమ సంఘాల ప్రతినిధులు హెచ్చరిస్తున్నారు.

# రైతులకు సకాలంలో విత్తనాలు, ఎరువులు అందించాలి

- సబ్ కలెక్టర్ కి వినతి



**పాడేరు(భారత శక్తి)** అల్లూరి జిల్లా ఆదివాసిలకు ఖరీఫ్ సీజన్లో రైతులకు, సకాలంలో సబ్సిడీ విత్తనాలు, ఎరువులు ఆదివాసి రైతులకు సకాలంలో అందించాలని ఆంధ్రప్రదేశ్ గిరిజన సమాఖ్య ఆధ్వర్యంలో ఈరోజు సబ్ కలెక్టర్ గారికి వినతి పత్రం ఇవ్వడం జరిగింది. ఈ సందర్భంగా సిపిఐ పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి పి సత్యనారాయణ, గిరిజన సమాఖ్య జిల్లా ప్రధాన కార్యదర్శి కూడ రాధాకృష్ణ. గిరిజన సమాఖ్య జిల్లా అధ్యక్షులు నాగేశ్వరరావు మాట్లాడుతూ: ఆదివాసిలకు ఖరీఫ్ సీజన్లో రైతులకు, సకాలంలో సబ్సిడీ విత్తనాలు, ఎరువులు మరియు ఖరీఫ్ సీజన్లో రైతు భరోసా రైతులకు అందిస్తే, రైతుల వ్యవసాయానికి విత్తనాలు లాంటిది కొనుక్కోవడానికి రైతులకు ఉపయోగపడుతుందని తొలకరి వర్షాలు పడుతుండడంతో రైతులు ముమ్మరంగా వ్యవసాయ సాగులో నిమగ్నమవుతారు కనుక తక్షణమే సకాలంలో ప్రభుత్వం సబ్సిడీ మీద విత్తనాలు ఎరువులు రైతులకు పంపిణీ చేయాలని ఆంధ్ర ప్రదేశ్ గిరిజన సమాఖ్య నాయకులు ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు ఈ కార్యక్రమంలో సిపిఐ పార్టీ జిల్లా సమితి సభ్యులు పెట్ల పోతురాజు, సింహాచలం అమర్ కే రాజు లక్ష్మణ్ తదితరులు పాల్గొన్నారు.

# మారేడుపల్లి పోలీస్ స్టేషన్ పరిధిలో దారుణ హత్య



**సికింద్రాబాద్.(భారత శక్తి)** మారేడుపల్లి పోలీస్ స్టేషన్ పరిధిలో శ్రవణ్ అనే వ్యక్తి దారుణ హత్యకు గురయ్యాడు. సంజీవయ్య నగర్ కు చెందిన శ్రవణ్ తన స్నేహితుడైన నిఖిల్ తో కలిసి మద్యం సేవించినట్లు పోలీసులు తెలిపారు. నిన్న రాత్రి మద్యం సేవించిన అనంతరం ఇద్దరి మధ్య మాట మాటా పెరగడంతో నిఖిల్ తన వద్ద ఉన్న కత్తితో విచక్షణ రహితంగా శ్రవణ్ పై దాడి చేయడంతో తీవ్ర గాయాల పాలై అక్కడికక్కడే మరణించాడు. మద్యం సేవించిన మత్తులో ఈ గొడవ తలెత్తి వాగ్వాదం జరిగినట్లు పోలీసులు తెలిపారు. ఈ ఘటనపై కేసు నమోదు చేసుకున్న మారేడుపల్లి పోలీసులు దర్యాప్తు ప్రారంభించారు. ఇద్దరి మధ్య కొన్నాళ్లుగా గొడవలు జరుగుతున్న నేపథ్యంలో ఈ హత్య జరిగి ఉండవచ్చని పోలీసులు భావిస్తున్నారు.

# అనుమానాస్పద స్థితిలో వ్యక్తి మృతి

**నందిగామ (భారత శక్తి)**నందిగామ శివారు లో అనుమానాస్పద స్థితిలో వ్యక్తి మృతి చెందాడు. పాము కరిచి చనిపోయినట్లు అనుమానం. నందిగామ పోలీసులు కేసు నమోదు చేసారు. మృతుడు నందిగామ పట్టణ గ్రామానికి చెందిన కీసర ఆది. ఇతనికి భార్య, ముగ్గురు ఆడపిల్లలు ఉన్నారు. మామిడి తోటల్లో కాపలాదారుగా పనిచేస్తూ కుటుంబాన్ని పోషించుకుంటున్నాడు.నందిగామ పట్టణ శివారు పెద్ద బ్రిడ్జి సమీపంలో మామిడి తోటలో అనుమానాస్పద స్థితిలో విగతజీవిగా కనిపించాడు. సమాచారం అందుకున్న నందిగామ పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాన్ని పరిశీలించారు.మృతికి గల కారణాలు తెలియాల్సి ఉంది దీనిపై నందిగామ పోలీసులు దర్యాప్తు చేపట్టారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం నందిగామ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.

# జీవితంలో ఉన్నత శిఖరాలకు చేరాలంటే విద్యతోనే సాధ్యం

- పతిభా పురస్కారాల ప్రదానోత్సవంలోకంటోన్మెంట్ ఎమ్మెల్యే శ్రీగణేష్
- శ్రీగణేష్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో మడ్ ఫోర్డ్ పాఠశాలలో అభినందన సభ

శ్రీగణేష్**(భారత శక్తి)** ఫౌండేషన్ తరపున కంటోన్మెంట్ ఎమ్మెల్యే శ్రీగణేష్ నియోజకవర్గంలోని ప్రభుత్వ పాఠశాలలు, జూనియర్ కళాశాలల్లో అత్యంత ప్రతిభ కనబరిచిన 45 మంది ప్రతిభావంతులైన విద్యార్థినీ, విద్యార్థులకు మడ్ ఫోర్డ్ పాఠశాలలో సోమవారం అభినందన సభ నిర్వహించి మెరిట్ స్కాలర్‌షిప్‌లు, ప్రశంసా పత్రాలను అందజేశారు.

ఈ సందర్భంగా ఎమ్మెల్యే శ్రీగణేష్ మాట్లాడుతూ, ప్రభుత్వ విద్యాసంస్థల్లో చదివి అత్యుత్తమ ఫలితాలు సాధించిన మీరంతా నియోజకవర్గానికి గర్వకారణమని, విద్యార్థులు భవిష్యత్తులో మరిన్ని ఉన్నత శిఖరాలను అధిరోహించి తల్లిదండ్రులకు, ఉపాధ్యాయులకు, కంటోన్మెంట్‌కు మంచి పేరు తీసుకురావాలని చెప్పారు. మీ విద్యాభివృద్ధికి నా వంతు సహకారం ఎల్లప్పుడూ ఉంటుందని తెలిపారు. కాంగ్రెస్ ప్రభుత్వం గౌరవ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి గారు ప్రభుత్వ విద్యకు అత్యంత ప్రాధాన్యత ఇస్తున్నారని, స్కిల్ యూనివర్శిటీ ఏర్పాటు అందులో భాగమేనని, డబ్బు లేదని ఏ పేద విద్యార్థి చదువు ఆపకూడదనేదే కాంగ్రెస్ ప్రభుత్వ ధ్యేయమని, పేద విద్యార్థులకు మంచి కళాశాలలలో సీట్లు ఇప్పించడానికి తాను కృషి చేస్తానని చెప్పారు.ఈ కార్యక్రమంలో డిప్యూటీ ఇ ఓ విష్ణు వర్ధన్, కో ఆర్డినేటర్ షెడ్రక్, ప్రభుత్వ పాఠశాలల ఉపాధ్యాయులు, కళాశాలల అధ్యాపకులు, తల్లిదండ్రులు, విద్యార్థినీ, విద్యార్థులు, నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ముఖ్య నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# ఫంక్షన్ హాల్ ను పరిశీలించిన ఎమ్మెల్యే మాధవరం

**కూకట్ పల్లి (భారత శక్తి)** కేపి.హెచ్.బి కాలనీ లో సుమారు 2 వేల కోట్ల రూపాయలు విలువ చేసే భూములను ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అమ్ముకొని డబ్బు దండుకున్నాడే తప్ప దానిలో 10 శాతం తన నియోజకవర్గానికి కేటాయిస్తే అన్ని రంగాలలో అభివృద్ధి చెందుతుందని ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు అన్నారు.

ఈ రెండున్నర ఏళ్ల కాలంలో రాష్ట్రాన్ని నియోజకవర్గాన్ని అభివృద్ధి విషయంలో ముందుకు పోనివ్వకుండా రాష్ట్ర ప్రభుత్వం నిధులు ఇవ్వడం లేదంటూ ఆరోపించారు. పేదల కోసం తమ ప్రభుత్వంలో కట్టిన మల్టీపర్పస్ ఫంక్షన్ హాల్ మొత్తం శిథిలావస్థల ఉండడం పైన ఆగ్రహం వ్యక్తం చేశారు. ఫంక్షన్ చేసుకునేందుకు నిరుపేదలకు ఉపయోగపడే వీటిని నిర్లక్ష్యంగా వదిలేయడంతో అధికారులపై అసహనాన్ని వ్యక్తం చేశారు. మరోవైపు ప్రభుత్వ డబ్బులతో కట్టిన భవనాలు కాంగ్రెస్ పార్టీ కార్యాలయాలు గా ఉంటున్నాయని ఏ అధికారంతో వారు తాళాలను దగ్గర పెట్టుకుంటున్నారని ప్రశ్నించారు. రాజకీయం అంటే ప్రజలకు మంచి చేసి ముందుకెళ్లాల్సిన వీరు నీచమైన శైలిలో వ్యవహరిస్తున్నారని మండిపడ్డారు. ఇప్పటికైనా సైబరాబాద్ మునిసిపల్ కమిషనర్ తో పాటు జోనల్ కమిషనర్ క్షేత్రస్థాయిలో పరిశీలించి ప్రజా అవసరాలను గుర్తించి వాటిని ఉపయోగంలోకి తీసుకొని రావాలని అన్నారు.

# పేకాట శిబిరంపై దాడి.. 12 మంది అరెస్టు

**ఏలూరు (భారత శక్తి)** నిఘానేత్రం మూడో కన్ను తెరిచింది. నూజివీడులో పేకాట స్థావరంపై పోలీసులు మెరుపు దాడి చేసారు. గత రెండు నెలలుగా పోలీసులు కళ్ళుగట్టి పేకాట రాయుళు పేకాట స్థావరాలను నిర్వహిస్తున్నారు. పక్కా సమాచారంతో స్పెషల్ బ్రాంచ్, రూరల్ సీఐ నాగేంద్ర కుమార్ సిబ్బందితో పేకాట శిబిరంపై మెరుపు దాడి చేసారు. 12 మంది జూదగాళు అరెస్ట్ అయ్యారు. 9 లక్షల 36 వేల రూపాయలు నగదు,21 సెల్‌ఫోన్లు,5 ద్విచక్ర వాహనాలు స్వాధీనం చేసుకున్నారు. రూరల్ సీఐ నాగేంద్ర కుమార్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

# జిల్లా ఆడిట్ అధికారిగా సోమవారం బాధ్యతలు చేపట్టిన సి హెచ్ బాలరాం



కామారెడ్డి జిల్లా (భారత శక్తి ప్రతినిధి) జూన్ 01: సి హెచ్ బాలరాం జిల్లా ఆడిట్ అధికారిగా సోమవారం బాధ్యతలు స్వీకరించిన సందర్భంగా జిల్లా కలెక్టర్ ఆశిష్ సాంగ్వాన్ ను మర్యాద పూర్వకంగా కలసి పూల మొక్క ను అందించారు.

# ఇసుక దందాలో డబ్బులు తీసుకున్నట్లు నిరూపిస్తే రాజీనామా చేస్తా మంత్రి అడ్లూరి



జగిత్యాల, జూన్ 1 (భారత్ శక్తి): ఇసుక దందాలో తాను డబ్బులు తీసుకున్నట్లు నిరూపిస్తే మంత్రి పదవికి రాజీనామా చేస్తానని రాష్ట్ర సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ అన్నారు. పెద్దపల్లి జిల్లా ధర్మారం మండలంలో అకాల వర్షాల నష్టాన్ని పరిశీలించిన అనంతరం ఆయన మీడియాతో మాట్లాడారు. మాజీ మంత్రి కొప్పుల ఈశ్వర్ ఆధారాలు లేకుండా ఆరోపణలు చేస్తున్నారని, బీఆర్ఎస్ పాలనలోనే ఇసుక అక్రమ రవాణా విస్తృతంగా జరిగిందని మంత్రి విమర్శించారు. తాను ఇసుక దందాలో డబ్బులు తీసుకున్నట్లు నిరూపిస్తే వెంటనే రాజీనామా చేసేందుకు సిద్ధమని స్పష్టం చేశారు.అకాల వర్షాల వల్ల తడిసిన ధాన్యం, మొక్కజొన్నలను ప్రభుత్వం కొనుగోలు చేస్తుందని, నష్టపోయిన రైతులకు పరిహారం అందిస్తామని మంత్రి హామీ ఇచ్చారు. రైతులు ఆందోళన చెందవద్దని కోరారు.

# స్మశాన వాటిక అభివృద్ధికి మున్సిపాలిటీ పూర్తి సహకారం

**- చైర్‌పర్సన్ ఇప్ప ఉమారాణి శ్రీనివాస్**



కామారెడ్డి జిల్లా (భారత శక్తి ప్రతినిధి) జూన్ 01: 8వ వార్డు మున్సిపల్ స్మశాన వాటిక అభివృద్ధిని మున్సిపాలిటీ అడ్డుకుంటోందనే ప్రచారం పూర్తిగా అవాస్తవం అని చైర్‌పర్సన్ ఇప్ప ఉమారాణి శ్రీనివాస్ అన్నారు.జూన్ 5న మున్సిపల్ కౌన్సిల్ సమావేశంలో ఈ అంశానికే తొలి ప్రాధాన్యత అని తెలిపారు.జిల్లా కలెక్టర్ కార్యాలయం నుండి నిబంధనల ప్రకారం అనుమతులు రాగానే తదుపరి చర్యలు వేగవంతంచేస్తామని, డీటెయిల్డ్ ప్రాజెక్ట్ రిపోర్ట్ (డిపిఆర్) తయారీలో ఉందని తెలిపారు.అన్ని అనుమతులు పూర్తి కాగానే నిర్మాణానికి ముందుకు వచ్చిన స్వచ్ఛంద సంస్థకు పూర్తి నిర్మాణ బాధ్యతలు అప్పగిస్తామని తెలిపారు.ప్రజలకు మెరుగైన సౌకర్యాలు, పరిశుభ్రమైన వాతావరణం, అవసరమైన మౌలిక వసతులు కల్పించడమే మున్సిపాలిటీ ధ్యేయం అని అన్నారు.ప్రజల సంక్షేమానికి సంబంధించిన ప్రతి అంశంలో పారదర్శకంగా వ్యవహరిస్తూ అభివృద్ధికి కట్టుబడి ఉన్నామని,త్వరలోనే ఈ స్మశాన వాటికను అన్ని హంగులతో ఆదర్శవంతమైన సదుపాయంగా తీర్చిదిద్దుతామని కామారెడ్డి మున్సిపాలిటీ చైర్‌పర్సన్ శ్రీమతి ఇప్ప ఉమారాణి శ్రీనివాస్ తెలిపారు.

# సాయిపేట గ్రామంలో ఆకస్మికంగా పర్యటించిన ఎమ్మెల్యే కడియం శ్రీహరి



జనగామ(భారత శక్తి)జూన్ 1: ధర్మసాగర్ మండలం సాయిపేట గ్రామంలో మాజీ ఉప ముఖ్యమంత్రి, స్టేషన్ ఘనపూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరి ఆకస్మికంగా పర్యటించారు. ఈ సందర్భంగా గ్రామంలో ప్రధాన రహదారి వెంట సైడ్ డ్రైన్ లేక మురుగు నీరు రోడ్డుపై ప్రవహిస్తుండడంతో వెంటనే సైడ్ డ్రైన్ నిర్మాణానికి ప్రతిపాదనలు సిద్ధం చేయాలని గ్రామ సర్పంచ్ కు సూచించారు. డ్రైనేజి నిర్మాణానికి పదిహేను లక్షలు మంజూరు ఇస్తానని అతి త్వరలో పనులు ప్రారంభించనున్నట్లు గ్రామస్తులకు హామీ ఇచ్చారు. ఇప్పటికే గ్రామ పంచాయతీ భవనం మంజూరు అయిందని అన్నారు. త్వరలోనే రెండవ విడత ఇందిరమ్మ ఇండ్లు మంజూరు చేయనున్నట్లు తెలిపారు. సాయిపేట గ్రామ అభివృద్ధికి అన్ని విధాలా పూర్తి సహాయ సహకారాలు అందిస్తానని చెప్పారు. ఈ కార్యక్రమంలో స్థానిక సర్పంచ్ లక్ష్మి నాగరాజు, ఉప సర్పంచ్ రాజేందర్, వార్డు సభ్యులు, మహిళలు, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

# గ్రామ పంచాయతీ ఉద్యోగ కార్మికుల సమస్యలు పరిష్కరించాలి:బస్వ రామచందర్



దేవరుప్పుల (భారత శక్తి)జూన్ 1: తెలంగాణ గ్రామ పంచాయతీ ఎంప్లాయిస్ అండ్ వర్కర్స్ యూనియన్ (సిఐటియు) దేవరుప్పుల మండల అధ్యక్షుడు సంగి కరుణాకర్ ఆధ్వర్యంలో ఎంపీడీవో కార్యాలయం ముందు ధర్నా నిర్వహించిన అనంతరం ఎంపీడీవో మేనక పౌడెల్ కి వినతి పత్రాన్ని అందజేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా సీఐటీయూ జనగామ జిల్లా ప్రధాన కార్యదర్శి బస్వ రామచందర్ హాజరై మాట్లాడుతూ గ్రామపంచాయతీ ఉద్యోగ కార్మికులు గత నలభై సంవత్సరాల పైబడి పని చేస్తూ గ్రామాలలో మంచినీటి సరఫరా వీధిలైట్లు ట్రాక్టర్ నిర్వహణ డంపింగ్ యార్డ్ అనేక పనులలో నిమగ్నమై గ్రామాలను సస్యశ్యామలంగా ఉంచుతున్న పంచాయతీ ఉద్యోగుల పట్ల ప్రభుత్వాలు మారిన పాలకులు మారిన గ్రామపంచాయతీ ఉద్యోగ కార్మికుల తలరాత మారని పరిస్థితి ఉందని అన్నారు. ఇప్పటికీ కనీస వేతనాలు అమలుకు నోచుకోని దుర్భర పరిస్థితి ఉందని,ముఖ్యమంత్రి పంచాయతీ శాఖను రివ్యూ చేస్తూ పంచాయతీ సిబ్బందికి ప్రతి నెల ఒకటో తారీకు వేతనాలు చెల్లిస్తాహామి ఇవ్వడం జరిగిందని,వారికి యూనియన్ తరపున ధన్యవాదాలు తెలుపుతూ రాష్ట్రంలో గత ప్రభుత్వం తీసుకొచ్చిన మల్టీపర్పస్ వర్కర్ విధానం వల్ల నైపుణ్యం లేని పనులు చేయడం వల్ల అనేకమంది చనిపోయిన పరిస్థితి ఉందని తెలిపారు.ఈ విధానం వల్ల ఉద్యోగ భద్రత కోల్పోయి తీవ్ర నష్టాన్ని చవిచూస్తున్నారని,తక్షణమే రాష్ట్ర ప్రభుత్వం పునరాలోచించి కనీస వేతనాలు ఇరవైఆరు వెయ్యిలుగా నిర్ణయించే అమలు చేయాలని,మల్టీపర్పస్ వర్కర్ విధానాన్ని పూర్తిగా రద్దు చేయాలని,రెండో పిఆర్సిలో పంచాయతీ ఉద్యోగులకు అవకాశం కల్పించాలని కోరారు.ఇందులో పనిచేస్తున్న కారోబార్,బిల్ కలెక్టర్లకు ప్రత్యేక స్టేటస్ ఇవ్వాలని, ఉద్యోగ భద్రత కల్పిస్తూ పర్మనెంట్ చేయాలని, ఇన్సూరెన్స్ సౌకర్యం కల్పించాలని, దానకర్చులకు ముప్పై వెయ్యిలరూపాయలు చెల్లించాలని, సౌకర్యాలు అమలు చేయాలని, రాష్ట్రవ్యాప్త పిలుపులో భాగంగా ఈరోజు ఎంపీడీవో కార్యాలయం ముందు ధర్నా చేపట్టడం జరిగిందని తెలిపారు. రాబోయే కాలంలో గ్రామ పంచాయితీగా కార్మికుల సమస్యల పరిష్కరించని యెడల పెద్ద ఎత్తున ఉద్యమించి అవసరమనుకుంటే సమ్మెకు పోవడానికి కూడా వెనకాడమని అన్నారు. ఈ కార్యక్రమంలో దేవర్పుల మండల అధ్యక్షుడు సంఘీ కరుణాకర్, ఉపాధ్యక్షుడు వారాల సోమరాజు, కోశాధికారి ఎడవెల్లి వెంకటరెడ్డి, బిక్కు, రమేష్, ఉప్పుల ఐలయ్య, గోడిశాల సోమయ్య, జోగు కలమ్మ, రమణ, లావణ్య, రేణుక, పద్మ, జయమ్మ, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# పర్యావరణ పరిరక్షణలో ప్రజల భాగస్వామ్యం కీలకం

**- జూన్ 1 నుంచి 12 వరకు జిల్లావ్యాప్తంగా ప్రత్యేక కార్యక్రమాలు : జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్**



సంగారెడ్డి,భారతశక్తి, జూన్ 1:పర్యావరణ పరిరక్షణ, జీవవైవిధ్య సంరక్షణ, ప్లాస్టిక్ నిర్మూలనలో ప్రజల భాగస్వామ్యం అత్యంత కీలకమని జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్ అన్నారు. ప్రజా పాలన ప్రగతి ప్రణాళికలో భాగంగా జూన్ 1 నుంచి 12 వరకు జిల్లావ్యాప్తంగా అటవీ శాఖ ఆధ్వర్యంలో విస్తృత స్థాయిలో పర్యావరణ అవగాహన, ప్రకృతి సంరక్షణ కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. సోమవారం కలెక్టరేట్ గ్రీవెన్స్ హాల్‌లో అడిషనల్ కలెక్టర్లు సంగీత, పాండు, జిల్లా అటవీ శాఖ అధికారితో కలిసి నిర్వహించిన సమావేశంలో కలెక్టర్ కార్యక్రమాల వివరాలను వెల్లడించారు. జిల్లా కేంద్రంతో పాటు అన్ని డివిజన్ కేంద్రాల్లో వివిధ కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు తెలిపారు. విద్యా సంస్థలలో క్విజ్ పోటీలు, పర్యావరణ అవగాహన సదస్సులు నిర్వహించనున్నట్లు తెలిపారు. యువత, స్వచ్ఛంద సంస్థలు, ప్రజల భాగస్వామ్యంతో పర్యావరణ అవగాహన సదస్సులు, ప్లాస్టిక్ నిర్మూలన కార్యక్రమాలు చేపట్టనున్నట్లు చెప్పారు .ప్రపంచ పర్యావరణ దినోత్సవాన్ని పురస్కరించుకుని వనమహోత్సవం, అధిక సాంద్రతతో మిశ్రమ మొక్కల నాటకం, గృహావసర మొక్కల పంపిణీ కార్యక్రమాలు నిర్వహించనున్నారు. అలాగే మంజీరా వన్యప్రాణి అభయారణ్యం, కమలాపూర్ సరస్సు ప్రాంతాల్లో ప్రకృతి సందర్శన కార్యక్రమాలు, స్వయం సహాయక సంఘాల ద్వారా పర్యావరణ హిత ఉత్పత్తులపై అవగాహన కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు తెలిపారు.గ్రామ పంచాయతీలు, పాఠశాలల్లో విస్తృత స్థాయిలో మొక్కల నాటడం, అటవీ అగ్నిప్రమాదాల నివారణపై ప్రత్యేక ప్రచార కార్యక్రమాలు చేపట్టనున్నట్లు పేర్కొన్నారు. విద్యార్థులకు మంజీరా పర్యావరణ విద్యా కేంద్రం, అటవీ నర్సరీ, వన దర్శిని కేంద్రాలకు ఎక్స్‌పోజర్ విజిట్లు నిర్వహించి ప్రకృతి, జీవవైవిధ్య పరిరక్షణపై అవగాహన కల్పించనున్నట్లు తెలిపారు. జూన్ 12న జరిగే ముగింపు కార్యక్రమంలో పర్యావరణ పరిరక్షణకు సేవలందించిన స్వచ్ఛంద సంస్థలు, విద్యార్థులు, పాఠశాలలకు, వ్యక్తులకు అవార్డులు ప్రదానం చేయనున్నట్లు కలెక్టర్ తెలిపారు. పర్యావరణ పరిరక్షణ ప్రతి పౌరుడి బాధ్యతని, జిల్లాలో ప్రజలు, యువత, విద్యార్థులు అధిక సంఖ్యలో పాల్గొని కార్యక్రమాలను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. సమావేశం అనంతరం పర్యావరణ పరిరక్షణ, ప్లాస్టిక్ నిషేధం కోసం కృషి చేస్తామని అధికారులు, సిబ్బందితో కలిసి కలెక్టర్ ప్రతిజ్ఞ చేశారు.ఈ కార్యక్రమంలో జిల్లా అధికారులు, అటవీ శాఖ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# ప్రభుత్వ ఆసుపత్రిలో రోగులకు నాణ్యమైన వైద్యం అందాలి

**-నర్సాపూర్ ఏరియా ఆస్పత్రిని ఆకస్మిక తనిఖీ చేసిన ఎమ్మెల్సీ -విధుల పట్ల నిర్లక్ష్యం వహిస్తే కఠిన చర్యలు**

**-రోగులతో స్వయంగా మాట్లాడి, వైద్య సేవలపై ఆరా తీసిన ఎమ్మెల్సీ డా. సి.అంజిరెడ్డి, మున్సిపల్ వైస్ చైర్మన్ బుజ్జేష్ యాదవ్**





మెదక్ నర్సాపూర్, జూన్ 01 (భారత శక్తి న్యూస్): ప్రభుత్వ ఆసుపత్రులకు వచ్చే పేద రోగులకు మెరుగైన, నాణ్యమైన ఉచిత వైద్య సేవలు అందించడమే లక్ష్యంగా అధికారులు, సిబ్బంది బాధ్యతయుతంగా పనిచేయాలని ఎమ్మెల్సీ డా.చిన్నమైల్ అంజిరెడ్డి అన్నారు. సోమవారం మెదక్ జిల్లా నర్సాపూర్ పట్టణంలోని ప్రభుత్వ ఆసుపత్రిని ఆయన ప్రజాప్రతినిధులు, నర్సాపూర్ మున్సిపల్ వైస్ చైర్మన్ బుచ్చేష్ యాదవ్, బి జె పి రాష్ట్ర నాయకులు ఎర్ర గొల్ల మురళి యాదవ్, మెదక్ జిల్లా అధ్యక్షులు మల్లేష్ గౌడ్, నాయకులతో కలిసి ఆకస్మికంగా తనిఖీ చేశారు.ఈ సందర్భంగా ఆసుపత్రిలోని వివిధ వార్డులను సందర్శించి, అందుతున్న వైద్య సేవలు, మందుల లభ్యత, పారిశుధ్య నిర్వహణను ఎమ్మెల్సీ డా.సి.అంజిరెడ్డి, మున్సిపల్ వైస్ చైర్మన్ బుజ్జేష్ యాదవ్,లు పరిశీలించారు. ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న రోగులతో, వారి సహాయకులతో వీరు స్వయంగా మాట్లాడారు. డాక్టర్లు అందుబాటులో ఉంటున్నారా? మందులు బయటకు రాస్తున్నారా? ఆసుపత్రి సిబ్బంది ప్రవర్తన ఎలా ఉంది? అని అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేంద్రం ప్రభుత్వం విద్యా, వైద్యనికి 60 శాతం నిధులు ఖర్చు చేస్తుందన్నారు. పేద ప్రజలకు ఎన్ హెచ్ ఎం కింద ప్రభుత్వ ఆసుపత్రిల్లో నిధులు ఖర్చు చేసేది కేంద్ర ప్రభుత్వమే అని అన్నారు. ప్రభుత్వం పేదల వైద్యం కోసం కోట్ల రూపాయలు ఖర్చు చేస్తోందని, దానికి తగ్గట్టుగా సేవలు అందాలన్నారు. విధుల్లో ఎలాంటి అలసత్వాన్ని, నిర్లక్ష్యాన్ని సహించేది లేదని అధికారులను హెచ్చరించారు. ఆసుపత్రికి వచ్చే ప్రతి ఒక్కరికీ సకాలంలో స్పందించి, నాణ్యమైన వైద్యం అందించి అండగా నిలవాలని ఆదేశించారు.

**- నాలుగు రోజుల్లో పూర్తి చేయండి**

**అదనపు జిల్లా కలెక్టర్ నగేష్ కు ఆదేశాలు**

నాలుగు రోజుల్లో ధ్యానం కొనుగోలు ప్రక్రియ పూర్తి చేయాలని ఎమ్మెల్సీ డా. చిన్నమైల్ అంజిరెడ్డి అధికారులను అదేశించారు. మెదక్ జిల్లా నర్సాపూర్ లోని చిన్నచింతకుంటలో ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ఆయన పరిశీలించి, రైతులతో మాట్లాడి వారి సమస్యలు అడిగి తెలుసుకున్నాను. 20 రోజులుగా కొనుగోలు కేంద్రాలకు ధాన్యం తీసుకువచ్చిన ఇంతవరకు కొనుగోలు చేయడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ క్రమంలో వెంటనే జిల్లా అదనపు కలెక్టర్ నగేష్ కు ఫోన్ మాట్లాడారు.. వచ్చే నాలుగు రోజుల్లో రోజుకు నాలుగు లారీల చొప్పున పంపించి ధాన్యం కొనుగోలును పూర్తి చేయాలని ఆదేశాలు జారీ చేశారు. ఈ కార్యక్రమంలో బీజేపీ రాష్ట్ర నాయకులు, మురళీయాదవ్, మెదక్ జిల్లా అధ్యక్షులు మల్లేశం ,నర్సాపూర్ మున్సిపల్ వైస్ చైర్మన్ బచ్చేష్ యాదవ్ తో పాటు , స్థానిక నాయకులు, ఆసుపత్రి వైద్యులు, మున్సిపల్ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

Printed,Published and Owned by Kesaram Penta Reddy on behalf of Sri Muktheswara Publications, Printed and Published from Sri Muktheswara Publications, Plot No.31, Road No.5, Mallikarjunanagar Colony, Sagar Ring Road Bairamalguda,Hyderabad - 500079, Telangana. Tel: 040-24044446, Fax: 040-24054446, Cell: 9440265569 Email: bharathasakti@gmail.com, RNI No. APTEL/2006/17880, Editor: Kesaram Penta Reddy